www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

టీమ్ ఇండియా.. సూపర్ ఫోర్



టెస్టులు, వన్డేలు, టి20ల్లో నంబర్ వన్

ఇంగ్లండ్‌పై సిరీస్ విజయంతో ముందుకు

టెస్టు చాంపియన్‌షిప్‌లోనూ టాప్‌లోనే

ఏక కాలంలో 4 విభాగాల్లో అగ్రస్థానంలో..

10

సాత్విక్-చిరాగ్ జోడీదే 'ఫ్రెంచ్' కిరీటం

సోమవారం | 11-3-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 326 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి ఉ. 10.46 తదుపరి విదియ; నక్షత్రం: ఉత్తరాభాద్ర రా. 11.04 తదుపరి రేవతి; వర్జ్యం: ఉ. 10.23-11.47; దుర్ముహూర్తం: మ. 12.49-1.37, మ 3.12-3.59; అమృతఘడియలు: రా. 6.50-8.14; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.30; సూర్యాస్తమయం: 6.21 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జగన్.. గ్రాఫిక్స్ 'షో'

మేదరమెట్ల 'సిద్ధం' సభలో మాయ!

సభా ప్రాంగణమంతా గ్రీన్ మ్యాట్

గ్రాఫిక్స్‌తో కనికట్టు చేసే యత్నం

సభకు 15-20 లక్షల మంది

వచ్చారంటూ వైసీపీ నేతల డబ్బా

వంత పాడిన జగన్ రోత మీడియా

ప్రసంగం ఆలస్యంగా ప్రత్యక్ష ప్రసారం

సరిగా చేయని గ్రాఫిక్స్‌తో

అడ్డంగా దొరికిపోయిన వైనం

సోషల్ మీడియాలో చెడుగుడు

డ్రోన్ కెమెరాపైనా సభలో రాద్ధాంతం

లోకేశ్ పంపారని ఆరోపణలు

'ఐ ప్యాక్'దని తేలడంతో గప్‌చుప్

(ఒంగోలు-ఆంధ్రజ్యోతి)

కొన్ని సినిమాలు చూస్తుంటే ఆ దృశ్యాలు నిజంగా ఉన్నట్టుగానే కనిపిస్తాయి కానీ అవన్నీ కల్పితం. గ్రాఫిక్స్ మాయాజాలంతో లేనివి ఉన్నట్టుగా చిత్రీకరించినవి. అచ్చం వైసీపీ ఇలాగే జనం చెవిలో పూలు పెట్టేందుకు ప్రయత్నించి అడ్డంగా దొరికిపోయింది. లేని గొప్పలకు పోయి నవ్వులపాలైంది. ఆదివారం ప్రకాశం జిల్లా మేదరమెట్ల సమీపంలో నిర్వహించిన ముఖ్యమంత్రి జగన్ 'సిద్ధం' సభకు లక్షలకు లక్షలు జనం తరలి వచ్చినట్టు

మిగతా 11వ పేజీలో...



వైసీపీ 'సిద్ధం' సభకు లక్షల్లో జనం వచ్చారంటూ రోత మీడియా చేసిన గ్రాఫిక్స్ మాయాజాలానికి నిదర్శనం ఈ చిత్రం. కొంతమంది జనాన్ని పలుచోట్ల అతకడాన్ని ఫొటోలో చూడొచ్చు. అలాగే జనాన్ని అతికించిన తీరు కూడా తెలిసిపోయేలా ఉంది.

నిష్క్రమణకు సిద్ధమా?



జగన్ మాటల్లో బేలతనం!

బాబు గెలిచినా తన పథకాలు అమలు చేయాలట!

ఓటమి చింత లేదంటూనే పొత్తుపై విసుర్లు

సభలో తొక్కిసలాట.. ఒకరి మృతి

జగన్ బ్లాక్‌మెయిల్!

తన వల్లే ప్రజలు బతుకుతున్నారట

గెలిపించకపోతే పథకాలన్నీ పోతాయని

అడ్డగోలుగా అబద్ధాలు

జగన్ 'సిద్ధం' జనానికి నరకం



2019-24 నడుమ ఎక్కువ కేసులు నమోదైన టీడీపీ నాయకులు, కార్యకర్తలను వెతుక్కుంటూ వచ్చి నామినేటెడ్ పదవులు ఇచ్చే బాధ్యత నాదే. రెండు నెలల్లో టీడీపీ ప్రభుత్వం వస్తుంది. అక్రమ కేసులన్నీ ఎత్తివేయించే బాధ్యతా నాదే.

పాలిచ్చే తెలుగుదేశం ప్రభుత్వం కావాలో.. తన్నే దున్నపోతు వైసీపీ ప్రభుత్వం కావాలో ప్రజలు ఆలోచించాలి. హలో ఏపీ.. బైబై వైసీపీ.

- లోకేశ్

అక్కడ కిమ్.. ఇక్కడ జిమ్!

హెయిర్ స్టైల్ తప్ప.. ఇద్దరూ ఒకటే: లోకేశ్

కొరియా పాలకుడికి 17 ప్యాలెస్‌లు

ఇక్కడ జగన్‌కు ఆరు ప్రాసాదాలు

బాబాయిని, అన్నను కిమ్ లేపేశాడు

ఆంధ్రా జిమ్ బాబాయిని వేశాడు

జనసేన, టీడీపీ, బీజేపీ పొత్తుతో

తాడేపల్లి భవంతిలో టీవీలు పగిలాయ్

జగన్‌లా పరదాల మాటున లేను...

తప్పుచేసి ఉంటే అరెస్టు చేసుకోవచ్చు

సూపర్ సిక్స్‌తో అన్ని వర్గాలకు న్యాయం

కార్యకర్తలూ 2 నెలలు కష్టపడండి

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది మనమే

శంఖారావంలో యువనేత స్పష్టీకరణ

అనంతపురం మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 'నార్త్ కొరియాలో ఒక నియంత కిమ్ ఉన్నాడు.. ఆంధ్రాలోనూ ఓ నియంత ఉన్నాడు.. ఇతడి పేరు జిమ్. హెయిర్ స్టైల్‌లో తప్ప ఇద్దరూ 'సేమ్ టు సేమ్' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఎద్దేవాచేశారు. మలి విడత శంఖారావంలో భాగంగా.. ఆదివారం అనంతపురం జిల్లా ఉరవకొండ, రాయదుర్గం, కల్యాణదుర్గంలో జరిగిన బహిరంగ సభల్లో పాల్గొన్నారు. కిమ్‌లాగే జగన్ నియంత పాలన సాగిస్తున్నాడని మండిపడ్డారు. రాష్ట్రంలో ఆయన అధికారంలోకి వచ్చాక.. ప్రశ్నించే వారి గొంతు నొక్కడం పరిపాటైందని దుయ్యబట్టారు. 'కిమ్‌కు

మిగతా 12వ పేజీలో...



'సిద్ధం' ప్రచారానికి 600 కోట్లు

ఒక్కో సభకు 90 కోట్లు

ఈ డబ్బంతా ఎక్కడిది?

ఈ అవినీతిపై కేంద్రం దర్యాప్తు చేయదెందుకు?

రాజకీయ ప్రత్యర్థులపైనే ఈడీ దాడులు

జగన్ విషయంలో ఈడీ ఎక్కడికి పోయింది?

బీజేపీకి జగన్ వారసుడు.. ఆ పార్టీతో రహస్య పొత్తు

హోదా కోసం అసలు డిమాండ్ చేశారా.. షర్మిల ధ్వజం

అమరావతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఒక్కో 'సిద్ధం' సభ కోసం రూ.90 కోట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఖర్చు చేశారని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. సిద్ధం పేరిట ప్రచారం కోసం రూ.600 కోట్లు వ్యయం చేశారని, ఈ డబ్బంతా జగన్‌కు ఎక్కడిదని నిలదీశారు. ఈ డబ్బుపై కేంద్ర సంస్థలు ఎందుకు దర్యాప్తు చేయట్లేదని ప్రశ్నించారు. విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌లో ఆదివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీతో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ బాహాటంగా పొత్తు పెట్టుకుంటే .. జగన్ రహస్య పొత్తు పెట్టుకున్నాడని షర్మిల విమర్శించారు. ప్రధాని మోదీ మోసానికి కేరాఫ్ అయితే.. బీజేపీకి జగన్ వారసుడన్నారు. రాజకీయ ప్రత్యర్థులపై సీబీఐ, ఈడీలను కేంద్రం ప్రయోగిస్తోందని ఆక్షేపించారు. ఇసుక, లిక్కర్,

మిగతా 11వ పేజీలో...



భర్త, కుమారుడితో శ్వేత (ఫైల్)

భార్యను కొట్టిచంపి.. డస్ట్‌బిన్‌లో పడేసి

ఆస్ట్రేలియాలో హైదరాబాదీ ఘాతుకం

ఏమీ ఎరుగనట్టు హైదరాబాద్‌కు

నాలుగేళ్ల కొడుకును అత్తమామలకు అప్పగించి.. క్షమాపణలు చెప్పి పరార్

12 ఏళ్ల క్రితం కులాంతర వివాహం

ఇటీవల మనస్పర్థలతో ఘోరం

2

పోలీసుల్లో 'ట్యాపింగ్' పరేషాన్!

అధికార పార్టీకి 'ట్యాపింగ్ సేవ' చేసిన

తెలంగాణ డీఎస్పీ కేసుపై సర్వత్రా చర్చ

ఏపీలో తమ పరిస్థితి ఏమిటోనన్న గుబులు

తేడా వస్తే జైలుకేననే ఆందోళనలో సీనియర్లు

ఇప్పటికే కోటంరెడ్డి, రఘురామ ఉదంతాలతో

పోలీసు శాఖపై 'ట్యాపింగ్' అనుమానాలు

టీడీపీ, జనసేనతో బీజేపీ జట్టు కట్టడంతో మార్పు

ప్రభుత్వం మారితే ఇబ్బందులు తప్పవని భయం

అమరావతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రం తెలంగాణలో గత సీఎం కేసీఆర్ హయాంలో ప్రతిపక్ష నేతలు, ప్రముఖుల ఫోన్లు ట్యాపింగ్ జరగడంపై విచారణ ఊపందుకుంది. దీనిని నిర్ధారించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావును సస్పెండ్ చేసింది. అయితే, ఈ వ్యవహారం ఏపీలోనూ కలకలం రేపింది. ముఖ్యంగా రాష్ట్ర పోలీసులు ఫోన్ ట్యాపింగ్ అంటేనే వణుకుతున్న పరిస్థితి కనిపిస్తోంది. గత ఐదేళ్లుగా అధికార పార్టీ పెద్దల ఒత్తిడికి తలొగ్గి ట్యాపింగ్ సహా చాలా చేస్తున్నామని.. రేపు ప్రభుత్వం మారితే తమ పరిస్థితి ఏంటని అంతర్గతంగా ఆందోళన చెందుతున్నారు. "అయిందేదో అయిపోయింది. వారం రోజుల్లో ఎన్నికల కోడ్ రానుంది. బీజేపీ మద్దతుతో ప్రతిపక్షం ముందుకు వెళుతోంది. లేనిపోని ఇబ్బందులు మనకెందుకు" అంటూ ప్రైవేటు సంభాషణల్లో ఏపీ పోలీసులు మాట్లాడుకుంటున్నారు. మరికొందరు, "మేం ఎలాగూ మునిగాం. ప్రభుత్వం మారితే కష్టాలు ఎలాగూ తప్పవు. అయినా చేయగలిగింది లేదు" అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల ముందు హాట్ టాపిక్‌గా మారిన ఫోన్ ట్యాపింగ్

మిగతా 12వ పేజీలో...





తెలంగాణలో ప్రణీత్‌రావుపై ఎఫ్ఐఆర్

ఐపీసీ, పీడీపీపీ, ఐటీ చట్టాల కింద కేసు

నాన్-బెయిలబుల్ సెక్షన్ల ప్రయోగం

డిసెంబరు 4న ఎస్ఐబీలో

హార్డ్‌డిస్కులు, కంప్యూటర్ల కాల్చివేత

అదనపు ఎస్పీ రమేశ్ ఫిర్యాదు

పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు

12



2

బెంగళూరు పేలుళ్లకు

జగిత్యాలకు లింకు?

రామేశ్వరం కేఫ్ బాంబు పేలుళ్ల ఘటనలో పీఎఫ్ఐ కార్యదర్శి సలీం హస్తమున్నట్లు అనుమానాలు

అన్నింటా.. 'పెద్ద' రెడ్డే!

ఉమ్మడి అనంతపురం జిల్లాలో కడప జిల్లా సరిహద్దున ఉన్న నియోజకవర్గమది. గ్రానైట్ పరిశ్రమకు నెలవు. స్థానిక ఎమ్మెల్యే.. దౌర్జన్యాలు, అక్రమాలు, అవినీతి అన్నింటిలోనూ 'పెద్ద' రెడ్డే. బాహాటంగానే తానో ఫ్యాక్షనిస్టు అని అంటారు. ఫ్యాక్షన్ అలజడులతో నియోజకవర్గంలో ప్రశాంతత లేకుండా చేశారు.

దౌర్జన్యాలు, అక్రమాలు, అవినీతిలో దిట్ట

గ్రానైట్ ఇలాకాలో ఎమ్మెల్యే ఫ్యాక్షన్ అలజడులు

పోలీసులను అడ్డుపెట్టుకొని అరాచకాలు

టీడీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు

జోరుగా ఇసుక, మట్టి అక్రమ రవాణా

రియల్ వెంచర్లలో పర్సంటేజీల వసూలు

మాట వినని అధికారులకు వేధింపులు

నాలుగున్నరేళ్లలో 250 కోట్ల అక్రమార్జన



సదరు నేతకు ఇసుక, మట్టి అక్రమ రవాణా ప్రధాన ఆదాయ వనరు. ఎవరైనా రియల్ వెంచర్లు వేయాలంటే కప్పం కట్టాల్సిందే. ఒకే ప్రాంతంలో ఆయన ఏకంగా 200 ఎకరాలకుపైగా భూములు కొనుగోలు చేశారు. 58 నెలల్లో రూ.250 కోట్లకుపైగా వెనకేసుకున్నారు.

నియోజకవర్గంలో ఎమ్మెల్యే దౌర్జన్యాలు, అరాచకాలకు అడ్డూ అదుపూ లేదు. అధికారంలో ఉన్నా, లేకపోయినా.. ప్రత్యర్థులను వదిలే ప్రసక్తే లేదని మీడియా ముందే చెబుతుంటారు. పోలీసులను అడ్డుపెట్టుకొని అరాచకాలు చేయడంలో తనకు తానే సాటి. ఏ అధికారైనా ఆయన ముందు జీ హుజూర్ అనాల్సిందే. లేదంటే పెట్టేబేడా సర్దుకొని వెళ్లిపోవాలి.

(అనంతపురం-ఆంధ్రజ్యోతి)

ఆయనది ఓ మోస్తరు రైతు కుటుంబం. ఫ్యాక్షన్ నేపథ్యముంది. కుటుంబ అండతోనే రాజకీయాల్లో ఎదిగారు. ఎన్నికల్లో పోటీచేసిన మొదటిసారే ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ కూడా అధికారంలోకి వచ్చింది. ఇంకేముంది... మరోసారి చాన్స్

మిగతా 12వ పేజీలో...

సీఈసీతో విభేదాలతోనే?

ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ రాజీనామాపై చర్చ

బెంగాల్‌లో పోలింగ్‌పై సీఈసీతో అభిప్రాయ భేదాలు

ఆ రాష్ట్ర పర్యటన మధ్యలోనే ఢిల్లీకి గోయల్ పయనం

అనంతరం మూడు రోజులకే పదవికి రాజీనామా

నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరిన కేంద్రం

ససేమిరా అన్న కమిషనర్.. ప్రభుత్వ వర్గాల వెల్లడి

ఒత్తిడికి తలవంచని గోయల్‌కు సెల్యూట్: మమత

బెంగాల్ హైకోర్టు మాజీ జడ్జిలా గోయల్ కూడా

లోక్‌సభకు పోటీ చేస్తారా?: జైరాం రమేశ్

ఈనెల 15లోపు ఇద్దరు కొత్త కమిషనర్ల నియామకం

ప్రధాని సారథ్యంలో భేటీ కానున్న ఎంపిక కమిటీ

న్యూఢిల్లీ, కోల్‌కతా, మార్చి 10: పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల ఏర్పాట్ల విషయంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)తో తలెత్తిన విభేదాలే ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ ఆకస్మిక రాజీనామాకు కారణమా?.. శనివారం రాత్రి గోయల్ రాజీనామా చేయటం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఇంకా దాదాపు నాలుగేళ్ల సర్వీసు, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ అయ్యే అవకాశం ఉన్నా కూడా.. వాటన్నింటినీ వదులుకొని గోయల్ ఎందుకు రాజీనామా చేశారన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం (ఈసీ) వర్గాలు.. సీఈసీ రాజీవ్ కుమార్‌తో

మిగతా 2వ పేజీలో...

బెంగాల్‌లో అన్ని సీట్లలో టీఎంసీ పోటీ

లోక్‌సభ బరిలో మాజీ క్రికెటర్

యూసుఫ్ పఠాన్, సినీ నటి రచనా బెనర్జీ

బహిష్కృత ఎంపీ మహువాకు మళ్లీ అవకాశం

'టారిఫ్' తూచ్!

ఒకసారి టారిఫ్ ఆమోదించాక ఏడాదంతా ఆ చార్జీలు అమలవ్వాలి

కానీ, జగన్ హయాంలో అంతా రివర్స్.. 'ట్రూఅప్' పేరిట దొడ్డిదారి బాదుడు

ఎప్పుడు కావాలంటే అప్పుడు విద్యుత్ వినియోగదారులపై చార్జీల మోత

ఐదేళ్లలో రూ.24,593 కోట్ల భారం.. నేడు వార్షిక టారిఫ్ విడుదల

అమరావతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల నుంచి విద్యుత్తు బిల్లుల వసూలులో అత్యంత కీలకమైన వార్షిక వాస్తవ ఆదాయ, వ్యయ నివేదిక(ఏఆర్ఆర్)కు విలువ లేకుండా పోయిందన్న విమర్శలు వస్తున్నాయి. సహజంగా ప్రతి ఏటా విద్యుత్తు పంపిణీ

మిగతా 12వ పేజీలో...

డ్రైవ్ మోడ్‌కు బదులు రివర్స్ మోడ్

- కాలువలోకి దూసుకెళ్లిన టెస్లా కారు
- అమెరికాలో ప్రముఖ కంపెనీ సీఈవో మృతి


ఏంజెలా చావో

టెక్సాస్, మార్చి 10: కారు మోడ్‌ను పొరపాటున మార్చడంతో అమెరికాలో ఓ సంపన్న కుటుంబానికి చెందిన మహిళ, ప్రముఖ కంపెనీ సీఈవో మృతి చెందారు. గత నెలలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ షిప్పింగ్ కంపెనీకి సీఈవోగా ఉన్న ఏంజెలా చావో (50) చైనా కొత్త ఏడాది వేడుకలు జరుపుకునేందుకే స్నేహితులతో కలిసి ఫిబ్రవరి 10న టాక్సాస్ ఆస్టిన్ సమీపంలోని తన ప్రైవేటు అతిథి గృహానికి వెళ్లారు. వేడుకల అనంతరం తిరిగి వస్తూ రోడ్డుపై త్రిపాయింట్ టర్న్ తీసుకుంటున్న సమయంలో ఆమె తన టెస్లా కారును డ్రైవ్ మోడ్‌లో వేయబోయి పొరపాటున రివర్స్ మోడ్‌లో వేశారు. దాంతో కారు ఒక్కసారిగా వెనక్కు వెళ్లి అక్కడున్న కొలనులో బోర్లా పడిపోయింది. ఏంజెలాతో పాటు వచ్చిన స్నేహితులు ఆమెను రక్షించేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్య పడకపోవడంతో వారు వెంటనే సహాయక బృందానికి ఫోన్ చేశారు. కాసేపటి తర్వాత అక్కడకు చేరుకున్న సహాయక బృంద సభ్యులు నీటిలో దిగి కారు అద్దాలను పగులగొట్టి ఆమెను కాపాడేందుకు ప్రయత్నించారు. అవి దృఢంగా ఉండడంతో సాధ్య పడలేదు. కాసేపటికి ట్రాలీ సహాయంతో కారును బయటకు తీసి డోర్‌లను బలవంతంగా పగులగొట్టి చూడగా అప్పటికే ఏంజెలా చనిపోయారు. అమెరికాకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, బిలయనీర్ జిమ్ బ్రెయార్‌కు ఏంజెలా చావో భార్య. అమెరికా మాజీ రవాణా మంత్రి ఎలయానోకు ఆమె సోదరి.

17 మంది ఏజెంట్లపై సీబీఐ కేసు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఉద్యోగాల పేరు చెప్పి భారతీయ యువకులను రష్యా సైన్యంలో చేర్పించిన ఉదంతంపై సీబీఐ దర్యాప్తును వేగవంతం చేసింది. సామాజిక మాధ్యమాల ద్వారా యువతను ఆకర్షించి రష్యాకు పంపిన దుబాయ్‌లోని భారత దళారీ, యూట్యూబర్ ఫైసల్ ఖాన్‌తో పాటు 17 మంది ఏజెంట్లపై కేసు నమోదు చేసింది. భారతీయులు, దుబాయ్‌లో పనిచేస్తున్న హిందుస్థానీలను ఏజెంట్లు రష్యాకు తీసుకెళ్లిన విధానంపై విచారణ చేపట్టింది. విద్యార్థి వీసాల మీద తరలించిన వీరిని.. నేరుగా రష్యాకు తీసుకెళ్లారా..? లేదా ఇతర దేశాలకు తీసుకెళ్లి.. అక్కడి నుంచి రష్యాకు పంపించారా..? అన్న కోణంలో సీబీఐ దర్యాప్తు చేస్తోంది. భారతీయ దళారులు, వారికి సహకరించిన వారిని యూఏఈ, రష్యా నుంచి విచారణ నిమిత్తం తీసుకు రావడానికి ప్రయత్నాలు ప్రారంభించింది.

నేటి నుంచి ఢిల్లీలో భారీ సాహిత్యోత్సవం

న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం నుంచి శనివారం వరకు ఆరు రోజుల పాటు ప్రపంచంలో అతి పెద్ద సాహిత్యోత్సవం జరుగుతుందని కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. 100 భారతీయ భాషలకు చెందిన 700 మందికి పైగా రచయితలు, కవులు, పండితులు ఈ సదస్సులో పాల్గొంటారని చెప్పారు. కాగా తెలుగు నుంచి కె.శివారెడ్డి, ఇనాక్, మృణాళిని, ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి ఎ.కృష్ణారావు తదితరులు ఈ సాహిత్యోత్సవాల్లో పాల్గొంటున్నారు.

నీట్ 2024 దరఖాస్తు గడువు పొడిగింపు

న్యూఢిల్లీ: నీట్ యూజీ 2024 దరఖాస్తు తేదీని వారం రోజులు పొడిగించినట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) వెల్లడించింది. మార్చి 16 రాత్రి 10.50గంటల వరకు అభ్యర్థులు తమ దరఖాస్తులను నమోదు చేసుకోవచ్చని తెలిపింది. ఇప్పటికే 25 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్నారు.

మాతృభాషను కాపాడుకోవాలి

- ఎంతకీర్తి గడించినా మూలాలు మరవొద్దు
- యువతకు సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ సూచన
- 'ఎన్టీఆర్‌కు భారతరత్న' ఉద్యమానికి మద్దతు ప్రకటన

ఖమ్మం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఎంత ఉన్నతస్థానానికి వెళ్లినా, ఎంత కీర్తి గడించినా మూలాలు మరచిపోకూడదని సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. యువత సామాజిక స్పృహ కలిగి ఉండాలని, మాతృభాష, సంస్కృతిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన అభిమానులు ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి భార్య శివమాలతో కలిసి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సమాజాభివృద్ధి జరగకపోతే ధనికులకు, పేదలకు మధ్య వ్యత్యాసాలు పెరిగి ఆకలి, అశాంతి పెరుగుతాయన్నారు. ఖమ్మం జిల్లాతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు ప్రజల కీర్తి పతాకాన్ని ఎర్రకోటపై ఎగురవేసిన వ్యక్తి జస్టిస్ ఎన్వీ రమణ అని కొనియాడారు. టీడీపీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రప్రసాద్ మాట్లాడుతూ విలువలతో కూడిన న్యాయవ్యవస్థ నిర్వీర్యం కాకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడిన వ్యక్తిజస్టిస్ ఎన్వీ రమణ అని పేర్కొన్నారు. అలాగే, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎంపీ నామా నాగేశ్వరరావు ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోయినా తమ సందేశాలను పంపారు. ఖమ్మం కమ్మ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్నేని రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్వీ రమణ దంపతులను ఘనంగా సత్కరించారు. కాగా, ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలనే డిమాండ్‌తో ఆయన అభిమానులు చేపట్టిన రాష్ట్రపతికి పోస్టు కార్డు కార్యక్రమానికి సుప్రీం కోర్టు పూర్వ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ సంఘీభావం తెలిపారు. పోస్టు కార్డుపై జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు సంతకాలు చేసి దానిని రాష్ట్రపతికి పోస్ట్ చేశారు.

సీఈసీతో విభేదాలతోనే!

(మొదటి పేజీ తరువాయి)



పొసగకనే గోయల్ రాజీనామా చేసినట్లు వెల్లడిస్తున్నాయి. ఈ వర్గాలు చెబుతున్నదాని ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌లో లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇటీవల రాజీవ్‌కుమార్, గోయల్ ఆ రాష్ట్రంలో పర్యటించారు. ఆ సమయంలోనే వారి మధ్య తీవ్రమైన విబేదాలు పొడసూపాయి. గోయల్ బెంగాల్ పర్యటనను అర్ధంతరంగా ముగించుకొని ఢిల్లీకి తిరిగి వచ్చారు. దీంతో ఈ నెల 5వ తేదీన సీఈసీ రాజీవ్ కుమార్ ఒక్కరే బెంగాల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. అనారోగ్య కారణాల రీత్యానే గోయల్ ఢిల్లీకి వెళ్లిపోయారని విలేకర్లకు రాజీవ్ కుమార్ చెప్పారు. 7వ తేదీన ఈసీ ప్రధాన కార్యాలయంలో సీఈసీతో కలిసి గోయల్ లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. అయితే, దీనికి కొనసాగింపుగా మరుసటి రోజు కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లాతో ఈసీ అధికారులు నిర్వహించిన సమావేశానికి మాత్రం గోయల్ హాజరు కాలేదు. 8వ తేదీన ఉదయం సీఈసీకి కనీస సమాచారం కూడా ఇవ్వకుండానే గోయల్ తన రాజీనామా లేఖను రాష్ట్రపతికి పంపించారు. విషయం తెలిసిన కేంద్ర ప్రభుత్వం.. సీఈసీతో విబేధాలను పరిష్కరించుకోవాలని, రాజీనామాను ఉపసంహరించుకోవాలని గోయల్‌ను కోరిందని, అయితే, ఆయన తన నిర్ణయాన్ని మార్చుకోలేదని ఉన్నతస్థాయి ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

బాస్‌ల ఒత్తిడికి తలవంచలేదు: మమత

బెంగాల్‌లో ఎన్నికల నిర్వహణ, భద్రతా బలగాల మోహరింపునకు సంబంధించి ఢిల్లీ (బీజేపీ) నేతల నుంచి, తన బాస్‌ల నుంచి వచ్చిన ఒత్తిడికి తలవంచకుండా రాజీనామా చేసిన అరుణ్ గోయల్‌కు సెల్యూట్ చేస్తున్నానని పశ్చిమ బెంగాల్ సీఎం మమత పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లను దొంగిలించి, ఫలితాల్ని తమకు అనుకూలంగా మలుచుకోవాలని కేంద్రంలోని బీజేపీ కుట్ర చేస్తుందని తీవ్ర ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆదివారం ఎక్స్‌లో స్పందిస్తూ.. 'గోయల్ రాజీనామా మూడు ప్రశ్నలను రేకెత్తిస్తోంది. సీఈసీతో విభేదాలా? లేక, రాజ్యాంగబద్ధ స్వతంత్ర సంస్థలను చెప్పుచేతుల్లోకి తీసుకుంటున్న మోదీ ప్రభుత్వంతో సమస్యలా? లేక కోల్‌కతా హైకోర్టు మాజీ న్యాయమూర్తిలాగా పదవికి రాజీనామా చేసి బీజేపీ టికెట్ మీద లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే ఉద్దేశమా?' అని ప్రశ్నించారు. కోల్‌కతా హైకోర్టు మాజీ జడ్జి లాగే గోయల్ కూడా బీజేపీలో చేరతారా అన్నది వేచి చూడాల్సి ఉందని ఖర్గే వ్యాఖ్యానించారు. బీజేపీ ప్రభుత్వం ఎటువంటి వారిని ఉన్నత స్థానాల్లో నియమిస్తుందో ఈ వ్యక్తుల ద్వారా తెలుస్తోందన్నారు. ఎస్పీ అధినేత అఖిలేశ్ స్పందిస్తూ.. ఈసీపై ఎవరి ఒత్తిడి పని చేస్తోందని నిలదీశారు. గత పదేళ్లలో ఈసీ ప్రైవేటు కంపెనీలా, బీజేపీ శాఖలాగా మారిపోయిందని ఉద్ధవ్ ఠాక్రే విమర్శించారు.

బ్యాచ్‌మేట్ల దిగ్భ్రాంతి!

ఐఏఎస్‌లో అరుణ్ గోయల్ బ్యాచ్‌మేట్ (1985) అయిన సంజీవ్‌గుప్తా ఆదివారం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. 'ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ వర్గాల్లో అరుణ్ గోయల్‌కు నిబంధనల ప్రకారం వెళ్లే ముక్కుసూటి మనిషి అనే పేరుంది. ఆయన నియామకంలాగే రాజీనామా కూడా వేగంగా జరిగిపోయింది. ఇది ఎన్నికల సంఘం స్వతంత్రతపై సీరియస్ ప్రశ్నలను రేకెత్తిస్తోంది. మా బ్యాచ్‌మేట్లం అందరమూ దిగ్భ్రాంతికి గురయ్యాం. గోయల్ నుంచి స్పందన లేదు' అని వివరించారు.

రాజీనామా దిగ్భ్రాంతికరం: అసదుద్దీన్

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించనున్న తరుణంలో ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ రాజీనామా దిగ్భ్రాంతిని కలిగించిందని మజ్లిస్ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. అరుణ్ గోయల్ ఎందుకు రాజీనామా చేశారో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. అరుణ్ గోయల్ ఆకస్మిక రాజీనామా.. లోక్‌సభ ఎన్నికల నిష్పాక్షిక నిర్వహణపై నెలకొన్న సందేహాలకు బలం చేకూరుస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న సమయంలో అరుణ్ గోయల్ రాజీనామా చేయడం బాధ్యతా రాహిత్యమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ పేర్కొన్నారు.

15వ తేదీలోపు కమిషనర్ల నియామకం

ఈ నెల 15వ తేదీలోపు ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నియామకం జరిగే అవకాశాలు ఉన్నాయని సంబంధిత వర్గాలు ఆదివారం వెల్లడించాయి. అరుణ్ గోయల్ తాజాగా రాజీనామా చేయగా, మరో కమిషనర్ అనూప్‌చంద్ర పాండే గత నెల 14వ తేదీన రిటైరయ్యారు. దీంతో ప్రస్తుతం ఈసీలో సీఈసీ ఒక్కరే మిగిలారు. రెండు కమిషనర్ స్థానాలు ఖాళీగానే ఉన్నాయి. వీటి భర్తీ కోసం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ నేతృత్వంలోని కమిటీ ఒక్కో పోస్టుకు ఐదేసి చొప్పున మొత్తం పది పేర్లతో కూడిన జాబితాను సిద్ధం చేస్తుంది. తర్వాత ప్రధాని మోదీ సారథ్యంలో ఒక కేంద్రమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధిర్ రంజన్ చౌదరిలతో కూడిన కమిటీ రెండు పేర్లను ఎంపిక చేసి, ఆమోదం కోసం రాష్ట్రపతికి పంపిస్తుంది. రాష్ట్రపతి ఆమోదంతో ఇద్దరు కమిషనర్లు నియమితులవుతారు.



మగ బుద్ధి!

రియాద్: ఈ చిత్రంలో అరబ్బీ షేక్ వేషంలో కనిపిస్తున్నది ఓ రోబో! సౌదీ అరేబియాలో తయారైన మొట్టమొదటి హ్యూమనాయిడ్ 'మగ రోబో'! పేరు ముహమ్మద్. రియాద్‌లో జరిగిన టెక్నాలజీ ఫెస్టివల్ 'డీప్ ఫెస్ట్'లో దీన్ని ప్రపంచానికి పరిచయం చేశారు. అయితే.. రాయా కాసీమ్ అనే మహిళా రిపోర్టర్ 'ముహమ్మద్'ను ప్రేక్షకులకు పరిచయం చేసే క్రమంలో ఆ రోబో తన 'మగ బుద్ధి'ని బయటపెట్టుకుంది. ఆ రిపోర్టర్ పిరుదులపై చెయ్యి వేసింది. ఈ వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. రోబోల ప్రవర్తన, వాటి వల్ల కలిగే ప్రమాదాల గురించి విస్తృతంగా చర్చ జరుగుతోంది. ముహమ్మద్‌ను తయారు చేసిన 'క్యూఎస్ఎస్ సిస్టమ్స్' సంస్థ ఈ వీడియోపై స్పందించింది. భవిష్యత్తులో ఇలాంటి సందర్భాల్లో ఆ రోబో ఎవరికీ మరీ సమీపానికి వెళ్లకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించింది.

పోర్న్‌స్టార్ సోఫియా ఆకస్మిక మృతి



న్యూఢిల్లీ, మార్చి 10: ప్రముఖ పోర్న్ స్టార్, మోడల్.. సోఫియా లియోన్(26) ఆకస్మికంగా మరణించారు. సోఫియా తన అపార్ట్‌మెంట్‌లో అచేతన స్థితిలో ఉండగా కుటుంబసభ్యులు మార్చి 1న గుర్తించారు. సోఫియా ఎలా మరణించారనే దానిపై పోలీసు దర్యాప్తు కొనసాగుతోంది. సోఫియా మరణించిన విషయం ఆమె సవతి తండ్రి మైక్ రొమెరో శనివారం చేసిన ప్రకటనతో వెలుగు చూసింది. అమెరికాలోని మియామి ప్రాంతానికి చెందిన సోఫియా లియోన్ తన 18వ ఏట పోర్న్ ఫిల్మ్ రంగంలో ప్రవేశించారు. కాగా, పోర్న్ ఫిల్మ్ రంగంలో చోటు చేసుకున్న నాలుగో అకాల మరణం ఇది.

బెంగళూరు పేలుళ్లకు జగిత్యాలకు లింకు?

జగిత్యాల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): బెంగుళూరు రామేశ్వరం కెఫె బాంబు పేలుళ్లతో జగిత్యాలకు లింకులున్నట్లు ప్రచారం జరుగుతోంది. జగిత్యాల జిల్లాకేంద్రంలోని ఇస్లాంపురకు చెందిన నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ) కార్యదర్శి అబ్దుల్ సలీంకు బెంగుళూరు పేలుళ్ల కేసుతో సంబంధాలున్నట్లుగా కేంద్ర దర్యాప్తు సంస్థ అనుమానిస్తోంది. ఇటీవల రాష్ట్రంలోని కడప జిల్లా మైదుకూరు మండలం చెర్లోపల్లి ప్రాంతంలో సలీంను ఎన్ఐఏ అధికారులు అరెస్టు చేశారు. ఎన్ఐఏ గతంలో విడుదల చేసిన మోస్ట్‌వాంటెడ్ జాబితాలోనూ సలీం పేరు ఉంది. ఈయనతోపాటు.. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎండీ అబ్దుల్ అహ్మద్ అలియాస్ ఎంఎ అహ్మద్, ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన షేక్ ఇలాయాస్ అహ్మద్ మోస్ట్‌వాంటెడ్‌గా ఉన్నారు. పరారీలో ఉన్న వీరి కోసం ఎన్ఐఏ కొంత కాలంగా గాలిస్తోంది. గత ఏడాది ఎన్ఐఏ తెలంగాణ, ఏపీల్లోని పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి, పీఎఫ్ఐ శిక్షణ పొందుతున్న వారిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

బీజేపీకి 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తాం

- పీఠిక నుంచి 'లౌకిక వాదం' అన్న మాటను తొలగిస్తాం
- కర్ణాటక సీనియర్ నేత, ఎంపీ అనంత హెగ్డే వ్యాఖ్య



కార్వార్ (కర్ణాటక)/న్యూఢిల్లీ, మార్చి 10: రానున్న ఎన్నికల్లో బీజేపీకి సంపూర్ణమైన ఆధిక్యత ఇస్తే రాజ్యాంగాన్ని మార్చివేస్తామని, పీఠిక నుంచి 'లౌకిక వాదం' అన్న మాటను తొలగిస్తామని కర్ణాటకకు చెందిన ఆ పార్టీ సీనియర్ సీనియర్ ఎంపీ అనంతకుమార్ హెగ్డే అన్నారు. పార్లమెంటులో బీజేపీకి మూడింట రెండొంతుల మెజార్టీ లభిస్తే హిందూ సమాజాన్ని అణచివేసేలా రాజ్యాంగంలో కాంగ్రెస్ చేసిన అనవసర చేర్పులను తొలగిస్తామని చెప్పారు. ఆరుసార్లు బీజేపీ ఎంపీగా, ఒకసారి కేంద్రమంత్రిగా పనిచేసిన ఆయన ఆదివారం కార్వార్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ 'అబ్ కా బార్ 400 పార్' (ఈ సారి 400 సీట్లకు మించి..) అంటూ ప్రధాని మోదీ ఇచ్చిన నినాదంపై తన అభిప్రాయాలు తెలిపారు. లోక్‌సభ, రాజ్యసభల్లో మూడింట రెండొంతుల మెజార్టీ సంపాదించడంతో పాటు, 20కిపైగా రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించాల్సి ఉందని అన్నారు. బీజేపీకి రాజ్యసభలో 2/3 వంతుల మెజార్టీ లేనందునే పౌరసత్వ సవరణ చట్టా(సీఏఏ)న్ని ఆమోదం పొందడంలో ఇబ్బందులు ఎదురయ్యాయని చెప్పారు. ఆరేళ్ల క్రితం కూడా ఆయన ఇలాంటి వివాదాస్పద ప్రకటన చేశారు. అనంత్ హెగ్డే ప్రకటనను కాంగ్రెస్ తీవ్రంగా తప్పుపట్టింది. ఆరెస్సెస్-బీజేపీల రహస్య, వంచక అజెండాకు ఇది నిదర్శనమని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే విమర్శించారు. దేశంలో నియంతృత్వాన్ని, మనువాద విధానాన్ని అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు.

నేను భిన్నమైన మనిషిని!

- ప్రాజెక్టులు ప్రకటించి.. అమలు చేస్తున్నాం: మోదీ

లఖ్‌నవూ/రాయ్‌పూర్, మార్చి 10: తాను విభిన్నమైన మనిషినని.. ప్రాజెక్టులను ప్రకటించడమే కాదు.. అమలు చేసి చూపుతున్నామని ప్రధాని మోదీ అన్నారు. శరవేగంతో విమానాశ్రయా లు, హైవేలు, రైలు మార్గాల నిర్మాణాలు, ప్రారంభోత్సవాలను వచ్చే ఎన్నికల కోసమన్న కోణంలో చూడొద్దని కోరారు. 2047లోగా భారత్‌ను అగ్రరాజ్యం చేయాలన్న లక్ష్యం సాధించే క్రమంలో దీన్ని తన ప్రగతి ప్రయాణంగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయ న ఉత్తరప్రదేశ్‌లోని ఆజంగఢ్‌లో జరిగిన బహిరంగసభలో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా రూ.42వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. వీటిలో ఒక్క యూపీ ప్రాజెక్టుల విలువే రూ.37,500కోట్లు. అలాగే వివిధ రాష్ట్రా ల్లో రూ.9,800కోట్లతో నిర్మించిన 12ఎయిర్‌పోర్టు టెర్మినళ్లను ఆయన ప్రారంభించారు. అలాగే ఆంధ్రలో కడప, కర్ణాటకలో హుబ్బళి, బెళగావి విమానాశ్రయాల్లో కొత్త టెర్మినల్ భవనాలకు శంకుస్థాపన చేశారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం తెచ్చిన 'మహాత్రీ వందన యోజన'ను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం ప్రసంగిస్తూ.. గతంలో ఎన్నికల ముందు ప్రాజెక్టులపై ప్రకటనలు మాత్రమే చేసేవారని.. తర్వాత అటకెక్కించేవారని మోదీ తెలిపారు. తాను చేస్తున్న అభివృద్ధితో బుజ్జగింపు రాజకీయాల విషం నిర్వీర్యమవుతోందన్నారు. కాగా దేశవ్యాప్తంగా 3కోట్ల మంది మహిళలను లక్షాధికారిణులుగా మా ర్చే లక్ష్యంతో తన ప్రభుత్వం పనిచేస్తోందని మోదీ అన్నారు. 'మహాత్రీ వందన్ యోజన' కింద ఛత్తీస్‌గఢ్‌లో 70లక్షల మందికి పైగా మహిళలకు ప్రతి నెలా రూ.1,000 చొప్పున అందుతుందని చెప్పారు. 'ఉజ్వల స్కీం కింద చౌక ధరకే వంట గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. 65శాతానికిపైగా ముద్రారుణాలు మహిళలే పొందారు. స్వయం సహాయక సంఘాల ద్వారా 10 కోట్ల మందికిపైగా మహిళల జీవితాలను మా ప్రభుత్వం మార్చేసింది. మా కృషితో కోటి మందికిపైగా 'లఖ్‌పతీ దీదీ'లుగా ఆవిర్భవించారు' అన్నారు.

ఇండియాకు మమత షాక్

బెంగాల్‌లో అన్ని లోక్‌సభ స్థానాలకు తృణమూల్ అభ్యర్థుల ప్రకటన.. జాబితా విడుదల


కోల్‌కతాలో జనగర్జన సభలో మమత, ఆమె వెంట నడుస్తున్న టీఎంసీ ఎంపీ అభ్యర్థులు

న్యూఢిల్లీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్‌లోని మొత్తం 42 లోక్‌సభ స్థానాలకు అధికార పక్షం తృణమూల్ కాంగ్రెస్ ఆదివారం అభ్యర్థులను ప్రకటించింది. ఈ మేరకు జాబితాను విడుదల చేసింది. తద్వారా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు ఉండబోదని తేల్చి చెప్పింది. అభ్యర్థులుగా మాజీ క్రికెటర్ యూసుఫ్ పఠాన్, సినీ హీరోయిన్ రచనా బెనర్జీ వంటి కొత్త ముఖాలకు అవకాశం కల్పించింది. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఆ పార్టీ లోక్‌సభాపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి ప్రాతినిధ్యం వహిస్తున్న బర్హంపూర్ నుంచి యూసుఫ్ పఠాన్‌ను బరిలో దింపటం గమనార్హం. ప్రశ్నలకు డబ్బులు ఆరోపణలపై లోక్‌సభ నుంచి బహిష్కరణకు గురైన మహువా మొయిత్రాకు ఆమె సిటింగ్ స్థానమైన కృష్ణనగర్ నుంచే మరోసారి అవకాశం కల్పించారు. తాజాగా వివాదాస్పదమైన సందేశ్‌ఖాలీ ప్రాంతం ఉన్న బసీరత్ స్థానం నుంచి సిటింగ్ ఎంపీ, నటి నుస్రత్ జహాన్ బదులు మాజీ ఎంపీ హాజీ నూరుల్ ఇస్లాంకు అవకాశం ఇచ్చారు. కాగా తృణమూల్‌కున్న 23 మంది ఎంపీల్లో 16 మందికి తిరిగి అవకాశం ఇచ్చి ఏడుగురిని పక్కన పెట్టారు. ఇద్దరు క్యాబినెట్ మంత్రులతో పాటు 9 మంది సిటింగ్ ఎమ్మెల్యేలను ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల బరిలో దింపారు. మొత్తం 42 మంది అభ్యర్థుల్లో 12 మంది మహిళలున్నారు. కాగా, ఆదివారం కోల్‌కతాలో మమత జనగర్జన పేరుతో బహిరంగసభ నిర్వహించారు. బీజేపీ, కాంగ్రెస్, సీపీఎంలను ఎదుర్కొంటామన్నారు.

పొత్తుకు ఇంకా అవకాశం ఉంది: ఖర్గే

బెంగాల్‌లో అన్ని స్థానాలకు అభ్యర్థులను తృణమూల్ ప్రకటించటంపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే స్పందిస్తూ.. 'మా తలుపులు ఎప్పటికీ తెరిచే ఉంటాయి. నామినేషన్ల ఉపసంహరణ వరకూ పొత్తుకు అవకాశం ఉంది' అని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి భయపడే కాంగ్రెస్‌తో పొత్తుకు మమతా బెనర్జీ ముందుకు రాలేదని అన్నారు.

భార్యను కొట్టిచంపి.. డస్ట్‌బిన్‌లో పడేసి..

- ఆస్ట్రేలియాలో హైదరాబాదీ ఘాతుకం
- ఏమీ ఎరుగనట్టు హైదరాబాద్‌కు రాక
- నాలుగేళ్ల కొడుకును అత్తమామలకు అప్పగించి.. క్షమాపణలు చెప్పి పరార్


భర్త, కుమారుడితో శ్వేత

ఏఎస్‌రావునగర్/హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పన్నెండేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను.. దారుణంగా కొట్టిచంపాడు! పరాయి దేశంలో.. రోడ్డు పక్కన ఉన్న చెత్త కుండీలో అనాథ శవంలా పారేసి.. నాలుగేళ్ల కుమారుణ్ని తీసుకుని స్వదేశానికి పారిపోయి వచ్చాడు!! ఆ పిల్లాణ్ని నేరుగా అత్తారింటికి తీసుకెళ్లి, వారికి అప్పగించి, భార్యను చంపిన విషయం చెప్పి.. క్షమాపణలు చెప్పి పరారైపోయాడు! ఈ విషయం విని కుప్పకూలిపోయారా తల్లిదండ్రులు. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఏఎస్‌రావునగర్ డివిజన్ బృందావన్ కాలనీలో నివాసం ఉండే మాదగాని బాలశెట్టిగౌడ్, మాధవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కూతురు చైతన్య భారతి అలియాస్ శ్వేత(36), ఏఎస్‌రావునగర్ ఈసీఐఎల్ ప్రాంతానికి చెందిన వరికుప్పల అశోక్‌రాజ్ ఒకే కాలేజీలో చదివేవారు. డిగ్రీలో ఉండగా ప్రేమించుకున్నారు. కులాలు వేరైనా పెద్దలను ఒప్పించి 2012లో వివాహం చేసుకున్నారు. అనంతరం ఉన్నత చదువుల నిమిత్తం ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌కు వెళ్లారు. శ్వేత ఎం.ఫార్మసీ, అశోక్‌రాజ్ ఎంబీఏ పూర్తిచేశారు. ఇద్దరూ ఉద్యోగాలు చేస్తూ అక్కడే స్థిరపడ్డారు. ఆస్ట్రేలియా పౌరసత్వం కూడా పొందారు. వీరికి నాలుగేళ్ల కుమారుడు ఆర్య ఉన్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. తరచూ ఇద్దరూ గొడవలు పడుతున్నారు. శ్వేత తల్లిదండ్రులు ఇద్దరికీ నచ్చజెప్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 7న.. తెల్లవారుజామున అశోక్‌రాజ్ తన కుమారుడు ఆర్యతో కలిసి అత్తవారింటికి వచ్చాడు. శ్వేత తల్లిదండ్రులు తమ కుమార్తె గురించి అడిగారు. దీనికి అతడు.. "శ్వేతకు నాకు గొడవ జరిగింది. తోపులాటలో శ్వేత తల గోడకు తగిలి చనిపోయింది. జరిగిందానికి నన్ను క్షమించండి. ఇకపై బాబును మీరే చూసుకోండి" అని చెప్పి వారు ఆ షాక్ నుంచి కోలుకోకముందే అక్కడి నుంచి జారుకున్నాడు.

80 కిలోమీటర్ల దూరంలో..

ఆస్ట్రేలియాలో శ్వేతను చంపేసిన అశోక్‌రాజ్, ఆమె మృతదేహాన్ని మూటగట్టి, తమ ఇంటి నుంచి 80 కిలోమీటర్ల దూరం కారులో తీసుకెళ్లి రోడ్డు పక్కన డస్ట్‌బిన్‌లో పడేశాడు. స్థానిక పోలీసులు శ్వేత మృతదేహాన్ని వెలికితీశారని.. ఇద్దరికీ ఆస్ట్రేలియా పౌరసత్వం ఉండడంతో అక్కడి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని బాలశెట్టి గౌడ్ తెలిపారు. విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదివారం ఏఎస్‌రావునగర్‌లో మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జరిగిన సంఘటన దురదృష్టకరమని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. శ్వేత మృతదేహాన్ని నగరానికి త్వరగా రప్పించేందుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, భారత ఎంబసీ అధికారులతో చర్చించినట్లు చెప్పారు.

మంగళవారం చివరిసారిగా ఫోన్‌లో..

తమ కుమార్తె శ్వేత చివరిసారిగా గత మంగళవారం ఫోన్‌లో మాట్లాడిందని, ఆ మరుసటిరోజే హత్యకు గురైందని అప్పటి నుంచి తమకు ఫోన్ చేయలేదని చెబుతూ.. బాలశెట్టిగౌడ్, మాధవి కన్నీరు మున్నీరుగా విలపించారు. ఆరోజు తమతో బాగానే మాట్లాడిందని, గొడవల గురించి ఎలాంటి ప్రస్తావనా తేలేదని చెప్పారు. కరోనా సమయంలో తమ కుమార్తె ఇక్కడికి వచ్చివెళ్లిందని.. అదే చివరిచూపు అవుతుందనుకోలేదని అనుకోలేదని ఆవేదన వెలిబుచ్చారు. భార్యాభర్తల మధ్య చిన్న చిన్న గొడవలు సహజమని, కానీ ప్రాణాలు పోయేంత ఘోరం జరుగుతుందని ఊహించలేదని వాపోయారు.

అడిగేదెవరు? ఆపేదెవరు?!

- వలంటీర్ల ఇంటింటి ప్రచారం
- పథకాలు ఎరజూపి ఓట్ల వేట

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)

ఎన్నికల కోడ్ రాకకు ముందే పంపకాలు, తాయిలాలతో అధికార పార్టీ అభ్యర్థులు ఓటర్లను మభ్య పెడుతున్నారు. ఈ క్రమంలో వలంటీర్లను విస్తృతంగా వాడేస్తున్నారు. వలంటీర్లకు తాయిలాలు పంచి.. మచ్చిక చేసుకుని.. తమ వెంట తిప్పుకొంటున్నారు. వారిని ఇంటింటికీ పంపించి ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పథకాలు వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తేనే కొనసాగుతాయని, కాబట్టి వైసీపీకే ఓటేయాలని నూరిపోస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం పలు జిల్లాల్లో వలంటీర్లు వైసీపీ నేతలతో కలిసి ప్రచారంలో పాల్గొనడం సర్వత్రా చర్చనీయాంశం అయింది. అడిగేవారు.. ఆపేవారు లేకపోవడంతో వలంటీర్లు ఏకంగా వైసీపీ జెండాలు పట్టుకుని, కండువాలు కప్పుకొని ప్రచార పర్వంలో పాల్గొనడం గమనార్హం.

ఎక్కడెక్కడ ఎలా ఎలా?


తూర్పుగోదావరి జిల్లా నల్లమిల్లిలో ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి నిర్వహిస్తున్న ప్రచారంలో వలంటీర్లు, ఆశా వర్కర్లు

- విశాఖలో వలంటీర్లను సచివాలయం వెల్ఫేర్ కార్యదర్శులే ఇంటింటికీ పంపుతున్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై ముద్రించిన కరపత్రాలను ప్రతి ఇంటికీ పంపిణీ చేయాలని ఆదేశిస్తున్నారు. సీఎం జగన్ పేరిట ఉన్న కరపత్రాల పంపిణీ వందశాతం పూర్తికావాలని, ఒకవేళ కాకపోతే అందుకు గల కారణాలను చెప్పేందుకు సిద్ధంగా ఉండాలని వాయిస్ మెసేజ్‌లలో బెదిరింపులకు దిగడం గమనార్హం.
- కడప జిల్లా రాజంపేటలోనూ వలంటీర్లపై ఇదే ఒత్తిడి కొనసాగుతోంది. సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికీ అందజేయాలని మున్సిపల్ అధికారులు వలంటీర్లకు హుకుం జారీ చేశారు. ఎన్నికల సమయంలో వైసీపీకి తోడ్పడాలన్నారు. ఆదివారం రాత్రివేళ మహిళా వలంటీర్లతో సమావేశం నిర్వహించడం, కరపత్రాలు పంచమని చెప్పడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.
- తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు వైసీపీ ప్రచారంలో పాల్గొంటున్నారు. సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో వైసీపీని గెలిపించాలని నేతలతో కలిసి వలంటీర్లు ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి ఆదివారం నల్లమిల్లి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఆమె వెంట వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో వలంటీర్లకు డివిజన్లవారీగా బాధ్యతలు అప్పగించారు. వైసీపీ ప్రభుత్వం మళ్లీ రాకపోతే పథకాలన్నీ ఆగిపోతాయని చెబుతున్నారు. వైసీపీ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాస్‌కు సానుకూల వాతావరణం లేకపోవడంతో వలంటీర్లతో ఓటర్లను భయపెట్టయినా గెలుపు గుర్రం ఎక్కాలనే కుయుక్తి పన్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇక, వలంటీర్లకు రూ.5 వేలు, కుక్కర్లు, అంగన్వాడీ, ఆశా వర్కర్లకు చీరల పంపిణీ చేశారు.
- శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ ఇన్‌చార్జి, మంత్రి ఉషశ్రీ వలంటీర్లను ఎడాపెడా వాడేస్తున్నారు. గడపగడపకు వెళ్లినపుడు స్థానిక వలంటీర్లను వెంటబెట్టుకుని ప్రచారం చేస్తున్నారు. ఆదివారం పెనుకొండ మండలం వెంకటరెడ్డిపల్లిలో ఇంటింటికీ మంత్రి వెళ్లగా.. సంధ్య అనే వలంటీరు వైసీపీ కరపత్రాలు పంచారు. పెనుకొండ పట్టణంలో ఓ వలంటీరు ప్రభుత్వ పథకాల కరపత్రాలను ఇంటింటికీ పంచుతూ.. జగన్ వస్తేనే పథకాలు ఉంటాయని.. బాబు వస్తే ఇవ్వరని చెబుతున్నట్లు తెలిసింది. మరోవైపు ఓటర్ల నుంచి ఫోన్ నంబర్లు కూడా సేకరిస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నేటితో ముగియనున్న శివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలంలో ఘనంగా యాగ పూర్ణాహుతి



చండీశ్వర స్వామికి అవబృథ స్నానం నిర్వహిస్తున్న అర్చకులు, వేదపండితులు

శ్రీశైలం, మార్చి 10: శ్రీశైలంలో నవాహ్నిక దీక్షతో 11 రోజుల పాటు నిర్వహించే మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం పదో రోజుకు చేరుకున్నాయి. ఉదయం అర్చకులు, వేద పండితులు యాగ పూర్ణాహుతి నిర్వహించారు. తరువాత వసంతోత్సవం జరిపించి భక్తులపై సంప్రోక్షించారు. అనంతరం చండీశ్వరస్వామికి ఆలయ పుష్కరిణిలో ఆగమశాస్త్రోక్తంగా అవబృథస్నానం నిర్వహించారు. చివరగా త్రిశూలస్నానం జరిపించారు. సాయంత్రం ధ్వజావరోహణం చేశారు. కాగా.. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగియనున్నాయి. ఉదయం స్వామిఅమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి, సాయంత్రం అశ్వవాహనసేవ, ఆలయ ఉత్సవం అనంతరం స్వామిఅమ్మవార్లకు పుష్పోత్సవం, శయనోత్సవం నిర్వహించనున్నారు.

భక్త జనసందోహం మధ్య అమరేశ్వరుని రథోత్సవం

అమరావతి, మార్చి 10: పంచారామాలలో ప్రథమ ఆరామంగా విరాజిల్లుతున్న పల్నాడు జిల్లా అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వారి దివ్య రథోత్సవం ఆదివారం సాయంత్రం కన్నుల పండువగా జరిగింది. ప్రత్యేకంగా పూలతో అలంకరించిన దివ్యరథంపై ఉత్సవ మూర్తులు విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.



రథోత్సవానికి హాజరైన అశేష జనవాహిని



శ్రీవారి ఆలయం ఎదుట జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్, జస్టిస్ నరేంద్ర

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు, హైకోర్టు నాయమూర్తులు

తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరేంద్ర కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

హైందవం మతం కాదు జీవన విధానం

నా ఆధ్యాతిక గురువు ఎన్టీఆరే: పురందేశ్వరి



బ్రహ్మకుమారీస్ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న పురందేశ్వరి

తుళ్లూరు, మార్చి 10: హైందవాన్ని మతం అనుకుంటున్నారని, అది మతం కాదని మంచి జీవన విధానాన్ని నేర్పేదని అతి కొద్ది మందికి మాత్రమే తెలుసని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. రాజధాని గ్రామం నెక్కల్లు పరిధిలోని బ్రహ్మకుమారీస్, యూనివర్సల్ పీస్ రిట్రీట్ సెంటర్‌లో ఆదివారం జరిగిన త్రిమూర్తి శివజయంతి మహోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ, పాశ్చాత్య నాగరికత ప్రభావం మన మీద ఎక్కువగా ఉందన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలే చాలా గొప్పవన్నారు. ఒక మతం ఇంకో మతంతో గొడవపడటం, హత్యాకాండలకు దారితీయటం ప్రసార మాధ్యమాల్లో చూస్తున్నామన్నారు. మతం అనే చట్రంలో ఇరుక్కున్నంత వరకు ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉంటాయన్నారు. బ్రహ్మకుమారీస్ చేస్తున్న ఆధ్యాత్మిక సేవ ప్రశంసనీయమన్నారు. విశ్వాసంతో ఉంటే ఏదైనా దైవంగానే కనబడుతుందని తన తండ్రి నందమూరి తారక రామారావు తనకు బోధించారని, ఆయనే తనకు ఆధ్యాత్మిక గురువని పురందేశ్వరి పేర్కొన్నారు.

బీజేపీతో టీడీపీ పొత్తు రాష్ట్రానికి తీవ్రనష్టం: సీపీఎం

నెల్లూరు(వైద్యం), మార్చి 10: బీజేపీతో టీడీపీ పొత్తు వల్ల రాష్ట్రానికి తీవ్రనష్టం జరుగుతుందని సీపీఎం పేర్కొంది. రాష్ట్రానికి ఏ ప్రయోజనమూ లేని, ప్రత్యేక హోదా ఇవ్వని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు యత్నిస్తున్న బీజేపీతో పొత్తువల్ల టీడీపీకి నష్టమేనని ఆ పార్టీ స్పష్టం చేసింది. ఇక పోలవరం ప్రాజెక్టు విషయంలోనూ రాష్ట్రానికి నష్టమే జరిగిందని సీపీఎం విమర్శించింది. కేవలం 22శాతం పూర్తిచేసిన టీడీపీ 75శాతం పూర్తిచేశామని చెప్పడంపై చర్చకు సిద్ధమా అంటూ ఆ పార్టీ సవాలు విసిరింది. రానున్న ఎన్నికల్లో ఇండియా కూటమినే గెలిపించాలని, నెల్లూరు పార్లమెంట్ స్థానంలో సీపీఎం పోటీ చేసేలా వామపక్ష, కాంగ్రెస్ కూటమి చర్చలు చేస్తున్నామని తెలిపింది.

నేడు విజయవాడలో రైతాంగ సదస్సు

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రైతు-కూలీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన విజయవాడలో రైతాంగ సదస్సును నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగే ఈ సదస్సులో పలువురు రైతు ఉద్యమ నేతలు పాల్గొననున్నారు. ఈ సదస్సులో భూమి లేని రైతులు, రైతు కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. ముఖ్యంగా ధాన్యం గిట్టుబాటు ధరలకు చట్టబద్ధత-రైతాంగ ఉద్యమం అనే అంశంపై మాజీ మంత్రి, కిసాన్ మోర్చా కన్వీనర్ వడ్డే శోభనాదీశ్వరరావు ప్రసంగిస్తారు.

ఫరూక్, బ్రహ్మానందరెడ్డి మధ్య సయోధ్య

నంద్యాలలో కలిసి పనిచేయడానికి అంగీకారం

ఫలించిన నారా లోకేశ్ సంప్రదింపులు



నారా లోకేశ్‌తో ఫరూక్, భూమా బ్రహ్మానందరెడ్డి

అమరావతి, అనంతపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి మధ్య టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సయోధ్య కుదిర్చారు. అనంతపురం జిల్లా ఉరవకొండలో ఆదివారం నిర్వహించిన శంఖారావం సభ సమీపాన ఏర్పాటు చేసిన శిబిరం వద్దకు ఫరూక్, బ్రహ్మానందరెడ్డి వచ్చారు. వారిద్దరితో లోకేశ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఫరూక్ విజయానికి సహకరించాలనీ, ఇద్దరూ కలిసి పనిచేయాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు. పార్టీ అధికారంలోకొచ్చిన తర్వాత తగిన గౌరవం ఇస్తామని బ్రహ్మానందరెడ్డికి హామీ ఇచ్చారు. దీంతో ఫరూక్‌తో కలిసి పనిచేసేందుకు బ్రహ్మానందరెడ్డి అంగీకరించారు. పార్టీ విజయం కోసం పనిచేస్తానని ఆయన లోకేశ్‌కు చెప్పారు.

ఉంగుటూరు టీడీపీకే కేటాయించాలి!

పార్టీ జాతీయ కార్యాలయానికి తరలివచ్చిన కార్యకర్తలు

అమరావతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరు నియోజకవర్గం సీటును టీడీపీకి కాకుండా జనసేనకు కేటాయిస్తున్నారని పత్రికల్లో రావడంతో టీడీపీ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పార్టీ జాతీయ కార్యాలయానికి తరలివచ్చారు. టీడీపీ నేత గన్ని వీరాంజనేయులకు మద్దతుగా ఆదివారం వందలాది మంది కార్లలో తరలివచ్చారు. గన్ని వీరాంజనేయులకు సీటు కేటాయించాలంటూ నినాదాలు చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో ఉంగుటూరు సీటు అత్యంత కీలకమైందని, ఇక్కడ ఏ పార్టీ అభ్యర్థి నెగ్గితే రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి వస్తుందనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉంగుటూరులో ప్రస్తుతం తెలుగుదేశానికే ఎక్కువ గెలుపు అవకాశాలున్నాయని, ఓట్ల పరంగా 2019 ఎన్నికల్లో గన్ని వీరాంజనేయులకు 63 వేల ఓట్లు వచ్చాయని పేర్కొన్నారు. అన్ని ఓట్లు జనసేనకు బదలాయింపు కష్టంగా ఉంటుందని, నిర్ణయం మార్చుకుని టీడీపీకే ఈ సీటు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

టీడీపీ లీగల్‌సెల్‌కు అదనంగా కార్యదర్శుల నియామకం

అమరావతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ లీగల్‌సెల్‌కు అదనంగా పలువురు కార్యదర్శులను నియమించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. రాజానగరం నియోజకవర్గం లీగల్‌సెల్ కార్యదర్శిగా వై.దుర్గారావు, పరుచూరు నియోజకవర్గ కార్యదర్శిగా ఎ.వేణుగోపాలరావు, సత్తెనపల్లికి ఎం.జయరాం, పత్తికొండకు కలామది సురేష్‌కుమార్, పాణ్యంకు జి.నాగముని, అనంతపురం అర్బన్‌కు పి.లక్ష్మన్న, కడపకు షేక్ యజ్‌దాని బాషాలను కార్యదర్శులుగా నియమించారు.

రాష్ట్రంలో కూటమిదే విజయం

జగన్ రాక్షస రాజ్యం నుంచి ప్రజలకు విముక్తి : సీఎం రమేశ్



కడపలో మాట్లాడుతున్న సీఎం రమేశ్

కడప(మారుతీనగర్), మార్చి 10: రానున్న ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి రాష్ట్రంలో ఘన విజయం సాధించనుందని రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ వ్యాఖ్యానించారు. ఆదివారం కడప విమానాశ్రయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమాన్ని మంటగలిపి డబ్బు సంపాదనే ధ్యేయంగా వైసీపీ సాగించిన దుర్మార్గమైన పాలనకు ప్రజలు చరమగీతం పలకనున్నారన్నారు. వైసీపీ పాలనలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, చోటామోటా నాయకులు, బినామీ కంపెనీలు, ఏజెన్సీలు సైతం డబ్బు సంపాదనే తప్ప ప్రజల గురించి ఆలోచించిన పాపాన పోలేదన్నారు. ఇసుక, మద్యం, మైనింగ్, పవర్, భూములు, చివరకు టెండర్లలో దోపిడీ చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. మూడు పార్టీల కూటమి రాష్ట్రంలో అధికారం చేపట్టగానే వైసీపీ నేతలు దోచుకున్న డబ్బుతో పారిపోయి ఏ దేశంలో దాగి ఉన్నా రప్పించి ఆ డబ్బును ప్రజలకు పంచిపెడతామన్నారు. జగన్‌రెడ్డి సాగిస్తున్న రాక్షస రాజ్యం నుంచి ప్రజలకు విముక్తి కలగడం ఖాయమన్నారు. అభివృద్ధి అంటే ప్రధాని మోదీ... మోదీ అంటేనే అభివృద్ధి అనే విధంగా ఇవాళ యావత్ భారతదేశం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందన్నారు.

తోడుగా నేనుంటా..

- 149 కుటుంబాలకు భువనేశ్వరి సాయం
- 66 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటన
- 6092 కి.మీ. సాగిన 'నిజం గెలవాలి'
- చంద్రబాబు అరెస్ట్‌తో మనోవేదనతో చనిపోయినవారి కుటుంబాలకు పరామర్శ
- ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల సాయం
- వారం రోజుల పాటు విరామం
- తర్వాత మిగిలిన కుటుంబాలకు సాంత్వన



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనోవేదనకు గురై చనిపోయిన వారి కుటుంబాలకు ఆయన సతీమణి నారా భువనేశ్వరి సాంత్వన కలిగిస్తున్నారు. ఇప్పటి వరకూ 6092 కి.మీ. ప్రయాణించి, 66 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించి సుమారు 149 మంది కుటుంబాలను పరామర్శించారు. 'నిజం గెలవాలి' పేరుతో బాధిత కుటుంబాలను ఓదారుస్తూ వారి సమస్యలు, బాధలు వింటున్నారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షలు ఆర్థిక సాయం చేస్తున్నారు. పిల్లల చదువులకు సాయం చేస్తున్నారు. ఆయా కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇస్తున్నారు. మొదట్లో చెక్కుల రూపంలో సాయం అందించారు. తర్వాత నేరుగా వారి బ్యాంక్ ఖాతాలకే సాయం మొత్తం జమయ్యేలా ఏర్పాటు చేశారు. గతేడాది సెప్టెంబరు 9న స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును సీఐడీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆయన అక్రమ అరెస్టును తట్టుకోలేక 206 మంది టీడీపీ కార్యకర్తలు, అభిమానులు తీవ్ర మనోవేదనకు గురై ప్రాణాలు కోల్పోయారు. వారి కుటుంబాలకు పార్టీ అండగా ఉండాలని భావించింది. చంద్రబాబు సూచనల మేరకు భువనేశ్వరి బాధితుల కుటుంబాల వద్దకు వెళ్లి పరామర్శిస్తున్నారు. గతేడాది అక్టోబరు 25, 26, 27 తేదీల్లో చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 8 కుటుంబాలను పరామర్శించారు. ఆ తర్వాత విజయనగరం జిల్లాలో పరామర్శకు భువనేశ్వరి బయలుదేరిన సమయంలో చంద్రబాబుకు బెయిల్ రావడంతో కొన్ని రోజుల పాటు నిజం గెలవాలి కార్యక్రమానికి విరామం ఇచ్చారు. చంద్రబాబు విడుదల అనంతరం యథాతథంగా టీడీపీ కార్యక్రమాలు మొదలయ్యాయి. లోకేశ్ యువగళం కార్యక్రమం ప్రారంభించగా, చంద్రబాబు జిల్లాల పర్యటనలు చేశారు. జనవరి 3వ తేదీ నుంచి మళ్లీ నిజం గెలవాలి కార్యక్రమాన్ని భువనేశ్వరి కొనసాగించారు. జనవరి 3, 4, 5 తేదీల్లో విజయనగరం, బొబ్బిలి, ఎచ్చెర్ల, పాలకొండ, ఆముదాలవలస, విశాఖపట్నం నార్త్, సౌత్, గాజువాక అసెంబ్లీ పరిధిలో 15 కుటుంబాలను పరామర్శించారు. అనంతరం ప్రతి వారం నాలుగు రోజుల పాటు ఆమె పర్యటనలో ఉంటున్నారు. నిజం గెలవాలి కార్యక్రమంలో ఆయా కుటుంబాలను కలవడంతో పాటు మహిళలు, గిరిజనులు, విద్యార్థులు, చేనేతలతో భువనేశ్వరి సమావేశం అవుతున్నారు. వారి కష్టాలు తెలుసుకుని భరోసా ఇస్తున్నారు. త్వరలో వచ్చే ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ధైర్యం చెప్తున్నారు. అంతేగాక చంద్రబాబు అరెస్టు అయిన తర్వాత ప్రభుత్వ కుట్రలను ప్రశ్నిస్తూ భువనేశ్వరి పలు చోట్ల కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈ వారం విరామం

'నిజం గెలవాలి' పర్యటనకు భువనేశ్వరి వారం పాటు విరామం ప్రకటించారు. హెరిటేజ్ ఫుడ్స్ ఎండీగా ఉన్న భువనేశ్వరి ఈ వారంలో జరిగే బోర్డు మీటింగ్‌లకు హాజరు కావాల్సి ఉంది. అలాగే ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ నిర్వహణ పనులు చూసేందుకు నిజం గెలవాలి కార్యక్రమం నుంచి వారం పాటు విరామం తీసుకుంటున్నట్టు ఆదివారం ఆమె తెలిపారు. వారం తర్వాత మళ్లీ బాధిత కుటుంబాలను కలవనున్నట్లు పేర్కొన్నారు.

తిరుమలలో మూడేళ్ల బాలుడి కిడ్నాప్

- మహిళ ఎత్తుకెళ్లినట్టు గుర్తింపు
- నాలుగున్నర గంటల్లో తల్లి ఒడికి చేర్చిన పోలీసులు



తిరుమలలో అభినయ్‌ను ఎత్తుకెళుతున్న మహిళ, బిడ్డను ముద్దాడుతున్న తల్లి, పోలీసుల అదుపులో కిడ్నాపర్

తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం మూడేళ్ల బాలుడు కిడ్నాప్‌కు గురయ్యాడు. సీసీ కెమెరాల ఫుటేజ్, సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం ఆధారంగా నాలుగున్నర గంటల్లోనే కిడ్నాపర్‌తో సహా బాలుడిని పోలీసులు తిరుపతిలో గుర్తించారు. తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లాలోని అయిజ గ్రామానికి చెందిన నగేష్, పరిమళ దంపతులు తమ ఇద్దరు కుమారులు అక్షయ్(6), అభినయ్(3) తో పాటు నలుగురు కుటుంబ సభ్యులతో శ్రీవారి దర్శనార్థం ఆదివారం ఉదయం రేణిగుంటకు చేరుకున్నారు. అలిపిరి నుంచి కాలినడకన మధ్యాహ్నం రెండు గంటలకు తిరుమలకు చేరుకున్నారు. గది లభించకపోవడంతో అత్యంత రద్దీగా ఉండే యాత్రికుల వసతి సముదాయం-2లో సేదతీరారు. నడిచిరావడంతో అలసిపోయిన మహిళలు పిల్లలతో నిద్రపోయారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో పరిమళ నిద్రలేచి చూడగా అభినయ్ కనిపించలేదు. ఎంతకీ చిన్నారి ఆచూకీ తెలియకపోవడంతో తిరుమల టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ కెమెరాలను పరిశీలించగా ఎర్రటి దుస్తులు ధరించిన ఓ మహిళ సెల్‌ఫోన్ మాట్లాడుతూ బాలుడిని ఎత్తుకెళుతున్నట్టు గుర్తించారు. తిరుపతి రైల్వేస్టేషన్ ఎదుట సాయంత్రం 4.41 గంటలకు బాలుడిని తీసుకువెళుతున్న మహిళను సీసీ ఫుటేజీలో గుర్తించారు. వెంటనే తిరుపతిలో పోలీసులందరినీ అలర్ట్ చేశారు. కొంత సమయానికి తిరుపతిలోని పెద్దకాపు లేఅవుల్ ప్రాంతంలోని ఓ లాడ్జిలో ఆ మహిళ బాలుడితో ఉన్నట్టు పోలీసులకు సమాచారమందింది. పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని రాత్రి ఎనిమిది గంటలకు కిడ్నాపర్‌ను బిడ్డతోసహా అదుపులోకి తీసుకున్నారు. తర్వాత ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ఆ బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. తిరుమలలో కిడ్నాపైన బాలుడిని గంటల వ్యవధిలోనే గుర్తించామని దర్యాప్తు చేసి.. పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. కాగా.. బిడ్డను తిరిగి అమ్మఒడికి చేర్చడంలో సోషల్ మీడియా కీలకపాత్ర పోషించింది. పోలీసులు బాలుడి ఫొటోతోపాటు కిడ్నాపర్ ఫొటోలను వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారు. ఓ ఆర్టీసీ ఉద్యోగి వాట్సాప్‌లో వచ్చిన ఫొటోలు, సమాచారం ఆధారంగా కిడ్నాపర్‌ను గుర్తించి పోలీసులకు సమాచారమివ్వడంతోనే కిడ్నాప్ ఉదంతం సుఖాంతమైంది.

ఒకరుండాలి



ఒకరుండాలి. బ్లేడ్తో పెన్సిల్ చెక్కుతున్నప్పుడు చూపుడు వేలు చివర తెగి రక్తం బొట బొటా కారుతున్నప్పుడు అదాటుగా వేలును నోటిలో పెట్టుకుని చప్పరించే అమ్మాయిలా ఒకరుండాలి.

ఈదురుగాలికి ఒక్కసారిగా దుమ్ములేచి కంట్లో కారంలో పడినప్పుడు చెంపలను అరచేతుల్లోకి తీసుకుని పూల రెక్కల కనురెప్పలను విప్పదీసి ఉఫ్ ఉఫ్ మని కళ్ళల్లోకి ఊదే మిత్రుడులా ఒకరుండాలి.

తుమ్మముళ్ళు అరికాలి మడమలోకి మెత్తని పులిలా కసుక్కున దిగినప్పుడు ప్రేమగా పాదాన్ని మోకాలి మీద పెట్టుకుని ఇంకా ఉమ్ము రాసి పిన్నీసుతో నొప్పి తెలియకుండా ముల్లునుతీసి రాయుప్పు పెట్టి అగ్గితో కాకపెట్టిన వదినమ్మ లాంటి ఒకరుండాలి.

అల్లరి చేశాడని పట్టరానికోపంతో పిల్లాడిని అదేపనిగా కొట్టేస్తే ఏడ్చి ఏడ్చి అలసిపోయి వాడు నిద్రపోతే ఆనక ఎత్తుకొని వొళ్ళో పండబెట్టుకుని మండుతున్న పొయ్యి ముందుకూర్చుని ఏడుస్తూ పుల్లలేగదోస్తున్న అమ్మలాంటి ఒకరుండాలి.

తనను ప్రాణప్రదంగా చూసుకునే నాన్న కాలేయం చెడిపోయి ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నప్పుడు పక్కటెముకను తీసిఇచ్చినట్లు తన కాలేయన్ని కొంత తీసి ఇచ్చి పునర్జన్మ ప్రసాదించిన తల్లిలాంటి కూతురు ఒకరుండాలి.

వణుకుతున్న చేతులతో కాఫీగ్లాసును చేతికి అందించలేక సతమతమవుతున్న నరాలు పైకి తేలిన తాతయ్య చేతులమీద తన మృదువైన చేతులు అదిమిపట్టి గ్లాసును నోటికి అందించిన మనవరాలు లాంటి ఒకరుండాలి.

నెలల పసిపాపకు ఒంటినిండా నూనె పట్టించి గోరువెచ్చని నీళ్లతో సున్నిపిండి స్నానం చేయించి చివరన చిన్నారి ముక్కును నోట్లో పెట్టుకుని పీల్చి తుపుక్కున ఉమ్మిన అమ్మమ్మ లాంటి ఒకరుండాలి.

అప్పుడే ఈనిన లేగదూడ ఒళ్లంతా గొప్ప తన్మయత్వంతో నాకుతున్న తల్లిఆవులా అప్పుడే రాసిన తడియారని కవిత‌ను గొప్ప ప్రేమతో వినే మిత్రుడున్నట్టు ఒకరుండాలి.

చివరాఖరుకు ఆ ఒక్కరు నలుగురు అవ్వాలి, ఆ నలుగురు వెనక్కి తిరిగి చూసుకుంటే పెద్ద సమూహం అవ్వాలి.

శిఖామణి
98482 02526

వర్తన రెండవ సమావేశం

వర్తన సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో రెండవ సమావేశం మార్చి 17 ఉ.10.30గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. 'కవిత్వ వాస్తవికత' అనే అంశంపై కవి సిద్ధార్థ ప్రసంగిస్తారు. అధ్యక్షత రూప్ కుమార్ డబ్బీకార్.

ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

ఉమ్మడిశెట్టి అవార్డు

36వ ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డుకు 2023 సంవత్సరానికి బండి సత్యనారాయణ కవిత్వ సంపుటి 'ఒంటి కాలు పరుగు' ఎంపికైంది.

సుంకర గోపాలయ్య

పెన్నా సాహిత్య పురస్కారం

పెన్నా సాహిత్య పురస్కారం 2023 సంవత్సరానికి వశిష్ఠ సోమేపల్లి కవిత్వ సంపుటి 'ఆకు రాలినచప్పుడు' ఎంపికైంది. త్వరలో జరిగే పెన్నా రచయితల సంఘం వార్షికోత్సవ సభలో పురస్కార ప్రదానం ఉంటుంది.

అవ్వారు శ్రీధర్ బాబు

రచనలకు ఆహ్వానం

మక్కెన రామ సుబ్బయ్య కథా పురస్కారం, నెల్లుట్ల కవితా పురస్కారం, కె.వి. రావు కవితా ప్రక్రియ పురస్కారం (మినీ కవితలు, గజల్స్, నానీలు, హైకూలు, దీర్ఘకవితలు), సాహితీ పురస్కారం (సమీక్ష/ విమర్శ), బాలసాహిత్య పురస్కారం (కథ, కవిత, గేయం), విజ్ఞాన - మనోవైజ్ఞానిక పుస్తక పురస్కారం... ఈ విభాగాల్లో రచయితలు 2023లో ప్రచురించిన పుస్తకాలు మూడేసి ప్రతులను ఏప్రిల్ 8లోగా చిరునామా: మక్కెన శ్రీను, అసోసియేట్ డీన్, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, గరివిడి, విజయనగరం జిల్లా - 535 101, ఎ.పి.కు పంపాలి. పురస్కార గ్రహీతలకు రూ.7000 నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కారం ఉంటుంది.

మక్కెన శ్రీను

మట్టి వేతల కళింగాంధ్ర కవిత

బొమ్మలు: అక్బర్

రెండువేల సంవత్సరం నుంచి ఇప్పటివరకు అనగా రెండు దశాబ్దాల పైచిలుకు కాలంలో కళింగాంధ్ర కవిత్వపు వస్తుశిల్పాలు విమర్శకు గురికావాల్సిన ఆవశ్యకత వుంది. ఇరవై ఒకటవ శతాబ్దపు తొలి రెండు దశాబ్దాలు పూర్తయి మూడో దశాబ్దంలోకి అడుగుపెట్టింది కళింగాంధ్ర. ఈ కాలవ్యవధిలో కళింగాంధ్ర నేల మీద జరిగిన రాజకీయ సామాజిక ఘటనలు- ఆ నేపథ్యంలో వచ్చిన కవిత్వం- వాటి వ్యక్తీకరణ తీరుతెన్నులు రాబోయే భవిష్యత్తు సాహిత్య వాతావరణాన్ని కచ్చితంగా ప్రభావితం చేస్తాయి. ఈ రెండు దశాబ్దాల కళింగాంధ్ర కవిత్వం భవిష్యత్తు కళింగాంధ్ర కవిత్వానికి చోదక శక్తిగా వుంటుందా? అనేది తరచి చూసుకోవాల్సిన ఆవశ్యకత వుంది. ఈ క్రమంలో ఏర్పడ్డ ఖాళీలను కచ్చితంగా పూరించుకోవాల్సిన పెద్ద బాధ్యతే ఉంది. ఖాళీలను పూరించడం చారిత్రక అవసరం అని కళింగాంధ్ర నేలను భుజానికెత్తుకునే సృజనకారులుగా గుర్తెరగాలి. ఈ నేల మీద అపారమైన వనరులున్నట్టే- అపారమైన సాహిత్య వస్తువుంది. ఇప్పటివరకు కళింగాంధ్ర వస్తువు సాహిత్యంలోకి ఎంతగా వచ్చిందో గమనించుకోవాలి.

ఇరవై ఒకటవ శతాబ్దపు కళింగాంధ్ర కవిత్వాన్ని దగ్గరగా పరిశీలించినప్పుడు- కచ్చితంగా ఇది 'ప్రజాదారి' అని అర్థమౌతుంది. విప్లవోద్యమం బాటలో నడిచిన పాణిగ్రాహి వారసులం మనం. కళింగాంధ్రలో విప్లవోద్యమ అడుగులే లేకపోతే బహుశా ఇప్పటి కళింగాంధ్ర కవిత్వం ఈ తీరుగా వుండదు. ఇక్కడి కవి వలసదుఃఖాన్ని తలకెత్తుకొన్నాడంటే- కార్మికవర్గ స్పృహని రగిలించుకున్నాడంటే- ఈ నేలమీద జరుగుతున్న అనేక రాజకీయ సామాజిక ఘటనల సంఘర్షణను అర్థం చేసుకుని కవిత్వంగా మొగ్గతొడుగుతున్నాడంటే- ఈ అన్నింటి వెనుక కచ్చితంగా కళింగ నేలమీద జరిగిన విప్లవోద్యమ ప్రకంపనల స్పర్శ లేకుండా లేదు- కాబట్టి ఇప్పటి కళింగాంధ్ర కవిత్వానికి బీజాలు విప్లవోద్యమం ఉత్పత్తే!

2

కొత్త శతాబ్దపు తొలినాళ్ల కళింగాంధ్ర కవిత్వంలో మనం కచ్చితంగా చెప్పుకోవాల్సినవి- 'నాగేటిచాలుకు నమస్కారం' (2002), 'నాగలి' (2006), 'దుఃఖ్ఖేరు' (2005), 'నిప్పులవాగు' (2005), 'మట్టి చెట్టూ పిట్ట భజనిక' (2006)- ఐదూ వ్యవసాయ నేపథ్య దీర్ఘకవితలే. ఈ ఐదు దీర్ఘ కవితలూ- తరువాత రాబోయే కళింగాంధ్ర వ్యవసాయ కేంద్రక కవిత్వానికి తొలి విత్తనాలు వేసాయనే చెప్పి తీరాలి.

3

'నాగేటి చాలుకు నమస్కారం', 'నాగలి' రెండూ గంటేడ గౌరునాయుడు రాసినవి. 'నాగేటిచాలుకు నమస్కారం' కవి దుఃఖాలాపన. ఈ కవితలో రైతు సాదాసీదా జీవితం కవిత్వంలోకి వస్తుంది. సహజాలంకారమైన జీవితం- వానలు కురవడం, విత్తనాలు జల్లడం, ఉడుపులు- ఇలా వ్యవసాయ అనుబంధ అంశాలతో కవిత కళకళలాడుతుంది. రైతు సాంస్కృతిక జీవితం కవితలో పరుచుకుంటుంది: "రానున్న పంటలతో/ నిండాలని తమ గాదులు/ రైతన్నల కన్నుల్లో/ ఉదయించే ఉగాదులు" అని అన్న కవి- "కలలు చెడగొట్టింది కార్తీకం/ కలత నిదర చెదురయ్యింది కార్తీకం/ నల్లమబ్బులు తెచ్చి కార్తీకం/ వాయు గుండాలనే రేపె కార్తీకం" అంటాడు. 'నాగేటి చాలుకు నమస్కారం' 2002లో వస్తే 'నాగలి' 2006లో వచ్చింది. 'నాగేటి చాలుకు నమస్కారం' రాసిన నాలుగేళ్ల తర్వాత కూడా కవిని వ్యవసాయ సంక్షోభం కల్గించిన దుఃఖపీడన వదలలేదు అనడానికి ఈ 'నాగలి' దీర్ఘకవిత ఒక చిహ్నం.

'నాగలి' ప్రచురణకు మునుపే 1990 పూర్వపరాల్లో రాసి- 2005లో ప్రచురణ జరిగిన- 'దుఃఖ్ఖేరు'లో పొలిపొలి, నాగళ్ళు, దుక్కిటేరు అను మూడు కవితలున్నాయి. 'దుఃఖ్ఖేరు'ను శృతి కావ్యం అన్నారు ఛాయరాజ్. ఒకటి- 'పొలి పొలి'లో గ్రామీణ వ్యవసాయ జీవిత సాంస్కృతిక అంశాలను- వాటి మధ్య వున్న విప్లవ చర్యను- అక్షరబద్ధం చేస్తారు. ఈ కవిత 1995, 96లో రాశారు ఛాయరాజ్. రెండు- 'నాగళ్ళు' కవితలో బువ్వ పెట్టే రైతన్నలను అన్యాయం చేస్తున్న 'పెట్టుబడి దుష్టశక్తుల నాశనం' గానం చేస్తారు ఛాయరాజ్. ఇది 1988లో రాశారు. మూడు- 'దుక్కిటేరు'లో సకలం రైతే అని సగౌరవంగా ప్రకటిస్తారు. కళింగాంధ్ర కవిత్వ బాండాగారంలో 'దుఃఖ్ఖేరు' విలక్షణమైన కావ్యంగా మనం చెప్పుకోవచ్చు

మరో కళింగనేల వ్యవసాయ కవి 'అల'. అల రాసిన 'నిప్పుల వాగు' విప్లవ దృక్కోణంలోంచి వెలువడిన వ్యవసాయిక కవిత. ఆరుగాలం చేసిన కష్టం- చివరకు భూస్వామి పాదాక్రాంతం అయినప్పుడు విప్లవమే పరిష్కారంగా చూపుతాడు కవి. విప్లవ అవసరాన్ని కవిత అడుగడుక్కీ ప్రకటిస్తుంది. 'మట్టిచెట్టు పిట్టభజనిక' అను తన రెండో దీర్ఘకవితలో అల ప్రపంచీకరణ నేపథ్యంలో వ్యవసాయ సంక్షోభాన్ని కవిత్వం చేస్తారు. 'మట్టిచెట్టు పిట్టభజనిక' వ్యవసాయ రాజకీయ కవిత. గాఢమైన శిల్ప చేవ వున్న కవిత.

రెడ్డి రామకృష్ణ 'గొడిముక్క' దీర్ఘకవితను 2001లో వెలువరించారు. 'గొడిముక్క' అంటే దగ్గర గజం పొడవు గల వెదురుముక్క- గొడ్లను అదిలించడానికి ఉపయోగించే గొడ్లకాపరి చేతిలోని కర్ర. ఏళ్లకేళ్లు 'బుగత' బారిన పడిన ఒకానొక 'పాలేరు'లో చైతన్యం పూసిన కళింగాంధ్ర కొత్త సందర్భం ఈ కవిత. 'చుండూరు'- ప్రేరణలోంచి ఎదిగొచ్చిన కవిత ఇది. కవిత ముగింపులోనూ 'చుండూరు' కనిపించడం- ఒక కోణంలో కవిత సాధించిన విజయమే. లక్షింపేట వాస్తవికత 'గొడిముక్క'. రామకృష్ణ గారు గొడిముక్కలో రాసింది- లక్షింపేటలో నిజమైంది. కారా మాస్టారి 'యజ్ఞం' కథ నేపథ్యం ఇదే కదా! తిమోతి జ్ఞానానంద కవి తదుపరి దళిత వస్తువును ఇంత బలంగా కళింగనేల మీద చెప్పిన కవి బహుశా రామకృష్ణ గారే అవ్వొచ్చు!

4

ఈ ఆరు దీర్ఘకవితలూ ఇరవై ఒకటవ శతాబ్దపు కళింగాంధ్ర కవిత్వాన్ని దిశానిర్దేశం చేసాయని నేను భావిస్తున్నాను. వీటి తదుపరి వచ్చిన కవిత్వం- ఈ ఆరు దీర్ఘకవితలు వేసిన బాటని మరింత విశాలం చేశాయని చెప్పొచ్చు.

గంటేడ 'నదిని దానం చేశాకలో' (2006)- నాగావళి నది వొడ్డు నిర్వాసిత గ్రామాల దుఃఖాన్ని గానం చేస్తారు. పి.ఎస్. నాగరాజు 'ప్రవహించే ప్రజలు' (2005) పోరాట చైతన్యాన్ని ప్రకటిస్తుంది. అరుణ బవేరాది (ఒక కన్నీటిచుక్క కోసం-2002) ఒక దారి- సున్నిత ప్రకటన అతనిది. దేశరాజు 'ఒకేఒక్క సామూహిక స్వప్నావిష్కారణ' వచ్చిందీ ఈ కాలంలోనే (2000). చింతా అప్పలనాయుడు, సిరికి స్వామినాయుడు కలిసి 2003లో 'రెక్క తలుపుల గోస'గా వచ్చారు- ఇది ప్రధానంగా వ్యవసాయ సంబంధ కవిత్వం- ఈ కవితల్లో శిల్పం కన్నా వస్తువు ముఖ్యం- కెక్యూబ్ వర్మ 'వెన్నెల దారి' (2006)తో కళింగనేల మీద విప్లవకవిత్వ నడకని రూపుకట్టాడు. మోహన్ 'ఉద్దానం పువ్వు' 2002లోనే వచ్చింది. మానేపల్లి 'కలలు నేల మీదికి' (2004), పి. అనంతరావు 'మూడు చిరునామాలు' (2006), రెడ్డి రామకృష్ణ 'పినలగర్ర' (2008)- ఈ కాలంలోనే వచ్చాయి.

కళింగాంధ్ర కవిత్వం గురించి మాట్లాడుకునేటప్పుడు- 'దుక్కి' సంపుటి గురించి తప్పక చెప్పుకోవాలి. ఇది 2008లో వచ్చింది. కవి- చింతా అప్పలనాయుడు.



> 2000 నుంచి 2010 వరకు కళింగ నేల మీద పురుడు పోసుకున్న కవిత్వంలో వస్తువు- ప్రధానంగా వ్యవసాయంది. శిల్పం- వ్యవసాయంది. అందుకే కళింగాంధ్ర వ్యవసాయ కవిత్వానికి అమిరిన శిల్పాన్ని 'వ్యవసాయ శిల్పం' అని నేను నామకరణం చేయదలిచాను. కళింగ నేల మీద ప్రధానంగా- రైతు- వ్యవసాయం నుంచి పరాయీకరణకు గురికాబడినప్పుడు- వస్తుశిల్పాలు రెండూ వ్యవసాయానికి చెందినవి అవడంలో ఆశ్చర్యం లేదు.

'దుక్కి' సంపుటిలో కళింగాంధ్ర వ్యవసాయిక జీవద్భాష తొణికిసలాడుతుంది.

2000 నుంచి 2010 వరకు కళింగ నేల మీద పురుడుపోసుకున్న కవిత్వంలో వస్తువు- ప్రధానంగా వ్యవసాయంది. శిల్పం- వ్యవసాయంది. అందుకే కళింగాంధ్ర వ్యవసాయ కవిత్వానికి అమిరిన శిల్పాన్ని 'వ్యవసాయ శిల్పం' అని నేను నామకరణం చేయదలిచాను. రెండువేలు తర్వాత కళింగ నేల మీద ప్రధానంగా- రైతు- వ్యవసాయం నుంచి పరాయీకరణకు గురికాబడినప్పుడు- వస్తుశిల్పాలు రెండూ వ్యవసాయానికి చెందినవి అవడంలో ఆశ్చర్యం లేదు.

2010 తర్వాత మాత్రం కొత్త వస్తువు కళింగాంధ్ర కవి ముందుకు వచ్చి నిల్చుంది. వస్తువుననుసరించే శిల్పమూ మారింది. దీనికి ప్రధాన కారణం సామాజిక ఘర్షణలోని ప్రత్యేకతే. కళింగాంధ్రలో సోంపేట, కాకరాపల్లి, కొవ్వాడ లాంటి ఘటనలు జరగటం- ఆయా ఘటనల పూర్వపరాలను కళింగాంధ్ర కవి తన లోపలికి ఇంకించుకోవటం- కొత్త కళింగాంధ్ర కవికి- అవి చోదకశక్తిగా పనిచేయటం వలన శిల్పం మారింది.

కళింగాంధ్ర కవి వేళ్లు కళింగమట్టిలోనే పాదుకున్నాయనేదానికి ఉదాహరణగా సిరికి స్వామినాయుడు రాసిన కవితలు కొన్ని నిలుస్తాయి. స్వామినాయుడు- వస్తుశిల్పాలలో వైవిధ్యం ఇంకా సాధించాల్సి వుంది. స్వామినాయుడు 'పొద్దు' కవిత చూడండి- 'తూరుపుదిక్కును జూపి అమ్మనడిగాను/ 'పొద్దేమిటి ఎరుపుగా ఉంద'ని!/ 'మీ అయ్యారబోసిన మిరపకళ్లమ'ని చెప్పింది/ బంతిపూలై విరిసిన కళ్లతో...!// పడమటి దిక్కును జూపి మళ్లీ అదే అడిగాను/ 'మార్కెట్ మంటల్లో తగలబడుతున్న/ మన బతుకుల'ని చెప్పింది/ఎత్తిన కారం పిడికిళ్ళతో... !'/

కళింగాంధ్ర కవుల్లో మరో కవి- పాయల మురళీకృష్ణ. మురళీకృష్ణది ఒక ప్రత్యేకమైన శిల్పం. పొరలుపొరలుగా కవితను విప్పదీస్తాడు. మరో కళింగాంధ్ర కవి- మొయిద శ్రీనివాస్- కార్మికవర్గ స్పృహ తన ఆలోచనకూ, కవిత్వానికి మూల ఇరుసు. కొత్త పదబంధాలు సృష్టించిన చేవ వుంది ఈ కవికి. ఆశ్చర్యం గొలిపే వూహ చేయగలడు. ఈ దశాబ్దంలోనే కెక్యూబ్ వర్మ 'రెప్పలవంతెన' (2013), 'కాగుతున్న రుతువు' (2017) సంపుటాలను తీసుకొచ్చారు. విప్లవ చైతన్యం పూసిన కవిత్వం ఇతనిది. బాల సుధాకర్ 'ఎగరాల్సిన సమయం' (2014), 'ఆకు కదలని చోట' (2016), 'నీళ్లలోని చేప' (2018), 'భూమి పెదాలపై' (2019) సంపుటాలూ ఈ కాలంలోనే వచ్చాయి. మరో కళింగాంధ్ర కవి 'పక్కి రవీంద్రనాథ్- 'పక్షితనాన్ని కలగంటూ..' (2019) అంటూ బయలుదేరుతాడు. గంటేడ 'ఎగిరిపోతున్న పిట్టల కోసం' (2014), రెడ్డి రామకృష్ణ 'బీల-భూమి-సముద్రం' (2012)- కళింగ అస్తిత్వాన్ని ప్రకటించే కవిత్వాలే. గవిడి శ్రీనివాస్, చింతాడ తిరుమల రావు, బుడితి రామినాయుడు, సన్ని, ఇళ్ల ప్రసన్న లక్ష్మి, చెళ్లపిళ్ల శ్యామల, పద్మావతి రాంభక్త, పి. అనంతరావు, ఎల్. ఎన్. కొల్లి మున్నగు కవులు తమ తమ సంపుటాలతో ఈ కాలాన్ని పరిపుష్టం చేశారు.

5

2020 తర్వాత మనం గుర్తుంచుకోదగిన కళింగాంధ్ర కవులు ముగ్గురున్నారు. లండ సాంబమూర్తి, కంచరాన భుజంగరావు, కలమట దాసుబాబు.

సాంబమూర్తి- ఉద్దానం కిడ్నీ బాధితుల ఘోషను కవిత్వం చేసిన కవిగా మనకు గుర్తుంటాడు. కంచరాన, దాసుబాబు- ఇరవై ఒకటో శతాబ్దపు మూడో దశాబ్దంలోనూ కళింగాంధ్ర వ్యవసాయ సంక్షోభాన్ని, వలస దుఃఖాన్ని గానం చేసిన కవులుగా గుర్తుంటారు. భుజంగరావు 'నవ్వు మరిచిన నేల', 'నీటిగింజల పంట'- ఈ రెండు గుర్తించుకోదగిన కవితలు. కలమట దాసుబాబు రాసిన 'కళింగోర' కవిత ఈ నేల నుంచి వచ్చిన ఒక విశిష్టమైన కవితగా మనం గుర్తుంచుకోవాలి. అద్భుతమైన కళింగ మాండలికంతో కవిత నడుస్తుంది. ఈ కవిత నేపథ్యం వలసే- ఈ కవిత ముగింపులో 'కళింగోర కవి దాసుబాబు' అంటాడిలా- 'దోపిడీ తీరు మారలేదు.. పోరూ పాతబడలేదు.../గుండారు బిగించి కన్నెర్రగించవే/ కళావతక్కా.. తల్లీ.. మా కళింగోర..'

రెండు వేల ఇరవై తర్వాత- మళ్లీ గంటేడ ఢిల్లీలో రైతు ఉద్యమానికి సంఘీభావంగా-రైతు ఉద్యమ సంఘీభావ కవిత్వం' (2021) పేరుతో ఒక కళింగనేల కవిగా కవిత్వం వెలువరించారు. కెక్యూబ్ విప్లవ వాస్తవికతతో 'భూమిరంగు మనుషులు' (2021)తో వచ్చారు. రెడ్డి శంకరరావు 'కాలం ఒడిలో' (2022), లండ సాంబమూర్తి 'గాజురెక్కల తూనీగ' (2020), 'నాలుగురెక్కల పిట్ట' (2022), భుజంగరావు 'నీటిగింజల పంట' (2023), బాలసుధాకర్ 'దుఃఖపు వొరుపు (2021), నిర్వేదస్థలం(2022), అస్తిత్వవాచకం(2023)' సంపుటాలతో బయలుదేరారు. 2020 తర్వాత వచ్చిన కవిత్వ సంపుటాల్లో విశిష్టమైనది- 'దుర్ల' (2021). కవి- మల్లిపురం జగదీశ్. ఇరవై ఒకటో శతాబ్దపు మూడో దశాబ్దంప్రారంభంలో ఆదివాసీ కవితా సంపుటిగా 'దుర్ల' రావడం కళింగాంధ్ర కవిత్వానికి మేలు చేర్పు.

6

ఏ ప్రాంతపు నేలకైనా దానిదైనా సొంత రూపం, వ్యక్తిత్వం వుంటాయి. దానినే అస్తిత్వం అంటున్నాం. కళింగ నేల అస్తిత్వం కళింగనేలకే ప్రత్యేకమైనది.

బాలసుధాకర్ మౌళి
96764 93680

చీకటిలో వికసించిన జ్ఞానపద్మం!

ఈ సంవత్సరం జ్ఞానపీఠ్ పురస్కారం పొందిన జగద్గురు రామభద్రాచార్య రెండు నెలల వయస్సులోనే ట్రకోమా వ్యాధితో కంటిచూపు కోల్పోయారు. అయినా ఇరవై రెండు భాషలు నేర్చుకొని సుమారు రెండు వందల పుస్తకాలను రచించడమే కాకుండా ప్రపంచంలోనే తొలిసారిగా దివ్యాంగుల కోసమే ఉచిత చదువు, వసతీ సౌకర్యాలతో ఒక యూనివర్సిటీని ఏర్పాటు చేసే స్థాయికి చేరుకున్నారు.

14 జనవరి 1950లో ఉత్తర ప్రదేశ్‌లోని జౌన్‌పూర్ జిల్లాలో శాండీకుర్ద్ గ్రామంలో జన్మించిన రామభద్రాచార్య అసలు పేరు గిరిధర్ లాల్ మిశ్రా. 1953 జూన్ నెలలో గ్రామంలో గారడీవాడి కోతి నృత్యం చేస్తున్న ప్రదర్శనలో కోతి వీక్షకులను తాకే సమయంలో గిరిధర్ లాల్ పిల్లలతో సహా పారిపోబోతూ ప్రమాదవశాత్తూ ఒక పాడుబడిన నూతిలో పడిపోయారు. ఒక యువతి రక్షించేవరకు అక్కడే చిక్కుకున్నాడు. తులసీదాస్ రామచరిత మానస్‌లోని 'యహ చరిత్ జే గావహి హరిపద్ పావైతే న పరహి బవకృప' అన్న శ్లోకంలోని పంక్తిని నేర్చుకున్నందున అతని జీవితం రక్షింపబడిందని అతని తాత చెప్పే వారు (దీనిని పాడేవారు హరి పాదాలకు చేరుకుంటారు. జనన మరణాల ఊబిలో పడరు).



గిరిధర్‌లాల్‌కు ప్రారంభ విద్య అతని తాతగారి నుంచి లభించింది. రామాయణ, మహాభారతంలోని కథలను విశ్రామ్ సాగర్, సుఖ్‌సాగర్, ప్రేమ్ సాగర్, బ్రజ్విలాస్ లాంటి భక్తి రచనలను తాతయ్య అతనికి చెప్పేవారు. అయిదేళ్ల వయసులోనే గిరిధర్ తన మొదటి కవితా భాగాన్ని అవధి (హిందీ మాండలికం)లో కూర్పు చేశాడు. ఊరిలో అయిదవ తరగతి వరకు చదువుకున్నారు. ఆ తర్వాత సంస్కృత వ్యాకరణం, హిందీ, ఇంగ్లీష్, భూగోళ శాస్త్రం, గణితం, చరిత్ర అధ్యయనం చేశారు. సంస్కృత విద్యలో ప్రథమ, పూర్వ మాధ్యమ, ఉత్తర మాధ్యమ, శాస్త్రి, ఆచార్య పరీక్షలలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. "మీ ఉపాధ్యాయులు ఎవరెవరో మీకు తెలుసా?' అని చిత్రకూట్‌లో నేను ఐజీపీగా ఉన్నప్పుడు మా ఇంటికి విచ్చేసిన రామభద్రాచార్య గారిని అడిగినప్పుడు ఆయన ఇలా చెప్పారు: "నా ధ్యానం అంతా ఉపాధ్యాయుడు చెప్పే పాఠం మీదే ఉండేది. నేను విని అర్థం చేసుకునేవాడిని. ఇంటికి వచ్చి మా తమ్ముడికి చెప్పేవాడిని. వాడు ఒక పుస్తకం మీద రాసేవాడు. తిరిగి చదవి వినిపించేవాడు. అలా నాలో జ్ఞాపక శక్తి, సృజనాత్మకత పెరిగింది."

ఈశ్వరదాస్ (మంత్రం), రామప్రసాద్ త్రిపాఠి (సంస్కృతం), రామచరణదాస్ (సంప్రదాయం)లను తన గురువులుగా చెప్పే రామభద్రాచార్య - బెనారస్‌లోని సంపూర్ణానంద సంస్కృత విద్యాలయంలో టాపర్‌గా నిలిచి స్వర్ణపతకం పొందారు. 1976లో నవ్య వ్యాకరణాచార్య పరీక్షలో విశ్వవిద్యాలయంలో ప్రథమ స్థానం పొందారు. 1981లో 'అధ్యాత్మ రామాయనే అపాణినీయ ప్రయోగాణా విమర్శ' విషయం మీద పీహెచ్‌డీ పొందారు. 1996లో 'అష్టాధ్యాయః ప్రతిసూత్రం శాబ్దబోధ్ సమీక్షణం' విషయం మీద డీలిట్ పొందారు. ఈ పరిశోధన సంస్కృతంలో 1975 పేజీల్లో రాశారు. దీనిని ప్రపంచంలోనే అతి విస్తృత సంస్కృత పరిశోధనగా చెబుతారు. పాణిని వ్యాకరణం మీద పదివేల పేజీల వ్యాఖ్యానం రాశారు. సంస్కృత వ్యాకరణంలో అసాధారణ పాండిత్యం సంపాదించారు. 'వేదాంత, న్యాయ'లలో ప్రావీణ్యం పొందారు. వీరిది విశిష్టాద్వైత వేదాంతం, రామాయణ, భాగవత కథకులుగా ఉత్తర భారతంలో చాలా ఖ్యాతి గడించారు.

వీరు వ్యాకరణం, సాంఖ్య, న్యాయ, వేదాంత, సంస్కృత అంతక్షారి విభాగాలలో బంగారు పతకాలను సాధించారు. అప్పటి భారత ప్రధాని ఇందిరాగాంధీ ఐదు బంగారు పతకాలతోపాటు, ఉత్తరప్రదేశ్ తరపున చల్వాయిజయంతి ట్రోఫీని గిరిధర్‌కు అందజేశారు. అతని ప్రతిభకు మెచ్చి ఇందిరాగాంధీ వీరి కళ్ళకు చికిత్స కోసం ప్రభుత్వ ఖర్చుతో అమెరికాకు పంపాలని ప్రతిపాదించారు. కాని గిరిధర్ ఈ ప్రతిపాదనను తిరస్కరించారు. 'దుర్గుణాలతో నిండిన, వివాదాలతో, మోసపూరితమైన దుష్టమానవుల పాపాలతో పరిపాలించబడుతున్న ఈ ప్రపంచంలో నేనేమి చూడాలి? కమలం లాంటి ముఖాన్ని కప్పివేసే వెంట్రుకలు కలిగిన, సంపూర్ణ ఆనందంలో ఉన్న, పిల్లల రూపాన్ని కలిగివున్న రాముడు మాత్రమే విముక్తి ఇచ్చేవాడు' అని ప్రధాన ఇందిరా గాంధీకి జవాబు రాసి పంపారు శ్రీ రామభద్రాచార్య.

వీరు 8 సంస్కృత మహాకావ్యాలు రాశారు. సుమారు 100 సంస్కృత స్తోత్ర కావ్యాలు రాశారు. 11 ఉపనిషత్తుల మీద 11 తాత్విక గ్రంథాలు రాశారు. శ్రీమద్భగవద్గీత, బ్రహ్మసూత్ర, శ్రీరామస్తవరాజ, శ్రీనారదభక్తి సూత్ర గ్రంథాల మీద 'శ్రీ రాఘవకృపా భాష్యం' రాశారు. 16 లఘు కావ్యాలు రాశారు. ప్రవచన గ్రంథాలు, టీకా గ్రంథాలు, సంపాదకీయ గ్రంథాలు రాశారు. వీరి రచనలలో 'ప్రస్థానత్రయి, శ్రీ భార్గవ రాఘవీయం, భృంగదూతం, గీతారామాయణం, శ్రీసీతారామ సుప్రభాతం, శ్రీసీతారామ కేళీ కౌముది, అష్టావక్రుడు, శ్రీ రాఘవకృపా భాష్యం' ప్రముఖమైనవి.

రామభద్రాచార్య తులసీదాసు పేరు మీద చిత్రకూట్‌లో సామాజిక సేవా సంస్థ 'తులసీ పీఠ'ను స్థాపించారు. తనలాంటి దివ్యాంగుల కోసం చిత్రకూట్‌లో విద్యాలయాలు స్థాపించారు. దివ్యాంగుల కోసం ఆయన విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. ఇది నాలుగు రకాల దివ్యాంగులకు గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను అందిస్తుంది. దివ్యాంగుల కోసమే కాకుండా వినికిడి కోల్పోయిన వాళ్ళ కోసం రామభద్రాచార్య 'తులసీ ప్రజ్ఞా చక్షు బధిర ఉచ్చతర మాధ్యమిక విద్యాలయం' స్థాపించారు.

చూపులేనప్పటికీ ఆత్మవిశ్వాసంతో విద్యాభ్యాసాన్ని కొనసాగించడమే కాకుండా అంధులకు, బధిరులకు ఉచిత విద్య అందించే విద్యాలయాల్ని స్థాపించే స్థాయి వరకూ కొనసాగిన రామభద్రాచార్య జీవన ప్రయాణం ఆదర్శనీయం.

కిల్లాడ సత్యనారాయణ
83339 87838

పుస్తకం చదివిన జీవితం



పట్నంలో...
ఇరుకిరుకు అద్దెగదిలో
కొంతకాలంగా ఓ పుస్తకం
జీవితాన్ని చదువుతుంది

గూటికి చేరుకుంటున్న పక్షి
కిటికీలోంచి...
పుస్తకం కంటపడింది
ఇంకేముంది
రాలిన కన్నీటిచుక్క
ఓ అక్షరాన్ని తడిచేసింది

సమాధానాలన్నీ తెలిసిన పుస్తకానికి
మడిసెక్కలో తిరిగాడిన
తండ్రి పాదాలలోని
పగుళ్ళకు కారణం
ఊరిలో అప్పుకై చాచిన
తల్లి చేతులలో శూన్యం
ఎప్పుడూ ప్రశ్నగానే మిగిలిపోతుంది

పరీక్షా కాలంలో...
రూమ్ రెంటివ్వకపోతే
గదిని ఖాళీ చేయమన్న గొంతు
ఫీజు చెల్లించకపోతే
కోచింగు సెంటరులో
కాలు పెట్టొద్దన్న మాట
పుస్తకం బుర్రలో
దీపం చుట్టూ...
పురుగులా తిరుగుతుంది

తనను నమ్ముకున్న వారి కష్టాలు
గట్టెక్కుతాయో లేదన్న నమ్మకం
ఊరి నుంచి తెచ్చుకున్న మూటలోని
కోటా బియ్యంలా తరిగిపోతుంది
పిచ్చి పిచ్చి ఆలోచనలతో మనసు
గది మూలన గాలికి తిరిగే
ఖాళీ ప్లాస్టిక్ కవరులా వుంది

చివరికి
పుస్తకానికి పాఠం బోధపడింది
తన బతుకు కోసం
తోటి పుస్తకాలపైనే యుద్ధం చేయాలి
లేకుంటే...
పోగుపడిన అనంత పుస్తకాలలో
తానో నిరసన వాక్యమై నిలవాలి

మొయిద శ్రీనివాసరావు
99082 56267

ఏటి జోల



నాకు ఈడు మీద ఈడెక్కినట్టు
ఏరుకు ఏడు మీద ఏడెక్కదు
ఊరుకన్నా తొలుతది
ఊయ్యాల ఊగుతుంది
నీటి మథనంలోనే
అమృతం చిలికినట్టుంది

ఎన్ని తరాల బోయిలో
పరంపర జరిగి పోయింది
పూర్వ కన్యో అపూర్వ కన్యో
ఉదయం సూర్య కాంతిలో
రాత్రి చంద్ర కాంతిలో
తానమాడి తళుక్కుమంటుంది
ఏరు సాగి పోయే అప్సరస

ఏరు ఎంత బోధించినా
ఏటి గెచ్చలకు ఎక్కేది కాదు
ఎగిరెగిరి పడుతుండేది
ఏరు దరి మీద ఉన్న నన్ను
ఇతర పక్షులను
ఏటి గెచ్చలకు బూచిగ చూపేది
చేతుల్ని పంజాలుగా
దరిని పొదలుగా చూసేది
ఏరుకు నా తలలో సారికలు కనిపించేవి
ఒక్కొక్క సారి కొంగ
వినయంగా కనిపించినా
ఏరు నమ్మేది కాదు
ఎడ్డి గెచ్చల్ని లోనికి గుంజేది

వేటకు ముందు....
బుద్ధుడు నాతో తలపడే వాడు
మెల్లగా మెల్లగా వల కండ్ల తెగి

చిక్కం చినిగి పోయింది
బురదలో ఊత తిరగబడి
పువ్వులా విచ్చుకుంది
చందమామ ఎగిరి
నన్ను ముద్దాడింది
ఏటిలో వెన్నల జన ఇడిచింది

చమట పాణం పోసుకుంది
పాణం పోసింది
ప్రేమ సారంతో కొత్త చిగురు
ఎన దృశ్యం మారింది

ఎత్తి కడితే
ఎటు పోతున్ననో ఏమో కాని
నా ముందు సీతాకోకల గుంపు
ఎనుక చెట్లు నడుస్తున్నయి
చాపను చూస్తూ ఎదురెక్కుతున్న
నా లోకి నేను.

మునాసు వెంకట్
99481 58163


ప్రమాదంలో కొండను ఢీకొన్న అగ్నిమాపక వాహనం

ఇంద్రకీలాద్రిపై తప్పిన పెనుప్రమాదం

బ్రేక్ ఫెయిల్ కావడంతో కొండను ఢీకొన్న అగ్నిమాపక వాహనం

- ప్రమాద సమయంలో ముందు వెళ్తున్న దేవస్థానం బస్సు
- అగ్నిమాపక వాహనం డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

విజయవాడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి ఘాట్‌రోడ్డుపై త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. ఘాట్‌రోడ్డులో చెలరేగిన మంటలను నియంత్రించడానికి వచ్చిన అగ్నిమాపక వాహనానికి బ్రేకులు ఫెయిలవడంతో భక్తులతో వెళ్తున్న దేవస్థానం బస్సును ఢీ కొట్టబోయి పక్కనే ఉన్న కొండను ఢీకొంది. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఇంద్రకీలాద్రి ఘాట్‌రోడ్డు ఓం మలుపు వద్ద ఉన్న ప్రహరీని ఆనుకుని కొండ ప్రాంతంలో చెత్తాచెదారం పేరుకుపోయింది. అమావాస్య, అందులోనూ ఆదివారం కావడంతో ఓ భక్తుడు ఓం మలుపు వద్ద హారతి కర్పూరం వెలిగించి ప్రహరీపై పెట్టాడు. వెలుగుతున్న ఈ హారతి కర్పూరం గాలికి ప్రహరీ పక్కన ఉన్న చెత్తపై పడింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు, ప్రొటోకాల్ విభాగంలో ఉండే పోలీసులు ఘటనాస్థలానికి పక్కన ఉన్న డ్రమ్ముల్లోని నీటితో మంటలను అదుపు చేశారు. సమాచారం అందుకున్న గవర్నరుపేట అగ్నిమాపక స్టేషన్ సిబ్బంది వాహనంతో వచ్చి మంటలను ఆర్పేశారు. తిరిగి ఈ వాహనం కొండ దిగువకు వెళ్తుండగా, 40 మంది భక్తులతో ఉన్న దేవస్థానం బస్సు కొండ కిందకు వెళ్తోంది. ఘాట్‌రోడ్డులోని మొదటి మలుపు వద్దకు వచ్చేసరికి అగ్నిమాపక వాహనానికి బ్రేకులు ఫెయిలయ్యాయి. డ్రైవర్ సుబ్బారావు వాహనాన్ని నియంత్రించడానికి ప్రయత్నించినా ఫలించలేదు. ముందు వెళ్తున్న దేవస్థాన బస్సును రాసుకుంటూ అగ్నిమాపక వాహనం కుడివైపున ఉన్న కొండను ఢీకొట్టింది. డ్రైవర్ సుబ్బారావు సీనియర్ కావడంతో బస్సు వైపునకు వెళ్తున్న వాహనాన్ని కుడివైపునకు తిప్పడంతో పెను ప్రమాదం తప్పింది. వాహనం ముందు భాగం కొండను ఢీకొట్టి ఆగిపోయింది. అగ్నిమాపక వాహనం వేగంగా కొండను ఢీకొట్టినా, ముందు ఉన్న దేవస్థాన బస్సును బలంగా ఢీకొట్టినా ఇంద్రకీలాద్రిపై పెనుప్రమాదం జరిగేదని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ ఘటనలో బస్సులో ఉన్న భక్తులు కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని పోలీసులు ప్రైవేట్ వాహనాల్లో కొండ దిగువకు పంపించారు. బ్రేకులు విఫలమైనా చాకచక్యంగా వ్యవహరించిన అగ్నిమాపక వాహన డ్రైవర్ సుబ్బారావును పలువురు అభినందించారు.

సొంత పార్టీలోనూ సెగ



గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తీరుపై విపక్ష టీడీపీ శ్రేణులు ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నాయి. చిత్రమేమిటంటే సొంత పార్టీ వైసీపీ శ్రేణులు సైతం ఆయన తీరుపై అసహనం వ్యక్తం చేస్తుండటం గమనార్హం. టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సుడిగాలి పర్యటనలు చేస్తూ నియోజకవర్గాన్ని చుట్టుబెడుతుంటే మూడు నెలలకుపైగా వంశీ అసలు నియోజకవర్గంలో ఒక్క కార్యక్రమాన్ని కూడా నిర్వహించక పోవడం ఆ పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసహనాన్ని కలిగిస్తోంది.

వంశీ తీరుపై వైసీపీ శ్రేణుల్లో అసహనం

- నియోజకవర్గంలో తిరగడు.. కవ్వింపు చర్యలతో కాలక్షేపం
- బెదిరింపులు, దాడులతో రగిలిపోతున్న టీడీపీ శ్రేణులు
- రోజురోజుకూ వంశీపై పెరుగుతున్న వ్యతిరేకత
- టీడీపీ శ్రేణుల్లో జోష్ నింపుతున్న యార్లగడ్డ
- వంశీ అరాచకాలకు ధీటుగా సమాధానం

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : గత ఎన్నికల్లో టీడీపీ తరఫున గెలిచి వైసీపీ పంచన చేరిన వల్లభనేని వంశీకి ఈసారి టికెట్ ఇవ్వడంపై వైసీపీ అధిష్ఠానం ఇంత వరకు స్పష్టత ఇవ్వలేదు. అదే సమయంలో వంశీ ధోరణి కూడా తాను అసలు పోటీలోనే లేను అన్న రీతిలో ఉండటంతో వైసీపీ శ్రేణులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమం నిర్వహించి మూడు నెలలకుపైగా అయింది. పార్టీ వాట్సాప్ గ్రూపుల్లో మాత్రం రోజూ వలంటీర్ల డోర్ టు డోర్ కార్యక్రమం ఫలాన చోట ఉంటుంది. గ్రామ సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని క్రమంతప్పక మెసేజ్‌లు పెడుతున్నారు. అయితే ముందుండి నడిపించాల్సిన నాయకుడు రాకుండా తమను తిరగమని మెసేజ్‌లు పెడుతుండటంతో ఈ కార్యక్రమాల్లో పట్టుమని పది మంది కూడా ఉండటం లేదు. పార్టీని జనంలోకి తీసుకెళ్లాల్సిన నాయకుడు నియోజకవర్గానికి దూరంగా ఉండటం, ప్రతిపక్ష నాయకులపై దాడి చేయించేందుకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తుండటంతో నియోజకవర్గ ప్రజల్లో వంశీ పట్ల మరింత వ్యతిరేకతను తీసుకొస్తోందని వైసీపీ నాయకులే వ్యాఖ్యానిస్తున్నారు.

టీడీపీ నేతలకు వేధింపులు

టీడీపీకి చెందిన సీనియర్ నాయకులను లక్ష్యంగా చేసుకుని వంశీ బెదిరింపులు, దాడులకు దిగుతున్నారు. ఉంగుటూరుకు చెందిన ఈడ్పుగంటి కృష్ణమూర్తి వయసు సుమారు 76 ఏళ్లు. ఈయన వయసును కూడా చూడకుండా ఈయనపైనా వంశీ అనుచరులు వేధింపులకు పాల్పడటం గమనార్హం. గన్నవరానికి చెందిన ఓ ఎంపీటీసీ కూతురుకు పక్కనే ఉన్న బీసీలతో డ్రైనేజీకి సంబంధించిన సమస్య ఉంది. ఈ గొడవ పరిష్కారానికి టీడీపీకి చెందిన పాలడుగు నాని, జాస్తి ఫణిశేఖర్, చిలకపాటి సుబ్బారావు వెళ్లగా వంశీ బీసీలను రెచ్చగొట్టి సదరు ఎంపీటీసీపై కేసు పెట్టించారు. దీనిపై ఆ ఎంపీటీసీ వెళ్లి వంశీని అడుగ్గా.. నీ కూతురుతో పాలడుగు నాని తదితరులపై రేప్ కేసు పెట్టించు అప్పుడు నీపై ఉన్న కేసును ఎత్తేస్తా అని చెప్పడంతో గత్యంతరం లేని పరిస్థితిలో ఆయన అదే పని చేశారు.

- గన్నవరం మండలం దావాజీగూడెంకు చెందిన టీడీపీ నాయకుడు గొంది నరేంద్రకు బుద్ధవరంలో పొలం ఉంది. ఆ పొలంలోకి వంశీ తన అనుచరుడైన ఎస్సీ వ్యక్తిని పంపి నరేంద్రపైనే ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టించారు. ఇలాంటి నీచ రాజకీయాలతో ప్రజల్లో వంశీతోపాటు వైసీపీ ఇమేజ్ కూడా దారుణంగా దెబ్బతింటోందని వైసీపీ శ్రేణులే ఆందోళన వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

రగిలిపోతున్న టీడీపీ శ్రేణులు..

అధికారం అండతో పోలీసులను తన చెప్పుచేతుల్లో ఉంచుకుని నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలను వేధిస్తున్న వంశీ తీరుపై టీడీపీ శ్రేణులు ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నాయి. టికెట్ వస్తుందో రాదో తెలియని పరిస్థితి ఓవైపు వచ్చినా గెలుస్తామో లేదోనన్న భయం మరోవైపు వంశీని తీవ్ర అసహనానికి గుర్తు చేస్తోందని వైసీపీ శ్రేణులు చెబుతున్న మాట. రెండు రోజుల క్రితం ఎనికేపాడు వద్ద వంశీ చేస్తున్న దాడులకు నిరసనగా యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు నిరసన దీక్ష చేపట్టాయి. ఈ కార్యక్రమం జరుగుతున్న ప్రాంతానికి వచ్చిన వంశీ తన అసలు నైజాన్ని బయటపెడుతూ కవ్వింపులకు దిగారు. పట్టుమని డజను మంది కూడా లేకుండా వంశీ వచ్చి కవ్వింపులకు దిగడంతో రెచ్చిపోయిన టీడీపీ శ్రేణులు నిరసన శిబిరం నుంచి ఒక్క ఉదుటున బయటకు వచ్చి వంశీ, ఆయన అనుచరులపై దాడి చేసేందుకు సిద్ధమయ్యారు. ఇలాంటిది జరుగుతుందని ముందే ఊహించిన వంశీ తాను రావడానికి ముందే పోలీసులతో మాట్లాడుకుని శిబిరం వద్దకు పెద్ద ఎత్తున పోలీసులను రప్పించుకుని టీడీపీ శ్రేణులను నిలువరించేలా చూసుకున్నారు. ఇదంతా అక్కడ ఉన్న సీసీటీవీల్లో రికార్డవ్వడం గమనార్హం. పోలీసుల అండతో వంశీ చేస్తున్న చర్యలకు ఇకపై గట్టి ప్రతి చర్యకు దిగాలని టీడీపీ శ్రేణులు అంతర్గత చర్చల్లో వ్యాఖ్యానిస్తున్నాయి. గన్నవరానికి చెందిన టీడీపీ నాయకుడు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) మాజీ అధ్యక్షుడు కాసరనేని రంగబాబుపై ఈ ఏడాది జనవరి 21న ఎమ్మెల్యే వంశీ అనుచరులు దాడి చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడిన రంగబాబు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. ఇకపై ఇలాంటి దాడులకు గట్టిగా బదులిస్తామని టీడీపీ శ్రేణులు హెచ్చరిస్తున్నాయి.

- మిగతా 6లో

టీడీపీ సానుభూతిపరుడిపై వైసీపీ దాష్టీకం

బందరు అసెంబ్లీ నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకుల ఆగడాలకు అంతులేకుండా పోతోంది. ఎన్నికల ముందు తమకు వ్యతిరేకంగా పనిచేస్తున్న వారిని ఎంచుకుని మరీ దాడులకు తెగబడుతున్నారు. టీడీపీ సానుభూతిపరులను సైతం వదలకుండా వెంటాడుతున్నారు. ఇటువంటిదే బందరు మండలం పోతేపల్లి పంచాయతీ ఉల్లిపాలెంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పేర్ని కిట్టుకు సంబంధించిన బ్యానర్ చించాడనే కారణం చూపి టీడీపీ సానుభూతిపరుడిని కిట్టు అనుచరులు చితకబాదారు. అనంతరం బందరు తాలూకా పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు.

కిట్టుకు చెందిన బ్యానర్‌ను చించివేశాడని ఆరోపణ

- యువకుడిని చితకబాది పోలీస్‌స్టేషన్ వద్ద వదిలివేసిన వైనం
- బాధితుడిని పరామర్శించిన కొల్లు రవీంద్ర, బండి రామకృష్ణ
- నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్


తాలూకా పోలీస్‌స్టేషన్ వద్ద బాధితుడితో కలిసి పోలీసులతో మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర, బండి రామకృష్ణ

ఉల్లిపాలెంలో పేర్ని కిట్టు అనుచరుల మూకుమ్మడి దాడి

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : బందరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పేర్ని కిట్టు పుట్టినరోజును పురస్కరించుకుని పోతేపల్లి పంచాయతీ పరిధిలోని ఉల్లిపాలెంలో బందరు నియోజకవర్గం వైసీపీ సోషల్ మీడియా సభ్యుడిగా ఉన్న పత్తి పవన్, కిట్టు పేరుతో గ్రామంలో నాలుగైదుచోట్ల బ్యానర్లు కట్టాడు. ఇందులో ఒకటి చిరిగిపోయింది. గ్రామంలో కొల్లు రవీంద్రకు స్వాగతం పలుకుతూ టీడీపీ కార్యకర్తలు మరికొన్ని బ్యానర్లను కట్టారు. పేర్ని కిట్టుకు చెందిన ఒక బ్యానర్ చిరిగిపోవడంతో గ్రామానికి చెందిన ఈడే యశ్వంత్ ఈ బ్యానర్‌ను చించివేశాడనే కారణంతో శనివారం రాత్రి పొద్దుపోయాక పవన్, అతని అనుచరులు 20 మంది రెండు కార్లలో, నాలుగైదు ద్విచక్ర వాహనాల్లో ఉల్లిపాలెం గ్రామానికి శనివారం రాత్రి వచ్చారు. యశ్వంత్‌కు ఫోన్ చేసి ఆంజనేయస్వామి గుడివద్దకు వస్తే మాట్లాడే పని ఉంది రమ్మని చెప్పి ఇంటి నుంచి బయటకు రప్పించారు. అతను వచ్చీ రావడంతోనే ముకుమ్మడిగా దాడి చేశారు. అంతటితో ఆగకుండా కారులో ఎక్కించుకుని నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకువెళ్లి విచక్షణా రహితంగా కొట్టారు. బ్యానర్ చించిన కారణంపై నిన్ను పోలీస్‌స్టేషన్‌లో అప్పగిస్తామని చెప్పి చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. చిలకలపూడి పోలీసులు ఉల్లిపాలెం తమ పరిధిలోకి రాదని చెప్పి తాలూకా పోలీస్‌స్టేషన్‌కు పంపారు. వైసీపీ కార్యకర్తలు యశ్వంత్‌ను తాలూకా పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లడంతో విషయం వెలుగులోకి వచ్చింది. యశ్వంత్ ఇంటికి వచ్చిన రెండు కార్లలో ఒకటి పేర్ని కిట్టు ఉపయోగించే కారు ఉందని బాధితుడి తరుపు బంధువులు చెబుతున్నారు. యశ్వంత్ నడవలేని స్థితిలో ఉన్నాడని చెప్పారు.

పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన కొల్లు, బండి

వైసీపీ కార్యకర్తలు ఈడే యశ్వంత్‌పై దాడి చేయడమే కాకుండా తాలూకా పోలీస్‌స్టేషన్ వద్ద విడిచిపెట్టారనే సమాచారం తెలుసుకున్న బందరు నియోజకవర్గం టీడీపీ, జనసేన అభ్యర్థి కొల్లు రవీంద్ర, బండి రామకృష్ణతోపాటు రెండు పార్టీల నాయకులు హుటాహుటిన పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. గాయాలపాలైన యశ్వంత్‌ను ఎవరు, ఇక్కడ అప్పగించారంటూ పోలీసులను అడిగి తెలుసుకున్నారు. గాయాలతో నడవలేని స్థితిలో ఉన్న యశ్వంత్‌ను ఆసుపత్రికి వెంటనే ఎందుకు పంపలేదని నిలదీశారు. బాధితుడితో పోలీసులకు ఫిర్యాదు చేయించారు. అనంతరం యశ్వంత్‌ను మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు.

దాడులు చేస్తే చూస్తూ ఊరుకోం

వైసీపీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ సానుభూతిపరులపై దాడులు చేస్తే సహించేదిలేదని కొల్లు రవీంద్ర హెచ్చరించారు. యశ్వత్‌ను ఇంటి నుంచి బయటకు రప్పించి దాడి చేయడమే కాకుండా కారులో ఎక్కించుకుని తీసుకువెళ్లి మళ్లీ దాడి చేసి భయభ్రాంతులకు గురిచేయడం వెసీపీ నాయకుల అహంకారాన్ని చాటుతోందని అన్నారు. ఈ ఘటనలో 20 మందికిపైగా వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారని, నిందితులను గుర్తించి వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని అన్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి లొంగి బాధితుడికి న్యాయం చేయకుండా పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

తూర్పుగోదావరి జిల్లాలోని అన్నవరం వీరవెంకటసత్యనారాయణ స్వామివారి దేవస్థానం, ద్వారకా తిరుమల (చిన్న తిరుపతి)లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సరుకుల టెండర్‌లో పాల్గొన్న కాంట్రాక్టర్ ఆ రెండు ఆలయాల్లో ఒకే ధరకు సరుకులు సరఫరా చేసేందుకు ముందుకు వచ్చారు. అదే కాంట్రాక్టర్ విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానానికి వచ్చే సరికి అధిక ధరను పేర్కొంటూ టెండరు దాఖలు చేయడం గమనార్హం. పేరుకే టెండరు ప్రక్రియ. చివరికి కాంట్రాక్టు ఖరారయ్యేది మాత్రం ఎంత ధరకు కోట్ చేసినా సదరు కాంట్రాక్టర్‌కే. ఈ మొత్తం ప్రక్రియలో మతలబు ఏమిటంటారా? దుర్గగుడిలో అధికారులకు మొదలు పాలకమండలిలో కీలక వ్యక్తి వరకు ఎవరికి దక్కాల్సిన కమీషన్లు వారికి దక్కడమే ఈ మొత్తం ప్రక్రియలో అసలు మతలబు..!



అమ్మ సొమ్మంటే అలుసా..?

సరుకుల టెండర్లలో కిరికిరి

- ద్వారకా తిరుమల, అన్నవరంలో ఒకే ధర
- దుర్గగుడిలో మాత్రం అధికం
- రెండుచోట్లా కాంట్రాక్టర్ ఒక్కరే
- అధికారులకు 5 శాతం, బోర్డులో కీలక వ్యక్తికి ప్రతినెలా బిల్లులో 3 శాతం కమీషన్

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానానికి ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 31 వరకు (ఆరునెలల కాలం) సరుకులు సరఫరా చేసేందుకు ఇటీవల టెండర్లు పిలిచారు. 12వ తేదీన ఈ టెండర్లను ఫైనల్ చేయనున్నారు. టెండర్‌లో పాల్గొనే కాంట్రాక్టర్‌కు సంవత్సరానికి రూ.10 కోట్లు టర్నోవర్ నిర్ణయించే విధంగా ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టర్ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి విజయం సాధించారు. గతంలో దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ టెండర్లపై మాట్లాడుతూ టెండర్ ఫారాలు దాఖలు చేసేవారిని మూడు విభాగాలుగా చేసి రూ.కోటి, రూ.2 కోట్లు, రూ.3కోట్లు టర్నోవర్ సామర్థ్యంతో ఉండేలా చూస్తామని తెలిపారు. కానీ దుర్గగుడి అధికారులు మంత్రి చెప్పిన దానికి భిన్నంగా స్పందిస్తున్నారు. టెండర్ నిబంధనలపై కూడా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అటు ద్వారకా తిరుమలలో కానీ, ఇటు అన్నవరంలో కానీ లేని నిబంధనలు దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలోనే పెడుతుండటం గమనార్హం.

ఈఎండీ నిర్ణయంలో అనుమానాలు

ద్వారకా తిరుమల, అన్నవరం దేవస్థానాల్లో ప్రతి ఆరు నెలలకు బిల్లుపై 2.5 శాతం ఈఎండీ (ఎర్నెస్ట్ మనీ డిపాజిట్)గా సదరు కాంట్రాక్టర్‌లు చెల్లించి టెండర్‌లలో పాల్గొనాల్సి ఉంటుంది. దుర్గగుడిలో మాత్రం అధికారులు అందుకు విరుద్ధంగా ఏడాది బిల్లుపై 2.5 శాతం ఈఎండీ నిర్ణయించడం అనుమానాలకు తావిస్తోంది. అన్నవరం, ద్వారకాతిరుమలలో అన్నదాన విభాగంలో సరుకులు సరఫరా చేసేందుకు ఈఎండీ రూ.5 లక్షలు, నివేదన శాలలో సరకులు సరఫరా చేసినందుకు రూ.5 లక్షలు, మెయిన్ స్టోర్స్ (ప్రసాదాల తయారీకి) సరుకులు సరఫరా చేసినందుకు రూ.5 లక్షలు నిర్ణయించారు. దుర్గగుడిలో మాత్రం అన్నదాన విభాగానికి రూ.10 లక్షల ఈఎండీ, ప్రసాదాల తయారీ సరుకులకు రూ.37.50 లక్షలు, నివేదనశాల సరుకుల సరఫరాకు రూ.5 లక్షలు ఈఎండీగా నిర్ణయించారు. ఈ నిర్ణయాల వెనుక అధికారులు ఒక కాంట్రాక్టర్‌కు కొమ్ముకాయడమే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ఇదే కాంట్రాక్టర్ పైమూడు దేవస్థానాలకు సరుకులు సరఫరా చేస్తున్నారు.

ఒక్కో దేవస్థానానికి ఒక్కో ధర

దుర్గగుడిలో కేజీ బియ్యం (లలితా ఆరెంజ్ బ్రాండ్) రూ.56, కందిపప్పు కిలో రూ.148, చింతపండు కిలోరూ.88, జీడిపప్పు కిలో రూ.630, కిస్‌మిస్ కేజీ రూ.260, నూనె (ఫ్రీడమ్) రూ.125, శనగపప్పు కేజీ రూ.74కు ప్రస్తుత కాంట్రాక్టర్ సరుకులు సరఫరా చేస్తున్నారు. ఇదే కాంట్రాక్టర్ అన్నవరం, ద్వారకా తిరుమల దేవస్థానాలకు కేజీ బియ్యం (లలితా ఆరెంజ్ బ్రాండ్) రూ.41, కందిపప్పు కిలో రూ.125, చింతపండు కిలో రూ.65, జీడిపప్పు కిలో రూ.525, కిస్‌మిస్ కేజీ రూ.142, నూనె (ఫ్రీడమ్) రూ.110, శనగపప్పు కేజీ రూ.54లకు సరఫరా చేస్తుండటం గమనార్హం. దుర్గగుడిలో ఈఎండీ ఎక్కువగా నిర్ణయించడం వల్ల టెండర్లలో మిగిలిన కాంట్రాక్టర్లు పాల్గొనలేకపోతున్నారు. కేవలం ప్రస్తుత కాంట్రాక్టర్ మరో బినామీ పేరుతో టెండర్‌లో పాల్గొని టెండర్ దక్కించుకుంటున్నాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నాసిరకం సరుకుల సరఫరా

ప్రస్తుతం దుర్గగుడిలో సరుకుల ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ నాసిరకం సరుకులు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందించే పచ్చిశెనగపప్పు కేజీ ప్యాకెట్ మార్కెట్‌లో రూ.60కు లభిస్తుంది. అయితే కాంట్రాక్టర్ ఆ ప్యాకెట్‌ను కొనుగోలు చేసి లూజుగా రూ.50 కేజీల బ్యాగ్ తయారు చేసి ఎక్కువ ధరకు దుర్గగుడికి సరఫరా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్టర్ దుర్గగుడికి ప్రతినెలా సరుకుల సరఫరా చేయకుండా నెలలో నాలుగైదు సార్లు సరఫరా చేయడంపై కూడా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దుర్గగుడికి సరుకులు సరఫరా చేసే సమయంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్, సివిల్ సప్లయ్ అధికారులు తప్పనిసరిగా తనిఖీలు చేసి సరుకులను ల్యాబ్‌లో పరీక్ష చేయించవలసి ఉంటుంది. అయితే ఈ నిబంధనలు పాటించకుండా సదరు కాంట్రాక్టర్ ఆడిందే ఆట పాడిందే పాటగా దుర్గగుడికి సరుకులు సరఫరా చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల ప్రతినెలా దుర్గగుడికి రూ.50 లక్షల మేరకు నష్టం కలుగుతుండటంతోపాటు భక్తులకు నాసిరకం అన్నప్రసాదాలు అందుతున్నాయి.

కమీషన్లకు కక్కుర్తిపడి..

దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం ట్రస్ట్‌బోర్డులోని కీలక వ్యక్తికి ఈ కాంట్రాక్టర్ ప్రతినెలా బిల్లులో మూడు శాతం కమిషన్‌గా ఇచ్చుకుంటున్నారని సమాచారం. అధికారులకు ఐదు శాతం చొప్పున ఇస్తుండటంతో వారు కూడా ఈ కాంట్రాక్టర్‌ను వదులుకునేందుకు సుముఖంగా లేరన్న ప్రచారం జరుగుతోంది.



దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శివరాత్రి మహోత్సవాల ముగింపు

- మహాపూర్ణాహుతి నిర్వహించిన వైదిక కమిటీ
- కృష్ణానదిలో ఉత్సవమూర్తులకు అవభృదోత్సవం

- 6లో..



రాష్ట్ర ప్రయోజనాల కోసమే..

- బీజేపీతో పొత్తుపై నేతల స్పష్టీకరణ
- జగన్‌రెడ్డి విపత్తు నుంచి రాష్ట్రాన్ని కాపాడుకునేందుకే: నెట్టెం

- 6లో..



పూర్ణాహుతి కార్యక్రమంలో ఈవో, తదితరులు

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శివరాత్రి మహోత్సవాల ముగింపు

- మహాపూర్ణాహుతి నిర్వహించిన వైదిక కమిటీ
- కృష్ణానదిలో ఉత్సవమూర్తులకు అవభృదోత్సవం

వన్‌టౌన్, మార్చి 10 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శివరాత్రి మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వైదిక కమిటీ సభ్యులు, పండితులు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించి శాంతి మంత్రాన్ని పఠించి స్వస్తి చెప్పారు. కార్యక్రమంలో ఈవో కేఎస్ రామారావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, స్థానాచార్యుడు విష్ణుభట్ల శివప్రసాద శర్మ, ముఖ్య అర్చకులు పాల్గొన్నారు. అనంతరం ధ్వజారోహణ, వసంతోత్సవం, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవమూర్తులను పల్లకిపై ఊరేగింపుగా తీసుకువెళ్లి పవిత్ర కృష్ణానదీ తీరాన అవభృదోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పుష్పయాగోత్సవాన్ని నిర్వహించారు. ఆదివారం ఆలయంలో సూర్యోపాసన, అరుణపారాయణ కార్యక్రమాలను నిర్వహించారు.

శ్రీకాళహస్తీశ్వరుడికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీకాళహస్తి జ్ఞాన ప్రసూన శ్రీకాళహస్తీశ్వరులకు మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం దుర్గగుడి తరఫున ఈవో రామరావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రాంబాబు తదితర బృందం పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈవో డి.వెంకటేశ్వర్లు, చైర్మన్ అంజూరి శ్రీనివాసులు ఆలయ మర్యాదలతో పట్టు వస్త్రాలను స్వీకరించారు.



దుర్గాపార్వతీ సమేత నాగేశ్వరస్వామి రథోత్సవంలో భక్తజనం

కన్నుల పండువగా దుర్గాపార్వతీ నాగేశ్వరుని రథోత్సవం

కృత్తివెన్ను, మార్చి 10 : దుర్గాపార్వతీ సమేత నాగేశ్వరస్వామి రథోత్సవం కనుల పండుగగా జరిగింది. కృత్తివెన్నులోని స్వయంభు దుర్గాపార్వతీ సమేత నాగేశ్వరస్వామి శివరాత్రి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. శనివారం రాత్రి కొలనులో స్వామివారు ప్రత్యేక హంసవాహనంపై తెప్పోత్సవంలో జలవిహారం చేసారు. ఉత్సవాల ఆఖరి రోజు స్వామివారిని దర్శించుకొనేందుకు వేల సంఖ్యలో భక్తులు బారులు తీరారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ స్వామివారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. దుర్గాపార్వతీ సమేత నాగేశ్వరస్వామి రథోత్సవం కనుల పండుగగా జరిగింది. విశేష భక్తజనుల హర హర నామస్మరణతో రథం ముందుకు సాగింది. ఆలయ చైర్మన్ పట్టపు నాగేశ్వరరావు, ఇవో శింగనపల్లి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో రథోత్సవంలో ఎస్సై కె.నాగరాజు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

అన్నిరకాల వైద్య సేవలు ప్రజలకు అందాలి

- ప్రజారోగ్య వేదిక రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

గవర్నర్‌పేట, మార్చి 10 : మనిషి జీవనశైలి, వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా అనేక వ్యాధులు విస్తరిస్తున్నాయని, వైద్యం ఎంతో మెరుగవుతున్నా ఆధునిక వైద్యం పేదవాడికి అందే పరిస్థితి లేదని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ మాజీ కార్యదర్శి డాక్టర్ పీవీ రమేష్ అన్నారు. ఆదివారం ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డులోని ఎంబీవీకెలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో వక్తలు అన్ని రకాల మెరుగైన వైద్యసేవలను ప్రజలందరికీ ప్రభుత్వం ఉచితంగా అందించాలని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడే ప్రభుత్వం ఆరోగ్య హక్కు చట్టం తీసుకురావాలని, ఈ చట్టాన్ని అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫేస్టోలో చేర్చాలని సమావేశం తీర్మానించింది. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ, విపరీతంగా పెరిగిపోతున్న వైద్యం, మందుల ఖర్చులు భరించలేక పేదలు మరింత పేదలుగా మారుతున్నారని, వీరిని ఉచితంగా పూర్తి వైద్యం అందించగలిగినప్పుడే భరోసాతో జీవించగలరన్నారు. అందుకోసం అన్ని రాష్ట్రాలు ఆరోగ్య హక్కు చట్టాన్ని తీసుకురావాలని కోరారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బాధ్యులు డాక్టర్ రాంప్రసాద్ మాట్లాడుతూ, ప్రజలందరికీ వైద్యం అందించేలా యూనివర్సల్ హెల్త్ కేర్ పద్ధతిని ఏర్పాటు చేయాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేశామన్నారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంవీ రమణయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు, నగర కార్యదర్శి విజయప్రకాశ్, వివిధ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.



జిల్లా నూతన కార్యవర్గం

చేనేత పరిరక్షణ బాధ్యత అందరిదీ

- భండారు ఆనందప్రసాద్

పెడన రూరల్, మార్చి 10 : చేనేత కళను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు భండారు ఆనందప్రసాద్ అన్నారు. పెడన విఘ్నేశ్వరా ప్రార్థనామందిరంలో జిల్లాస్థాయి సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు ఇనమాల శివరాం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆనందప్రసాద్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా చేనేత జీవనాధారంగా ఉన్న 18 కులాలను ఏకతాటిపైకితెచ్చి అన్ని రంగాల్లో ముందుండేలా చేపట్టాల్సిన అంశాలను వివరించారు. శివరాం మాట్లాడుతూ, ప్రభుత్వాలు చేనేత వర్గాలను విభజిస్తూ పరిశ్రమను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. చేనేత వర్గాల వారికి రాజకీయంగా పాధాన్యత ఇవ్వాలని ఆ దిశగా ఫెడరేషన్ చర్యలు చేపడుతుందన్నారు. మంగళగిరి, వెంకటగిరి, మదనపల్లి, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ధర్మవరం, పుటపర్తి, పెనుగొండ, ఎమ్మిగనూరు, రాజమండ్రి రూరల్, గాజువాక, విశాఖపట్నం(సౌత్) ఎచ్చెర్ల వంటి శాసనసభ నియోజకవర్గాలలో కనీసం ఆరుచోట్ల, హిందూపురం, రాజమండ్రి, కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాలలో రెండు సీట్లు కేటాయించే విధంగా అన్ని రాజకీయ పార్టీలపై ఒత్తిడి తేవాలన్నారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. పిచ్చుక ఫణికుమార్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. సమావేశంలో నేత కార్మికులు పాల్గొన్నారు.

గోల్డ్ అప్రయిజర్ల సమస్యలపై ఐక్య పోరాటాలు

భవానీపురం, మార్చి 10 : బ్యాంకుల్లో పనిచేసే గోల్డ్ అప్రయిజర్ల సమస్యలపై బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్‌తో కలిసి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని అప్రయిజర్ల రాష్ట్ర అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మొగల్రాజపురం సిద్ధార్థ ఆడిటోరియంలో ఆదివారం గోల్డ్ అప్రయిజర్ల ద్వితీయ మహాసభగా జరిగింది. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారంపై పోరాటాలు చేయాలని, పనిఒత్తిడి తగ్గించాలని, ఉద్యోగ భద్రత కోసం ఐక్యంగా ఉద్యమించాలని తీర్మానించారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసమే..

- బీజేపీతో పొత్తుపై నేతల స్పష్టీకరణ
- జగన్‌రెడ్డి విపత్తు నుంచి రాష్ట్రాన్ని కాపాడుకునేందుకే : నెట్టెం



జయహో బీసీ సభలో నేతల సంఘీభావం

జగ్గయ్యపేట, మార్చి 10 : నాడు బీజేపీతో విభేదించినా, నేడు పొత్తుకు స్వాగతించినా రాష్ట్ర ప్రయోజనాల కోసమేనని, జగన్ అనే మహమ్మారి, విపత్తు నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవటం కోసం చంద్రబాబు, పవన్‌లు ఆలోచించి తీసుకున్న నిర్ణయమని మాజీ మంత్రి, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం అన్నారు. జగ్గయ్యపేటలో ఆదివారం జరిగిన బీసీల పిలుపు-తాతయ్య గెలుపు, జయహో బీసీ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని బీజేపీతో పొత్తు విషయమై మాట్లాడారు. నాడు రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీకి చట్టబద్ధత కల్పించాలనే విషయంలో బీజేపీతో విబేధించి పోరాటం చేయాల్సి వచ్చిందని.. నేడు జగనాసురుడి బారినుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకు, ఆరాచక, విధ్వంస పాలన నుంచి విముక్తి కల్పించేందుకు చంద్రబాబు, పవన్‌లు ఎంతో ఆలోచించి బీజేపీతో పొత్తుకు పెట్టుకున్నట్టు చెప్పారు. ఎన్నికల్లో విజయం తథ్యమని, జూన్‌లో చంద్రబాబు సీఎం కాగానే వంద రోజుల్లోనే భవిష్యత్‌గ్యారంటీతో పాటు ఇచ్చిన అన్ని హామీలకు కార్యాచరణ ఇస్తారని చెప్పారు. రాష్ట్ర ప్రజలు పొత్తును స్వాగతిస్తారని, పార్టీల శ్రేణులు సమన్వయంతో పనిచేద్దామని చెప్పారు. జాతీయ తెలుగుదేశం కోశాధికారి, నియోజకవర్గ జనసేన, బీజేపీ, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ, నియోజకవర్గంలో బీసీలకు నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

కేంద్ర నిధులతో అభివృద్ధి : కొనకళ్ల



మచిలీపట్నం టౌన్ : రాష్ట్ర ప్రయోజనాల కోసమే బీజేపీతో టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకుందని మాజీ ఎంపీ, కృష్ణాజిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొత్తు వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని, రాష్ట్ర అభివృద్ధి కోసమే అని, మూడు పార్టీల కలయికతో వైసీపీలో ప్రకంపనలు మొదలయ్యాయన్నారు. సజ్జల, విజయసాయిరెడ్డి, అంబటి రాంబాబు, కొడాలి నాని, పేర్ని నాని, మంత్రి రోజా లాంటివారు సంధి ప్రేలాపనలు పేలుతున్నారన్నారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో నెట్టబడిన రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే కేంద్రంలో నరేంద్ర మోదీ సహాయ సహకారాలు అవసరమన్నారు. జగన్‌రెడ్డి కేసుల భయంతో రాష్ట్రానికి రావాల్సిన హక్కులు సాధించలేక పోయారన్నారు. బీజేపీ నేతలను ఎదుర్కొనే దమ్ము జగన్ రెడ్డికి లేదన్నారు. ఐదేళ్లలో విభజన హామీలు, రాష్ట్రానికి నిధుల గురించి ఏనాడూ మాట్లాడలేదన్నారు. ఓటు ఆయుధంతో వచ్చే ఎన్నికల్లో వైసీపీని తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో కొనకళ్లబుల్లయ్య, మోటమర్రి బాబా ప్రసాద్, పీవీ ఫణికుమార్, యార్లగడ్డ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు విజయవాడ డివిజన్ పరిధిలో పలు ప్రాజెక్టులు ప్రారంభం

- వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ వెల్లడి



రైల్వే స్టేషన్, మార్చి 10 : విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో పలు ప్రాజెక్టులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈనెల 12న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారని డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్ తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తణుకు, భీమవోలు, ఏలూరుల్లో మూడు అప్ గ్రేడెడ్ గూడ్సు షెడ్లను, 67 ఓఎస్‌ఓపీ స్టాళ్లు, గూడూరు-బిట్రగుంట, బిట్రగుంట-కరవది-చీరాల మూడో లైన్లను, విజయవాడ బైపాస్‌లైన్‌ను ప్రధాని జాతికి అంకితం చేయనున్నారని తెలిపారు. ఈ మొత్తం ప్రాజెక్ట్ వ్యయం రూ.3,246 కోట్లుగా పేర్కొన్నారు. వీటితో పాటు సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య రెండో వందేభారత్ రైలును ప్రారంభించనున్నట్టు తెలిపారు. విశాఖపట్నం-విజయవాడ-సికింద్రబాద్ మధ్య ప్రయాణికులకు ఈ రైలు ఉపయుక్తంగా ఉందన్నారు. విజయవాడ రైల్వే డివిజన్‌కు 15 గూడ్స్ షెడ్ల అప్‌గ్రేడేషన్ కోసం రూ. 150 కోట్లు కేటాయించిందన్నారు. తాడేపల్లి గూడెం, బయ్యారం, భిక్కవోలు, ద్వారపూడి, పడుగుపాడు, సామర్లకోట, కృష్ణాకెనాల్, ఏలూరు, గుడివాడ, తెనాలి, నిడదవోలు, పాలకొల్లు, ఆకివీడు, తణుకులలో గూడ్స్ షెడ్లు ఉన్నాయని తెలిపారు. అదనపు డీఆర్ఎం ఎం.శ్రీకాంత్ సీనియర్ డివిజనల్ కమర్షియల్‌మేనేజర్ వావిలపల్లి రాంబాబు, పీఆర్ఓ నుస్రత్ ఎం మండ్రుప్కర్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

టిడ్కో రుణాలు మాఫీ చేయిస్తా

- గతంలో తొలగించిన వారికీ న్యాయం చేస్తా
- ప్రజావేదికలో ప్రత్యేక కౌంటర్ : వెనిగండ్ల

గుడివాడ, మార్చి 10 : తాము అధికారంలోకి రాగానే టిడ్కో గృహాల లబ్ధిదారుల పేరున వైసీపీ ప్రభుత్వం అక్రమంగా చేసిన రుణాలను మాఫీ చేయిస్తానని నియోజకవర్గ ఇన్‌చార్జ్, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రాము హామీ ఇచ్చారు. ఆదివారం మల్లాయిపాలెంలోని టిడ్కో గృహసముదాయాలను మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, తదితరులతో కలిసి పర్యటించారు. తొలుత ఏలూరురోడ్డులోని ప్రజావేదిక నుంచి టిడ్కో గృహాల వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం టిడ్కో ఇళ్ల వద్ద అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థను వారు పరిశీలించారు. నేతలకు లబ్ధిదారులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ఎవరి ఫోటోలు లేకుండా పది ట్యాంకర్లను ఏర్పాటు చేసి తాగు నీటిని అందిస్తానని వెనిగండ్ల వారికి హామీ ఇచ్చారు. ప్రజావేదిక వద్ద టిడ్కో లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. చంద్రబాబు ముందు చూపుతో టిడ్కో కాలనీని కట్టిస్తే అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మురికవాడగా మార్చిందని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లో పూర్తిగా మౌలిక సదుపాయాలు కల్పించి కాలనీని అభివృద్ధి చేస్తానని హామీ యిచ్చారు. అవసరమైతే మరిన్ని బ్లాకులను నిర్మాణానికి కృషి చేస్తానని హామీ యిచ్చారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, జగన్‌రెడ్డి అసమర్థ పాలన టిడ్కో కాలనీని చూస్తే అర్థమవుతుందన్నారు. మెరక పేరుతో రూ.25కోట్లు ప్రజాధనాన్ని దోచేసారని ఆరోపించారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ, ఉమ్మడి ప్రభుత్వంలో కాలనీకి అన్ని వసతులను కల్పిస్తామన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు ది గుడివాడ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ పిన్నమనేని బాబ్జీ దింట్యాల రాంబాబు, వాసే మురళీ, జనసేన జిల్లా నాయకులు పాలంకి సారధి, టిడ్కో లబ్ధిదారులు పాల్గొన్నారు.



టిడ్కో ఇళ్ల పరిశీలనలో వెనిగండ్ల, రావి పార్టీ శ్రేణులు

ఇంటింటికీ తాగునీరు..

అధికారంలోకి రాగానే..

- 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ'లో కొల్లు రవీంద్ర, రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, మార్చి 10 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రాగానే జిల్లాలోని వివిధ గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు చేస్తామని మాజీ మంత్రి, మచిలీపట్నం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం రవీంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మాజీ ఎంపీ, కృష్ణాజిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ తదితరులు మండలంలోని మేకావారితోట, గోపువానిపాలెం, నవీన్‌మిట్టల్ కాలనీ, శ్రీనివాసనగర్ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. 'బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ, ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రతిపక్ష నేతలపై కక్షసాధింపు చర్యలతోనే కాలంగడిపారన్నారు. ఎన్నికల్లో ఓటు ఆయుధంతో జగన్, వైసీపీ పాలకులకు బుద్ధి చెప్పాలన్నారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ, గ్రామాల్లో సామాన్య, మధ్యతరగతి ప్రజలు నిత్యావసర వస్తువులు, విద్యుత్ చార్జీల పెంపుతో దిక్కుతోచని స్థితిలో పడ్డారన్నారు. కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, తలారి సోమశేఖర్, వాలిశెట్టి తిరుమలరావు, కుంచే నాని, మోటమర్రి బాబా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పవన్ వెంటే నడుస్తాం

- ఐక్యవేదిక సమావేశంలో కాపు నేతలు



గుడివాడలో సమావేశమైన కాపు నేతలు

గుడివాడ, మార్చి 10 : రాజ్యాధికారమే లక్ష్యంగా ఈ ఎన్నికల్లో పవన్ వెంట ఐక్యంగా నడుస్తామని నియోజకవర్గ కాపు నాయకులు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో వైసీపీయేతర కాపు నేతలు జనసేన నాయకుడు కందుల రవి ఆధ్వర్యంలో సందు పవన్ అధ్యక్షతన ఐక్యవేదిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేత కంచనపల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, కాపులు ఐక్యంగా ఉండాలన్నారు. సీనియర్ నాయకుడు బండారు నోబుల్‌నాయుడు మాట్లాడుతూ, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను కొడాలి నాని విమర్శిస్తుంటే ఒక్కరైనా ఖండించలేకపోతున్నారని, భేషజాలు వదిలి కాపులంతా ఏకతాటిపైకి రావాలన్నారు. ముద్రగడ పద్మనాభం నీచ రాజకీయాలకు తెరతీశారని విమర్శించారు. రంగాను ఎవరూ మరువలేరని, అధికార పార్టీ ప్రలోభాలకు కాపులు బలి కావద్దని హితవు పలికారు. జనసేన నాయకులు పాలంకి సారిధిబాబు మాట్లాడుతూ, వల్లభనేని బాలశౌరిని గెలిపించుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జనసేన జిల్లా కార్యదర్శి పేర్ని జగన్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే నాని కపట ప్రేమను నమ్మవద్దని హితవు పలికారు. కందుల రవికుమార్ మాట్లాడుతూ, ప్రజారాజ్యం సమయంలో కూడా కాపులు ఐక్యతను నిర్వీర్యం చేసి కొంతమంది రాజకీయ నాయకులు లబ్ది పొందారని, నేడు పవన్‌ను కుల నాయకునిగా చూపి ఇతర కులాలవారిని జనసేనకు దూరం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. పవన్‌కు అండగా నిలబడాలని కోరారు. టీడీపీ నేత పంద్రాజు సాంబశివరావు మాట్లాడుతూ, ఎమ్మెల్యే నాని గత నాలుగున్నరళ్లలో రంగా విగ్రహానికి దండ వేయడానికి రాలేదని, గతంలో రంగా విగ్రహాన్ని పెట్టుకుని నామినేషన్ వేయడానికి వెళ్ళిన నాని నేడు రంగాను దూరంపెట్టారని, ఇది కాపులు గ్రహించాలని సూచించారు. బీజేపీ పట్టణాధ్యక్షులు ఎర్రపోతు అర్జున్ మాట్లాడుతూ, కాపులు బలంగా ఉంటే సహించలేని కొందరు నాయకులు కాపులకు కాపులనే శత్రువులుగా చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. మామిడికోళ్ల సర్పంచ్ తోట రాధిక, వెణుతురుమిల్లి సర్పంచ్ కొప్పినేని శేషవేణి, నాయకులు పంజా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రేణుల్లో స్థైర్యాన్ని నింపుతూ..

(5వ పేజీ తరువాయి)

గన్నవరం నియోజకవర్గం టీడీపీకి కంచుకోట. ఆ కారణంగానే వంశీ వైసీపీలోకి వెళ్లినా.. చాలాకాలం నియోజకవర్గ టీడీపీ బాధ్యతలు చూసే నాయకుడు లేకున్నా పార్టీ బలంగా నిలబడింది. అయితే వంశీ బెదిరింపులకు, దాడులకు భయపడి టీడీపీ శ్రేణులు నియోజకవర్గంలో కార్యక్రమాలు చేసే పరిస్థితి లేకుండా పోయింది. టీడీపీ శ్రేణుల్లో భయాన్ని కలిగించేందుకు గన్నవరం టీడీపీ కార్యాలయంపైనా, టీడీపీ శ్రేణులపైనా 2023 ఫిబ్రవరిలో వంశీ అనుచరులు దాడికి పాల్పడ్డారు. ఈ పరిణామాలన్నీ టీడీపీ శ్రేణుల్లో మరింత ఆగ్రహావేశాలను రగిల్చాయి. 2023లో యార్లగడ్డ వెంకట్రావు టీడీపీ నియోజకవర్గ బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి పార్టీ శ్రేణుల్లో స్థైర్యాన్ని నింపుతూ వారికి అండగా నిలుస్తూ పార్టీ శ్రేణుల్లో జోష్ పెంచారు. నియోజకవర్గ టీడీపీ శ్రేణులను ఏకతాటికిపైకి తీసుకొచ్చి కార్యక్రమాలు చేయడంతో, వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల కూడా పెరిగాయి. వెంకట్రావు ఓవైపు టీడీపీ శ్రేణుల మనసు చూరగొనడంతోపాటు పార్టీ అధినేత చంద్రబాబు వద్ద తన పనితీరుతో మంచి స్థానమే సాధించారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ యార్లగడ్డ వెంకట్రావు ఇప్పటి వరకు మూడు సార్లు యాగాలు నిర్వహించారు. గత ఏడాది నవంబరు 11, 12, 13న తొలిసారి యాగం నిర్వహించారు. ఆ తర్వాత ఈ ఏడాది జనవరి 7, 8, 9న రెండోసారి, ఫిబ్రవరి 26, 27, 28న మూడోసారి యాగం నిర్వహించారు. ఓవైపు నియోజకవర్గంలో అధికారపక్షంతో పోరాడుతూనే మరోవైపు పార్టీ, అధినేత శ్రేయస్సు కోరుతూ యార్లగడ్డ నిర్వహిస్తున్న కార్యక్రమాలు పార్టీ అధినేత చంద్రబాబును ఆకట్టుకుంటున్నాయి.



జనవరిలో యాగం నిర్వహిస్తున్న యార్లగడ్డ (ఫైల్)

అనర్హులకు ఇళ్ల పట్టాలు!

- పెదకొమెర లే అవుట్‌లో 17మందిని గుర్తించిన రెవెన్యూ అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అనర్హులకు ఇళ్ల పట్టాలు ఇవ్వటం గంపలగూడెం మండలంలో ప్రకంపనలు సృష్టిస్తోంది.. పెదకొమెర గ్రామంలోని సబ్‌స్టేషన్ లే అవుట్‌లో 60మంది లబ్ధిదారుల్లో 17 మంది అనర్హులున్నట్టు రెవెన్యూ అధికారులు పేర్కొనటం సంచలనం సృష్టిస్తోంది. గత ఏడాది ఇదే లే అవుట్‌లోని ప్లాట్లకు స్థానిక ఎమ్మెల్యే అనుచరుడు నకిలీ పొసెషన్ పట్టాలను సృష్టించిన సంగతి తెలిసిందే. పూర్వ తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి పొసెషన్ పట్టాలను రూపొందించిన విషయాన్ని అధికార పార్టీ నాయకులే వెలుగులోకి తెచ్చారు. దీనిపై స్పందనలో పలుమార్లు ఫిర్యాదులు చేశారు. అధికార పార్టీ నేతల అక్రమాలపై సీఎంవో కార్యాలయాలనికి సైతం ఫిర్యాదులు వెళ్లాయి. అదే లే అవుట్‌లో తాజాగా రెవెన్యూ అధికారులు 17 మందిని అనర్హులుగా గుర్తించడంతో అక్రమాలు వెలుగు చూశాయి. రెవెన్యూ అధికారులు గుర్తించిన వారిలో సాగనబోయిన అపర్ణ, సాలి మంగమ్మ, కోట విజయకుమారి, మోదుగు విజయలక్ష్మి, మోదుగు సుధారాణి, సరస్వతి, మోదుగు సుజాత, ఇడుపులపాటి నాగరాణి, షేక్ గౌసియా పేర్లు ఉన్నాయి. అనర్హులు ఇంకా ఎక్కువ మంది ఉన్నారని విచారించి చర్యలు చేపట్టాలని స్థానిక అధికార పార్టీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు పాక్షికంగా విచారణ నిర్వహించి కేవలం 15 మంది పేర్లనే ప్రకటించారని ఆరోపిస్తున్నారు. అనర్హులుగా గుర్తించిన వారి పేర్లను తొలగించవద్దని అధికార పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. దీంతో వారికి రిజిస్ట్రేషన్లు చేసేయమని తహసీల్దార్ కార్యాలయాల నుంచి మౌఖిక ఆదేశాలు రావడంతో రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయని తెలుస్తోంది. ఇదిలా ఉంటే గతంలో దొంగ సర్టిఫికెట్లకు సంబంధించి ఆంధ్రజ్యోతిలో వచ్చిన వరుస కథనాల నేపథ్యంలో, అక్రమార్కులు ఫోర్జరీ పట్టాలను వెనక్కు తీసుకుని డబ్బులను తిరిగి ఇచ్చేయగా.. ఫోర్జరీ ఘనులపై చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్ ఆదేశించినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు లేకపోవడం గమనార్హం

రెగ్యులర్ చేయాలని జూనియర్ లెక్చరర్ల విజ్ఞప్తి

ధర్నాచౌక్, మార్చి 10 : జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న తమను రెగ్యులర్ చేసేలా ఉత్తర్వులివ్వాలని కాంట్రాక్టు లెక్చరర్లు సీఎం జగన్‌కు విజ్ఞప్తి చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. కాంట్రాక్టు లెక్చరర్ల నాయకుడు మాణిక్యం శేషగిరి మాట్లాడుతూ, ఇప్పటికే వైద్య, ఆరోగ్య ట్రైబల్ వెల్ఫేర్ శాఖలో రెగ్యులర్ ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందన్నారు. కానీ, జూనియర్ కళాశాలల్లో ఏ ఒక్కరినీ రెగ్యులర్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓవైపు ఇంటర్ పరీక్షలు, మరోవైపు ఎన్నికల కోడ్ ఒత్తిడితో సతమతమవుతున్నామన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమను రెగ్యులర్ చేసేందుకు ఉత్తర్వులు ఇవ్వాలన్నారు.



మట్టితో దామెర్ల బొమ్మను చేస్తున్న సంతోష్‌కుమార్

చిత్రకారులకు స్ఫూర్తి దామెర్ల రామారావు

- కళాకారులను సత్కరించిన కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టార్ సూర్యచంద్రరావు

మచిలీపట్నం టౌన్, మార్చి 10 : తెలుగువారు గర్వంగా చెప్పుకోదగిన ప్రముఖ చిత్రకారుడు దామెర్ల రామారావు పలువురికి స్ఫూర్తిదాయకమని కృష్ణావిశ్వవిద్యాలయం రెక్టార్ డి.సూర్యచంద్రరావు అన్నారు. ఆదివారం మచిలీపట్నం ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో స్టార్ స్కూల్‌లో ప్రముఖ చిత్రకారులు మట్టి, రంగులతో అపూర్వమైన చిత్రాలు రూపొందించారు. ఈ సందర్భంగా అకాడమీ అధ్యక్షుడు లలితా మోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టి.మృత్యుంజయరావు, పరుచూరి బాబు, శ్రీరామ్, అంబటిపూడి సుబ్రహ్మణ్యంలు ప్రసంగించారు. ప్రముఖ చిత్రకారులు, ప్రతిభను కనబరుస్తున్న మహిళలను ఘనంగా అవార్డులు ఇచ్చి సత్కరించారు. మట్టితో దామెర్ల రామారావు బొమ్మను తయారు చేసిన పి.సంతోష్‌కుమార్, రంగులు అద్దుతూ ప్రకృతి చిత్రాలు గీసిన అనంతకుమార్, ప్రేక్షకుల బొమ్మలను చిత్రకారుడు మిలన్‌గాచర్ అప్పటికప్పుడు గీసి అందరి మన్ననలు పొందారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి



నాగాయలంక, మార్చి 10 : సంగమేశ్వర ఉత్సవాలకు వెళ్లి వస్తూ బైక్ అదుపుతప్పి యువకుడు మృతిచెందగా.. మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాలి గ్రామానికి చెందిన కొప్పనాతి మురళీ కృష్ణ (24) కొప్పనాతి గోపి (23) బైక్‌పై సంగమేశ్వర ఉత్సవాలకు వెళ్లి తిరిగి వస్తు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. హుటాహుటిన వారిని అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, కొప్పనాతి మురళీ కృష్ణ (24) మృతి చెందాడు. కొప్పనాతి గోపి (23)ను మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు నాగాయలంక పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని..

గుడివాడ రూరల్ : మండలంలోని బొమ్ములూరు వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ దుర్మరణం చెందాడు. బందరు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు బొమ్ములూరుకు చెందిన లారీ డ్రైవర్ తలారి కోటేశ్వరరావు(35)ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

కాశీ విశ్వేశ్వరస్వామికి బంగారు బిల్వదళనామం

చిట్టినగర్, మార్చి 10: చిట్టినగర్‌లోని గంగా అన్నపూర్ణ సమేత శమీ కాశీవిశ్వేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వామిని ఆలయ అర్చకుడు సాయి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. 50గ్రాముల బంగారంతో బిల్వదళ నామం, ఓంకారం చంద్రబింబం, అమ్మవార్లకు నానుతాళ్లు, 250 గ్రాముల వెండి నాగహారతిని భక్తుల విరాళాల ద్వారా స్వామికి రూ.మూడున్నర లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలను అందజేశారు. అర్చకుడు సాయి వాటిని స్వామి, అమ్మవార్లకు అలంకరించి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు.



దుష్ట ప్రభుత్వాన్ని గద్దె దించండి

● ప్రజలకు సీపీఎం నేత బాబూరావు పిలుపు

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 10: రాష్ట్రంలో పేద ప్రజల నెత్తిపై పన్నుల భారాలు మోపుతున్న వైసీపీ దుష్ట ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు పిలుపునిచ్చారు. అజిత్‌సింగ్‌నగర్ 59వ డివిజన్‌లో మార్పు కోసం సీపీఎం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికి వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

బీసీల అభ్యున్నతి టీడీపీతోనే

వడ్డెర సంఘం ఆత్మీయ సమ్మేళనంలో బొండా ఉమా, కేశినేని చిన్ని

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 10: బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని, బీసీలకు రాజకీయంగా గుర్తింపు తెచ్చిన ఏకైక పార్టీ టీడీపీ అని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు, సీనియర్ నాయకుడు కేశినేని చిన్ని అన్నారు. అజిత్‌సింగ్‌నగర్ వడ్డెర కాలనీలోని కల్యాణ మండపంలో ఆదివారం వడ్డెర సంఘం ఆత్మీయ సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. వడ్డెర సామాజికవర్గంలో అత్యధికులు భవన నిర్మాణ కార్మికులుగా ఉన్నారని, రాష్ట్రంలో ఇసుక కొరత సృష్టించి భవన నిర్మాణ కార్మికులను రోడ్డున పడేసిన ఘనుడు జగన్ అని వారు విమర్శించారు. టీడీపీ అధికారంలోకి రాగానే వడ్డెర సాధికార సమితి ద్వారా అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



బొండా ఉమా, కేశినేని చిన్నిని సత్కరిస్తున్న వడ్డెర నాయకులు

ముస్లింలకు న్యాయం చేసిన టీడీపీ

అజిత్‌సింగ్‌నగర్: రాష్ట్రంలో ముస్లింలు, మైనార్టీలకు అన్ని విధాలుగా న్యాయం చేసిన ఏకైక పార్టీ టీడీపీ అని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు, కేశినేని చిన్ని అన్నారు. పైపులరోడ్డు వద్ద ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో టీడీపీ సెంట్రల్ ముస్లిం, మైనార్టీల ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన శాసన మండలి మాజీ చైర్మన్ అహ్మద్ షరీఫ్, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగూల్‌మీరాలను బొండా ఉమా, చిన్నిలు శాలువాలు కప్పి సత్కరించారు.

ఐదేళ్లుగా ప్రజలను దోచుకుతింటున్న వైసీపీ

● పోతిన వెంకటమహేష్, కేశినేని చిన్ని విమర్శలు

చిట్టినగర్: ఐదేళ్లుగా ప్రజలను వైసీపీ ప్రభుత్వం దోచుకుందని జనసేన పార్టీ పశ్చిమ ఇన్‌చార్జి పోతిన వెంకటమహేష్, టీడీపీ సీనియర్ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని) విమర్శించారు. ఆదివారం రాత్రి పాల ఫ్యాక్టరీ హాల్‌లో నియోజకవర్గ బూత్‌స్థాయి కార్యకర్తలు, డివిజన్ నాయకులతోపాటు జనసేన అనుబంధ సంఘాల ముఖ్య నాయకులతో వారు సమావేశం నిర్వహించారు. జగన్ ముస్లింలను మోసం చేశారన్నారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సంక్షేమం జరుగుతుందన్నారు.



జనసేన పశ్చిమ నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న పోతిన మహేష్

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

సమాజానికి, పేదలకు ఎవరు సేవ చేస్తారో వారే నిజమైన క్రైస్తవులు అని టీడీపీ సీనియర్ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. 46వ డివిజన్ జోసెఫ్ స్కూల్ బెతెస్థా మినిస్ట్రీస్ చర్చిలో పోతిన మహేష్‌తో కలిసి ఆయన ప్రార్థనలో పాల్గొన్నారు. యునైటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ జవహర్ ఆధ్వర్యంలో ఫాదర్ మోజేష్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు సొంత నిధులతో సాయం చేస్తానని చిన్ని హామీ ఇచ్చారు.

ఘనంగా మాస్టర్ మైండ్స్ వార్షికోత్సవం

పాయకాపురం, మార్చి 10: మాస్టర్ మైండ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ 23వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. పాయకాపురం రాజీవ్‌నగర్ బ్రాంచ్ స్కూల్‌లో సంతోష్ తరంగా పేరుతో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రముఖ టీవీ యాంకర్ దీప్తి, బాలివుడ్ ప్రముఖ నటి మౌబానిసోర్కర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య పోటీలు, సాంఘిక నాటికలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పెంట్యాల అనిల్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు పుణ్యపు మణికంఠ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

రాష్ట్ర భవిష్యత్ కోసమే మూడు పార్టీల కలయిక: ఎంఎస్ బేగ్

వన్‌టౌన్, మార్చి 10: దేశ ప్రగతి, రాష్ట్ర భవిష్యత్ కోసమే బీజేపీ, టీడీపీ, జనసేనలు కలిశాయని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ, జనసేన, టీడీపీల కలయికను స్వాగతిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అమరావతి రాజధానిగా సర్వతోముఖాభివృద్ధిని మూడు పార్టీల ప్రభుత్వం సాధిస్తుందని తెలిపారు. రాష్ట్రం ఎన్నో ఏళ్ల వెనకబడిపోయిందని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకురావాలంటే కేంద్ర సహకారం తప్పనిసరి అని అన్నారు. చంద్రబాబు ముందు ఆలోచనతో బీజేపీతో పొత్తు నిర్ణయాన్ని తీసుకున్నారని వివరించారు. అధికార గర్వం, మదంతో వీర్రవిగుతూ తప్పులను ప్రశ్నించిన ప్రతిపక్షాలను అక్రమ కేసుల్లో ఇరికించి అణచివేయాలని ప్రయత్నిస్తున్న సైకో జగన్మోహనరెడ్డి పాలనను సాగనంపడానికి ప్రజలు సంసిద్ధంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ప్రగల్భాలు పలకడం కాదు వెలంపల్లీ..

కొత్తపేట పీఎస్ నిర్మాణానికి నిధులేవీ?: సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు

చిట్టినగర్, మార్చి 10: "పశ్చిమ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ప్రగల్భాలు పలుకుతారు. ప్రజలకు ఉపయోగపడే కొత్తపేట పోలీస్ స్టేషన్ నిర్మాణానికి నిధులు ఎందుకు తీసుకురాలేదో ఆయన సమాధానం చెప్పాలి." అని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని సీపీఐ నాయకులు ఆదివారం పోలీస్‌స్టేషన్ నిర్మాణం చేస్తున్న పాలఫ్యాక్టరీ వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వం నిధులు కేటాయించకుండా పోలీస్ స్టేషన్ నిర్మాణం ఎలా ముందుకెళ్తుందని కోటేశ్వరరావు ప్రశ్నించారు. శంకుస్థాపన చేసి రెండున్నరేళ్లు గడుస్తున్నా నిర్మాణం పునాదులకే పరిమితమైందన్నారు. ఇది ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శమన్నారు. నక్క వీరభద్రరరావు, తాడి పైడియ్య, పంచదార్ల దుర్గాంబ, కొట్టు రమణారావు, ఎస్కే నజీర్, బోరా రామకృష్ణ, కంచర్ల భార్గవ్, అంజూరి సూరిబాబు, ఎస్కే అమీర్ పాల్గొన్నారు.



కొత్తపేట పోలీస్ స్టేషన్ నిర్మాణం చేపట్టాలని నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్

సెంట్రల్‌లో యువతతో టీడీపీ భారీ సైకిల్ ర్యాలీ

పాయకాపురం/అజిత్‌సింగ్‌నగర్, మార్చి 10: కొత్తగా ఓటు హక్కు పొందిన యువత తమ మొదటి ఓటును టీడీపీకి వేసి చంద్రబాబుకు మద్దతు ఇవ్వాలని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సెంట్రల్ నియోజకవర్గంలో ఆదివారం ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ పేరుతో బొండా ఉమా తనయులు బొండా సిద్ధార్థ, రవితేజ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అజిత్‌సింగ్ నగర్, పాయకాపురం ప్రాంతంలో భారీ సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. 64వ డివిజన్ కండ్రిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద ప్రారంభమైన సైకిల్ ర్యాలీ రాజీవ్‌నగర్, సుందరయ్యనగర్, ప్రకాష్‌నగర్, పైపులరోడ్డు, లెనిన్ సెంటర్ మీదుగా డాబాకొట్లు సెంటర్ వద్ద ముగిసింది. టీడీపీ నేతలు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అజిత్‌సింగ్‌నగర్ వద్ద జరిగిన బహిరంగ సభలో బొండా ఉమా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న బొండా సిద్ధార్థ, రవితేజ

ఆదర్శనీయురాలు సావిత్రీబాయిపూలే

భవానీపురం, మార్చి 10: సంఘ సంస్కర్తగా, తొలి మహిళా ఉపాధ్యాయినిగా సావిత్రి బాయి పూలే మహిళలకు ఆదర్శంగా నిలిచారని ఏపీపీటీడీ(ఆర్టీసీ) బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్సీ శేషగిరిరావు అన్నారు. భవానీపురంలో బీసీ సంఘం భవన్‌లో సావిత్రిబాయిపూలే వర్ధంతి సభ ఆదివారం జరిగింది. మహిళలకు ఆయన పండ్లు పంపిణీ చేసి, మాట్లాడారు.



టీడీపీ నేత షేక్ కరీముల్లాకు నగదు అందజేస్తున్న బుద్దా వెంకన్న

మహిళా పోలీసులకు సత్కారం

చిట్టినగర్, మార్చి 10: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న మహిళ ఎస్సై, కానిస్టేబుల్స్ హోంగార్డులను ఆదివారం సత్కరించారు. సీఐ గణేష్ వారికి చీరలు ఫాస్ట్‌ట్రాక్ వాచ్‌లను అందజేశారు.

చీరల పంపిణీ

పాయకాపురం: స్పందన సేవా సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, నున్న ఎస్సై జ్యోతికిరణ్ హాజరై పారిశుధ్య కార్మికులకు, మహిళ లకు చీరలు పంపిణీ చేశారు. సమితి ఏర్పాటు చేసిన స్పందన వాకర్స్ క్లబ్‌ను ప్రారంభించి, క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ చిన్నం రామకృష్ణ స్పందన సేవా సమితి వ్యవస్థాపకుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

వన్‌టౌన్, మార్చి 10: టీడీపీ 41వ డివిజన్ క్లస్టర్ ఇన్‌చార్జి షేక్ కరీముల్లా వైద్య ఖర్చుల నిమిత్తం టీడీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి బుద్దా వెంకన్న తన నివాసంలో ఆదివారం రూ.10వేలు అందజేశారు. 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి), సోలంకి రాజుజైన్ పాల్గొన్నారు.



14వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గద్దె అనురాధ, రాజేష్, క్రాంతికుమార్

మద్యాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం

● మద్య నిషేధం హామీ తుంగలో తొక్కిన జగన్: గద్దె అనురాధ

పటమట, మార్చి 10: 2019 ఎన్నికల ప్రచారంలో మద్యపాన నిషేధం చేస్తానన్న జగన్ అధికారంలోకి రాగానే రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ ధ్వజమెత్తారు. మద్య నిషేధం హామీని తుంగలోకి తొక్కి, కల్తీ మద్యాన్ని సీఎం జగన్‌రెడ్డి ఏరులై పారిస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. 14వ డివిజన్ పుట్టరోడ్ వాణినగర్ ప్రాంతంలో ఆదివారం ఎన్నికల ప్రచారంలో గద్దె రాజేష్, గద్దె క్రాంతికుమార్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ప్రజలను కలుసుకుని ఓట్లను అభ్యర్థించారు. ప్రజలను అనేక రకాలుగా మోసం చేస్తున్న జగన్‌ను గద్దె దించాలన్నారు. నర్రా కిషోర్, బద్రి, కె.రమేష్, వడ్లపల్లి శివ, వీరంకి డాంగేకుమారి, చెరుకూరి సాంబయ్య, అన్నాబత్తుని బాబీ, శ్రీదేవి, యల్లబాబు పాల్గొన్నారు. గద్దె రామ్మోహన్ విజయాన్ని కాంక్షిస్తూ 12వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి గద్దె అనురాధ ప్రచారం నిర్వహించారు.

వైసీపీ ఓటమి ఖాయం: గద్దె అనురాధ

రామలింగేశ్వరనగర్: రాబోయే ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయమని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్‌లో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన తూర్పు అభ్యర్థి గద్దె రామ్మోహన్‌ను గెలిపించాలని కోరారు. గాదిరెడ్డి అమ్ములు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మధురానగర్ పప్పులమిల్లు ప్రాంతంలో ప్రచారంలో పాల్గొన్న బొండా సుజాత, ఉషారాణి, కెంబూరి కృష్ణ తదితరులు

టీడీపీ-జనసేన ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

మధురానగర్, మార్చి 10: రాష్ట్రాభివృద్ధి టీడీపీ-జనసేన ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు సతీమణి బొండా సుజాత అన్నారు. 29వ డివిజన్ మధురానగర్ పప్పుల మిల్లు ప్రాంతంలో ఆదివారం ఆమె పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి బొండా ఉమాను గెలిపించాలని కోరారు. టీడీపీ జిల్లా మహిళా నాయకురాలు చెన్నుపాటి ఉషారాణి, టీడీపీ, జనసేన డివిజన్ అధ్యక్షులు పీవీఆర్, కెంబూరి కృష్ణ పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వమొచ్చాక చెత్తపన్ను రద్దు: గద్దె క్రాంతి

భారతీనగర్: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వసూలు చేస్తున్న చెత్త పన్నును టీడీపీ-జనసేన ప్రభుత్వమొచ్చాక రద్దు చేస్తారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తనయుడు గద్దె క్రాంతికుమార్ తెలిపారు. మూడో డివిజన్ లోని రామచంద్రనగర్ మెయిన్‌రోడ్డులో టీడీపీ-జనసేన నాయకులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తాడి బాబూరావు, మురారి బాలాజీప్రసాద్, జవాది కొండలరావు, హరీష్ పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి ఐ-టీడీపీ ప్రచారం

పటమట, మార్చి 10: టీడీపీ విజయం కోసం తూర్పు నియోజకవర్గ ఐ-టీడీపీ సమావేశం ఆదివారం అశోక్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఐ-టీడీపీ ఇన్‌చార్జి సిద్దెల వివేక్ అధ్యక్షతన నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి ఐ-టీడీపీ ప్రచార కార్యక్రమాలపై చర్చించారు. సోషల్ మీడియా ద్వారా వైసీపీ ప్రభుత్వ తప్పిదాలను ఎండగట్టడమే కాక, వైసీపీ చేసే తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలని వివిక్ సూచించారు. ఐ-టీడీపీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు చిరుమామిళ్ల కృష్ణ, ప్రదీప్ పాల్గొన్నారు.

దిక్సూచి DIKSUCHI

ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయెన్స్

కరెంట్ అఫైర్స్ /జనరల్ ఎస్సే

చిరుతపులి, పులి అంటే ఎవరికైనా భయమే! ఒక్కోసారి ఇటువంటి క్రూరమృగాలు అడవులకు సమీపంలో ఉండే గ్రామాలపై దాడి చేసి జంతువులకు, మనుషులకు హాని కలిగిస్తుంటాయి. అలాంటి క్రూరమృగాలను ప్రత్యేకంగా సంరక్షించడం ఎందుకు? అనే సందేహం చాలామందికి కలగవచ్చు. నిజానికి పులి, చిరుత పులి వంటి ఆహార గొలుసులోని పై స్థాయి జంతువులు- జీవ వైవిధ్యాన్ని, ప్రకృతి సమతౌల్యాన్ని కాపాడడంలో కీలకంగా వ్యవహరిస్తాయి. ఉదాహరణకు పులి, చిరుతపులి వంటి జీవులు అంతరించిపోతే గడ్డిమేసే జంతు జనాభా విపరీతంగా పెరిగి అటవీ భూముల్లో గడ్డి, చిన్నపాటి మొక్కలు కనుమరుగౌతాయి. దానితో పర్యావరణం, జీవావరణం దెబ్బతిని వర్షాభావ పరిస్థితులు తలెత్తడం, నేలలో తేమ తగ్గడం వంటి విపరిణామాలకు దారితీస్తుంది. అందుకే ప్రకృతి సమతుల్యాన్ని కాపాడాలంటే అంతరించిపోతున్న పులి జాతుల జనాభాను పరిరక్షించాల్సి ఉంది.

- ఇందుకోసం 1973లోనే పులుల సంరక్షణకు భారత ప్రభుత్వం 'ప్రాజెక్ట్ టైగర్'ను చేపట్టింది. పులుల ఆవాసాల సంరక్షణకు వాటి వేట నిరోధానికి స్థానిక గిరిజన జాతుల ప్రజలను, అటవీ పరిసర గ్రామాల ప్రజలను కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వాములను చేస్తూ పులుల సంరక్షణ ఆవశ్యకతపై వారిలో అవగాహన పెంచుతోంది.
- 2006-19 మధ్యకాలంలో ప్రభుత్వం పులుల సంఖ్యను పెంచడంపై ప్రత్యేక శ్రద్ధ వహించింది. టైగర్ ఇనీషియేటివ్ కార్యక్రమం ద్వారా పులుల సంఖ్యను రెండింతలు చేసింది. 2010లో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో నిర్వహించిన టైగర్ సమ్మిట్‌లో భారత ప్రధాని మోదీ 2022 నాటికి ప్రపంచంలోని అడవుల్లో గల పులుల జనాభాను రెండింతలు చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. 2022లో భారత దేశం ఆతిథ్యం ఇచ్చిన పులుల సంరక్షణపై ఆసియా దేశాల మంత్రుల రెండో సమావేశం(సెకండ్ ఏషియా మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ ఆన్ టైగర్ కన్జర్వేషన్)'లో బిగ్ క్యాట్స్‌గా పిలిచే పులి, చిరుతపులి వంటి పులి జాతి జంతువుల సంరక్షణకు ఒక అంతర్జాతీయ కూటమిని ఏర్పాటు చేయాలని టైగర్ రేంజ్ కంట్రీస్(పులుల జనాభా గల దేశాలు) ఒక సూత్రప్రాయ అంగీకారానికి వచ్చాయి. 2023 ఏప్రిల్‌లో మైసూర్‌లో జరిగిన ప్రాజెక్ట్ టైగర్ 50 వసంతాల కార్యక్రమం సందర్భంగా ప్రధాని మోదీ 'ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ ఎలయెన్స్' ఏర్పాటును ప్రకటించారు.
- 2023 మార్చి 1న భారత రాజధాని న్యూఢిల్లీ హెడ్‌క్వార్టర్‌గా ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ ఎలయెన్స్(ఐబీసీఏ) ఏర్పాటుకు ఆమోదం లభించగా 2024 ఫిబ్రవరి 29న అధికారికంగా క్యాబినెట్ ప్రకటన వెలువడింది.

ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయెన్స్ అంటే?

- ఆహారపు గొలుసులో పై భాగంలో ఉండే ప్రిడేటర్స్ జాతులకు (బిగ్ క్యాట్‌గా పిలిచేవి) చెందిన ఏడు రకాల జీవులు- సింహం, పులి, చిరుతపులి, స్నోలెపర్డ్, లెపర్డ్, జాగ్వార్, ప్యూమా జాతి వన్యమృగాల సంరక్షణ, పరిరక్షణ కోసం పరస్పర సహకారం అందించుకొనేందుకు ఏర్పాటైన కూటమి 'ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ ఎలయెన్స్'.
- ఈ కూటమిలో 97 బిగ్ క్యాట్ రేంజ్ కంట్రీస్(ఈ ఏడు జాతుల వన్యమృగాలు గల దేశాలు)తోపాటు అనేక ఏజెన్సీలు, ఔత్సాహిక దేశాలు కూడా భాగస్వాములుగా ఉంటాయి. అంటే ఇది 'మల్టీ కంట్రీ-మల్టీ ఏజెన్సీ కొయిలేషన్'గా చెప్పవచ్చు. భారతదేశంలో ఈ ఏడు బిగ్ క్యాట్ జాతుల్లో రెండు జాతులు (ప్యూమా, జాగ్వార్) మినహా మిగిలినవన్నీ మనుగడ సాగిస్తున్నాయి. భారత్‌తోపాటు ఈ కూటమిలో నేపాల్, బంగ్లాదేశ్, చైనా, భూటాన్ వంటి ఇతర ఆసియా దేశాలతోపాటు కొన్ని మధ్య ప్రాచ్యదేశాలు; ఉత్తర, దక్షిణ అమెరికా ఖండ దేశాలు; కాంబోడియా, మలేషియా, వియత్నాం, థాయ్‌లాండ్, లావో వంటి ఆగ్నేయాసియా దేశాలు; మరినామ్, ఇథియోపియా, కెన్యా, నైజీరియా, అర్మేనియా, టాంజానియా వంటి ఆఫ్రికా ఖండ దేశాలు భాగస్వాములుగా ఉండనున్నాయి. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్(ఐయూసీఎన్), స్నోలెపర్డ్ ట్రస్ట్, అమూర్ టైగర్ సెంటర్ ఈ కూటమిలో చేరేందుకు ఆసక్తి తెలిపాయి.

ఐబీసీఏ లక్ష్యాలు

- అనుసంధాన వేదికగా ఐబీసీఏ సభ్యదేశాల మధ్య సమాచార, విజ్ఞాన మార్పిడికి సాంకేతిక సహకారానికి తోడ్పాటునందించడం
- సరిహద్దు అడవుల్లో ఇరుగు పొరుగు దేశాలు ఉమ్మడిగా చర్యలు చేపట్టేందుకు, పర్యవేక్షణ ఒప్పందాలకు సహకరించడం
- శాస్త్రీయంగా దత్తాంశాల సేకరణకు కావాల్సిన టెక్నాలజీని సాంకేతిక పరికరాలను సభ్య దేశాల మధ్య బదిలీ చేయడం
- భద్రతా దళాల మధ్య అనుసంధానత పెంచడం ద్వారా వన్య ప్రాణుల అక్రమ రవాణాను ప్రపంచవ్యాప్తంగా అరికట్టడం
- వివిధ దేశాలు, వివిధ ఏజెన్సీలు, వివిధ స్థానిక కమ్యూనిటీలు, అనుభవజ్ఞుల మధ్య అనుసంధానత పెంచడం ద్వారా వారి అనుభవాలు; సాంప్రదాయక, వైవిధ్య వ్యూహాలను పరస్పర పంపిణీకి వీలు కల్పించి అంతరించే దశకు చేరుకుంటున్న బిగ్ క్యాట్ జాతులను పరిరక్షించడం.
- పర్యావరణాన్ని, జీవ వైవిధ్యాన్ని రక్షించి సుస్థిరాభివృద్ధికి బాటలు వేయడం



నిధుల సమీకరణ: వ్యవస్థాపక దాతగా భారత దేశం రూ.150 కోట్లను వన్ టైం బడ్జెటరీ సపోర్ట్‌గా వెచ్చించనుంది. రాబోయే అయిదేళ్ల కాలంలో (2028 వరకు) ఢిల్లీలో ఐబీసీఏ సెక్రటేరియెట్‌ను ఏర్పాటు చేయడం, ప్రాజెక్ట్ కార్యక్రమాలను నిర్వహించడం కోసం ఈ మొత్తాన్ని ఖర్చు చేయనుంది. ఇతర సభ్యదేశాలు కూడా కాలానుగుణంగా నిధులపరంగా, సాంకేతిక సహాయాల పరంగా సహకరించనున్నాయి.

ఐబీసీఏను భారత్‌లో ఏర్పాటు చేయడానికి కారణాలు: ప్రపంచవ్యాప్తంగా ఉన్న అడవుల్లో గల పులుల జనాభాలో 50 శాతం వరకు భారతదేశ అడవుల్లోనే ఉన్నాయి. 2006-19 మధ్య కాలంలో పులుల సంఖ్యను రెండింతలు చేసిన ఘనత, అనుభవం భారత్‌కు ఉన్నాయి. ప్రాజెక్ట్ టైగర్‌లో భాగంగా గత 50 ఏళ్లుగా ప్రజల భాగస్వామ్యంతో పులుల వేటను అరికట్టడంలోనూ; గిరిజనుల భద్రత, జీవనోపాధికి భంగం కలుగకుండా అటవీ ఉత్పత్తులను సేకరించడంలోనూ; పులుల ఆవాసాలకు భంగం కలగకుండా మనుషులు మసలుకునే వ్యూహాలను అమలుపరచడంలోనూ; అటవీ సరిహద్దు ప్రాంత ప్రజలను పులుల సంరక్షణ పరంగా జాగృతం చేయడంలోనూ; పులుల వేటను నిరోధించి వాటి శరీర భాగాల వ్యాపారాలను అడ్డుకోవడంలోనూ భారత్‌కు విస్తృతమైన అనుభవం ఉంది.

ఐబీసీఏ నిర్మాణం

- ఐబీసీఏకు భారతదేశం ప్రధాన కేంద్రంగా ఉంటుంది. ఇక్కడ ఒక సెక్రటేరియెట్ కూడా ఏర్పాటవుతుంది.
- ఐబీసీఏలో అసెంబ్లీ మెంబర్స్ స్టాండింగ్ కమిటీ ఏర్పాటును ప్రతిపాదించారు.
- భారత పర్యావరణ మంత్రిత్వ శాఖ ఐబీసీఏ సెక్రటేరియెట్‌కు ఒక తాత్కాలిక డైరెక్టర్ జనరల్‌ను నియమిస్తుంది
- కూటమి సభ్యదేశాలు సమావేశమై రోజువారీ విధి నిర్వహణ కోసం ఒక అధికారిక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసే వరకూ తాత్కాలిక డైరెక్టర్ జనరల్ ఈ బాధ్యతలు నిర్వహిస్తారు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

కుషాణుల రాజకీయ, సాంస్కృతిక చరిత్ర

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ హిస్టరీ

భారతదేశ చరిత్రలో కుషాణుల ప్రాముఖ్యం చాలా ఉంది. శక సంవత్సరాన్ని క్రీ.శ.78 మార్చి 22న కనిష్కుడు ప్రారంభించాడు. దీనినే శక క్యాలెండర్‌గా భావిస్తారు. కుషాణుల వంశంలో కనిష్కుడు గొప్పవాడు. ఇతనికి దేవపుత్ర, సీజర్, రెండో అశోకుడు అనే బిరుదులు ఉన్నాయి.

కుషాణుల చరిత్రకు ఆధారాలు: తొలి, మలి 'హన్‌వంశ' చరిత్రలు, బాక్ట్రియాలోని రాయబారి 'చాంగ్‌కెన్' రచనలు, హిందూ పురాణాలు, కల్హణుడు రాసిన 'రాజతరంగిణి'(కశ్మీర్‌ను పాలించిన రాజుల చరిత్ర), అశ్వఘోషుడు రాసిన 'మాధ్యమిక సూత్రం' మొదలైన గ్రంథాలు.

కుషాణుల రాజకీయ చరిత్ర: వీరు చైనాలోని 'యూచీ' తెగకు చెందిన వారు. వీరి స్వస్థలం చైనాలోని 'హుయాంగ్‌హూ' నదీ తీర ప్రాంతం. కుషాణులు చైనాలో 'హియాంక్ తెగ' చేతిలో ఓడిపోయి భారత్‌కు వలస వచ్చారు. ఇక్కడి శకరాజులను ఓడించి స్థిరపడ్డారు. వీరు ఆక్రమించిన రాజ్యాన్ని ఐదు భాగాలుగా విభజించారు.

కుజుల కాడ్ఫిసెస్: ఇతడు రాజ్య స్థాపకుడు. ఇతడు నాలుగు యూచీ తెగలను ఓడించి స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. శకులను ఓడించి, వారు నివసించిన ప్రాంతాల్లో స్థావరాలు ఏర్పాటు చేశాడు. వివాహ సంబంధాల ద్వారా రాజ్యాన్ని విస్తరించాడు. కుషాణులు, శకులు కలిసిపోయారు.

కుజుల కాడ్‌ఫైజీ: క్రీ.శ.15లో రాజ్యానికి వచ్చాడు. ఇతని తర్వాత విమాకాడ్‌ఫైజ్ పాలనలోకి వచ్చాడు. ఇతను క్రీ.శ.65 నుంచి 75 వరకు పాలించాడు. ఇతని విగ్రహంపై 'కుషాణ పుత్రషాహి విసుతకమ' అని ఉంది. విమాకాడ్‌ఫైజ్ తండ్రి కాలంలోనే గాంధార ప్రాంతంతోపాటు, పంజాబ్, మధుర, వారణాసి వరకు జయించాడు. చివరకు చైనా వాళ్ల చేతిలో ఓడిపోయాడు. రోమన్ చక్రవర్తి ఆస్థానానికి విమాకాడ్‌ఫైజ్ రాయబారిని పంపాడు. వర్తక వాణిజ్యాలు, వర్తక సంబంధాలు ఏర్పరచుకున్నాడు. ఇతని కాలంలోనే వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు, వజ్రాలు రోమ్‌కు ఎగుమతి అయ్యేవి. దీనికి బదులుగా భారత్‌కు రోమ్ నుంచి 'బంగారు నాణేలు' దిగుమతి అయ్యాయి అని ప్లీని 'ద ఎల్డర్' అనే పుస్తకంలో పేర్కొన్నాడు. విమాకాడ్‌ఫైజ్ శైవమతాన్ని స్వీకరించినట్లు అతని నాణేలపై కన్పించే త్రిశూల ధారి, శివమూర్తి, నంది వాహనం బట్టి తెలుస్తోంది. ఇతనికి రాజాధిరాజా, మహారాజా అనే బిరుదులు ఉండేవి. ఇతని రాజధాని పురుషపురం లేదా పెషావర్. రెండో రాజధాని మధుర.

కనిష్కుడు : ఈ వంశంలో గొప్పవాడు. క్రీ.శ.78లో పాలనలోకి వచ్చాడు. ఈ సందర్భంగానే ఇండియన్ క్యాలెండర్ క్రీ.శ.78 మార్చి 22న ప్రారంభమైంది. కనిష్కుడు గొప్ప యోధుడు. ఇతడు కశ్మీర్‌ను జయించి తన రాజ్యంలో విలీనం చేశాడని కల్హణుడు తన 'రాజతరంగిణి'లో, ఆల్ బెరూని 'కితాబ్-ఇ-హింద్'లో పేర్కొన్నారు. ఇక్కడి నుంచే కనిష్కుడు అశ్వఘోషుడిని తన ఆస్థానానికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఉజ్జయినిలో ఉన్న పశ్చిమ క్షాత్రపలను ఓడించి 'మాళ్వా' ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నాడు.

నాలుగో బౌద్ధమత సమావేశం: ఈ సమావేశాన్ని కశ్మీర్‌లోని కుండలవనంలో నిర్వహించాడు. వసుమిత్రుడిని అధ్యక్షుడిగా, అశ్వఘోషుడిని ఉపాధ్యక్షుడిగా నియమించాడు. వసుమిత్రుడు 'మహా విభాష్యం' రచించాడు. అశ్వఘోషుడు 'సౌందర్యనందం', 'సారీపుత్ర ప్రకరణం', 'వజ్రసూచీ' మొదలైన గ్రంథాలు రచించాడు. కనిష్కుని ఆస్థానంలో చరకుడు అనే గొప్ప వైద్యుడు ఉండేవాడు. ఇతను 'చరక సంహిత' అనే వైద్య గ్రంథం రాశాడు. కనిష్కుని కాలంలో బౌద్ధమతం హీనయానం, మహాయానం అని రెండు వర్గాలుగా చీలిపోయింది. చివరి రాజు వాసుదేవుడు.

ప్రాధాన్యం

వీరి కాలంలో సంస్కృతం, సాహిత్యం అభివృద్ధి చెందడం ప్రారంభమైంది. నాలుగో బౌద్ధమత సమావేశం సంస్కృతంలో జరిగింది. అశ్వఘోషుడిని తొలి సంస్కృత నాటక కర్తగా పరిగణిస్తారు. వీరి కాలంలో మూడు విభిన్న శిల్పకళ పాఠశాలలు అభివృద్ధి చెందాయి. అవి..

శిల్పకళ

గాంధార శిల్పకళ: దీనిని కనిష్కుడు ప్రారంభించాడు. గాంధార ప్రాంతం విదేశీయుల ప్రభావానికి లోనైంది. ఈ శిల్పాల్లో బుద్ధుని ముఖంలో సాత్విక స్వభావంతో కాకుండా, పౌరుషత్వం కనిపిస్తుంది. కండలు తిరిగిన శరీరం, రింగులు తిరిగిన జుట్టుతో బుద్ధుని విగ్రహాలు...ఆత్మలేని శరీరాల్లా ఉన్నాయి. అందువల్ల భారతీయ శైలిపై గాంధార శిల్పం ప్రభావం చూపలేదు.

క్రీ.శ. 5వ శతాబ్దంలో హూణుల దండయాత్రలో గాంధార శిల్పాలు కొంత వరకు ధ్వంసం అయ్యాయి. గ్రీకు-రోమన్ శిల్పకళ ప్రేరణతో ఇండో-గ్రీకు లక్షణాలతో ఏర్పడిందే గాంధార శిల్పకళ. బూడిదరంగు రాతితో చెక్కేవారు. దక్షిణాసియాలోని 'హెలెనిస్టిక్' కళతో దీనిని రూపొందించారు. తొలి విగ్రహం బిటర్‌గాం వద్ద లభించింది. ఎక్కువ విగ్రహాలు కాందహార్ లేదా గాంధార్‌లో లభ్యమయ్యాయి. బమియాన్‌లో ఉన్న అతిపెద్ద విగ్రహాన్ని గొప్ప ఉదాహరణగా చెప్పవచ్చు.

మధుర శిల్పకళ: ఈ శిల్పకళ కూడా క్రీ.శ.100 ప్రాంతంలో కనిష్కుని కాలంలోనే పుట్టింది. మధుర శిల్పకళలో మత, మతేతర శిల్పాలు ఉన్నాయి. మధుర శిల్పకళలో బౌద్ధ, జైన, హిందూ మతాల శిల్పాలు, నాగ, నాగిని శిల్పాలు గాక, సాలభంజిక శిల్పాలు ఉన్నాయి. ఈ శిల్పాలను సిక్రీలోని తెల్లచుక్కలు గల ఎర్ర ఇసుకరాతిలో తయారు చేశారు. వీటిలో స్త్రీల శిల్పాలు ఎక్కువగా ఉన్నాయి. భారతీయ రీతిలో మొదటి సారిగా బుద్ధుని శిల్పాన్ని మధుర శిల్పి సృష్టించాడు.

భోదిసత్వుని విగ్రహం: తల వెనుక ప్రభావ మండలంతో, తల చుట్టూ ముడుల టోపీ, కుడి చేయి అభయ ముద్రలో, ఎడమ చేయిలో కమండలం ఉంది. సుల్తాన్ గంజ్‌లో రాగితో చేసిన బుద్ధుని శిల్పం బర్మింగ్‌హోంలో ఉంది. ఇది గుప్తుల కాలంలో మధుర శిల్పకళ నుంచి ప్రేరణ పొందినట్లు తెలుస్తోంది.

- వాయువ్య భారతదేశంలోని గాంధార శిల్పకళ
- ఆంధ్రలో అమరావతి శిల్పకళ
- గంగా ప్రాంతంలో మధుర శిల్పకళ

సిల్క్‌రూట్: వీరి కాలంలోనే భారతదేశం, చైనా మధ్య వర్తక వాణిజ్యాలు అభివృద్ధి చెందాయి. భారత్, రోమన్ దేశాల మధ్య వాణిజ్యం అభివృద్ధి చెందింది. చైనాలో బౌద్ధమతం వ్యాప్తికి దారి తీసిన సిల్క్‌రూట్‌లోని పెద్ద భాగాలను కుషాణులు నియంత్రించారు. ఈ సమయంలోనే బౌద్ధమతం కొరియా, జపాన్‌లో వ్యాపించడం ప్రారంభమైంది.

నిర్మాణాలు: కుషాణుల ఆధ్వర్యంలో నూతన నగరాలు నిర్మించారు. పురుషపురం, కశ్మీర్ మొదలైనవి. చైత్యాలు, అందమైన శిల్పాలను నిర్మించారు.

- మొదట కుషాణులను విదేశీయులుగా భావించినప్పటికీ... వారి పద్ధతులు, పాలన సంస్కరణలు పూర్తిగా భారతీయాకరించబడ్డాయి.
- భారతీయ చరిత్రలో కుషాణుల కాలం గుప్తుల స్వర్ణయుగానికి నాంది అని చెప్పవచ్చు.

సామ్రాజ్య పతనం: కనిష్కుని తర్వాత అతని కుమారుడు వశిష్కుడు రాజ్యానికి వచ్చాడు. వశిష్క తరవాత హువిష్క, రెండో కనిష్క వరుసగా పాలించారు. రెండో కనిష్కుని తరవాత చివరి రాజు వాసుదేవుడు. ఇతని తర్వాత క్రీ.శ. 176లో కుషాణుల రాజ్యం అంతరించింది.



డాక్టర్ ఐ. నీలా,
అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల, సూర్యాపేట.

సమర్థపాలకుడు చంద్రబాబు

● టీడీపీ-జనసేన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే గద్దె ● 50 వేల మెజార్టీతో గద్దె గెలుపు ఖాయం: కేశినేని చిన్ని

భారతీనగర్, మార్చి 10: చంద్రబాబు సమర్థపాలకుడని, ఆయన మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రంలో శాంతి భద్రతలు బాగుంటాయని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. తూర్పు పరిధిలోని 4వ డివిజన్ పరిటాల ఓంకార కల్యాణ మండపంలో శ్రీనివాసనగర్‌బ్యాంక్ కాలనీ, భారతీనగర్, విజయలక్ష్మి కాలనీవాసులతో ఆదివారం టీడీపీ-జనసేన తూర్పు అభ్యర్థి గద్దె రామ్మోహన్ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్ (చిన్ని), బొప్పన భవకుమార్, జనసేన నేత అమ్మిశెట్టి వాసు పాల్గొన్నారు. టీడీపీ హయాంలో వీఎంసీకి ఏడాదికి రూ.300 నుంచి రూ.400 కోట్లు అభివృద్ధికి కేటాయించామన్నారు. ఈ డివిజన్‌లో టవర్ లైన్సు రోడ్డు చంద్రబాబు ఇచ్చిన నిధులతో ఏర్పాటు చేసిన రహదారేనన్నారు. టవర్ లైన్లు రోడ్డు పనులు 90 శాతం టీడీపీ పాలనలో పూర్తయిందన్నారు. గద్దె రామ్మోహన్ వచ్చే ఎన్నికల్లో అత్యధికంగా 50వేల మెజార్టీతో గెలుపు ఖాయమని కేశినేని చిన్ని అన్నారు. ఏడు నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించి చంద్రబాబు బహుమతిగా ఇవ్వాలన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి చేసే స్థాయికి వైసీపీ నేతలు వెళ్లారని, వారిని ధైర్యంగా ఎదుర్కోవాలని జనసేన నేత అమ్మిశెట్టి వాసు అన్నారు. రాజధానిని మార్చడం వల్ల తాను చాలా బాధపడ్డానని బొప్పన భవకుమార్ అన్నారు. పార్టీలో చేరిన గుంటుపల్లి నరసింహరావును గద్దె సన్మానించారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, తూమాటి ప్రేమానాథ్, గొల్లపూడి నాగేశ్వరరావు, వడ్లపట్ల గోపాలకృష్ణ, మి క్కిలినేని బుజ్జి, జాస్తి పూర్ణచంద్రరావు, రాజారావు, శ్రీనివాస నగర్‌బ్యాంకుకాలనీ, భారతీనగర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిన్ని

బెతెస్థా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

కృష్ణలంక: స్థానిక బెతెస్థా మినిస్ట్రీస్ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో కేశినేని చిన్నితో కలిసి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు. వీరికి పాస్టర్ కాటూరి మోజెష్ ప్రార్థన చేశారు. కాటూరి విజయలక్ష్మి, వేములపల్లి రంగారావు, గొరిపర్తి నామేశ్వరరావు, కేశనం భావన్నారాయణ, చందన సురేష్, మోటేపల్లి చిన్నా, గోగుల రమేష్ పాల్గొన్నారు.

నేటికీ మహిళల పట్ల చిన్నచూపు

● పీవోడబ్ల్యూ రాష్ట్రనేత పద్మ

ధర్నాచౌక్: శ్రామిక మహిళా దినోత్సవం ఆవిర్భవించి వందేళ్లు గడుస్తున్నా నేటికీ మహిళల పట్ల వివక్షత, చిన్నచూపు, శ్రమ దోపిడీ కొనసాగడం దురదృష్టకరమని పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి పి.పద్మ ఆ వేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గాంధీనగర్‌లో ని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు తమ స్వేచ్ఛ, నిర్ణయాధికారం కోసం పోరాడుతూ బీజేపీ ప్రభుత్వ ఫాసిస్టు విధానాలను ఓడించేందుకు ముం దుకు రావాలన్నారు. చైతన్య మహిళా సంఘం నేత లక్ష్మీ, జమాతే ఇస్లాం హింద్ నేత సుల్తానా, ఇఫ్టూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.పోలారి పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన ఆర్యవైశ్యులకు ఎమ్మెల్యే సీట్లు

వన్‌టౌన్, మార్చి 10: నగరంలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ ఆర్య వైశ్య మహాసభ సమావేశంలో ఆర్యవైశ్య జనాభా ప్రాతిపదికన రాష్ట్రంలో ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని తీర్మానించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆర్యవైశ్య మహాసభ ప్రథమ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి షణ్ముకం, అదనపు కార్యదర్శి గొంట్లా రామ్మోహనరావు పాల్గొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో ఇప్పటికే 2 సీట్లను టీడీపీ కేటాయించిందన్నారు. మిగతా రెండు పార్టీలు ఆర్యవైశ్యులకు ప్రాతినిధ్యం ఇవ్వలేదన్నారు. పశ్చిమ నుంచి ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు సీటు ఆశిస్తున్నారన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఆయన పేరును పరిగణనలోకి తీసుకుని సీటు కేటాయించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్టు తెలిపారు. వక్కలగడ్డ భాస్కరరావు పాల్గొన్నారు.

నేడు వీఎంసీలో అప్కాస్ ఇంటర్వ్యూలు

వన్‌టౌన్: నగరపాలక సంస్థ (వీఎంసీ)లో వివిధ విభాగాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి అప్కాస్ ద్వారా అవుట్ సోర్సింగ్ విధానంలో సుమారు 150 ఖాళీల ను భర్తీ చేసేందుకు గత ఏడాది డిసెంబరు 19న నోటిఫికేషన్ జారీ చేశారు. 4వేల మంది దరఖాస్తు చేసుకోగా వీటిలో కొన్నింటిని వీఎంసీలో కీలక పదవిలో ఉన్న ఓ మహిళ ఒక్కో పోస్టును రూ.3 నుంచి రూ.4లక్షలకు అమ్ముకున్నట్టు ఆరోపణలు వచ్చాయి. ఆంధ్రజ్యోతిలోనూ ప్రత్యేక కథనం వచ్చింది. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే, ఆ మహిళ కలిసి కమిషనర్‌పై ఒత్తిడి తెచ్చి ఇంటర్వ్యూ షెడ్యూలును ప్రకటింపజేశారు. 11న సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తుమ్మపల్లి కళాక్షేత్రంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని కమిషనర్ లేఖలు పంపించారు. అర్హత ధ్రువీకరణ పత్రాల ఒరిజనల్ పత్రాలు, ఒక జత జిరాక్స్ తీసుకురావాలని సూచించారు.

నేడు, రేపు వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ఆటోనగర్ (పెనమలూరు): ఆటోనగర్ ఏటీపీ భవనంలో నేడు, రేపు వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కేంద్రప్రభుత్వ సంస్థ ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్, ఫెసిలిటేషన్ కార్యాలయం వారు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల కు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థలు, బ్యాంకులు చిన్న పరిశ్రమల నుం చి కొనుగోలు చేసే ఉత్పత్తుల వివరాలు, చిన్న పరిశ్రమలకు ఆర్థిక సాయం ఇచ్చే పథకాలు వివరిస్తారన్నారు.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నేత దాడి

గొడవర్రు (కంకిపాడు), మార్చి 10: మండలంలోని గొడవర్రు గ్రామంలో ఆదివారం రాత్రి అదే చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో ఆదివారం రాత్రి ఏకలవ్యుడి విగ్రహావిష్కరణకు ముఖ్య అతిథిగా మంత్రి జోగి రమేష్ హాజరై రోడ్డుపై ర్యాలీగా వెళ్తున్నారు. అదే సమయంలో పంచాయతీ పక్కనే ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద అదే గ్రామానికి చెందిన తెలుగుయువత కాజా ప్రవీణ్, కొల్లి శ్రీనివాసరావు, చాగంటిపాటి వంశీ కుర్చొని ఉన్నారు. ఆ ర్యాలీలో అదే గ్రామానికి చెందిన మాదు శివన్నారాయణ అలియాస్ సారా కొట్టు బాబు పాల్గొన్నాడు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద కూర్చొని ఉన్న ప్రవీణ్, శ్రీనివాసరావు, వంశీ చూసి వారి వద్దకు వచ్చి ఏంట్రా మంత్రి గారు వెళ్తుంటే కాలు మీద కాలు వేసుకొని కూర్చున్నారు. అప్పుడే గెలిచేశామనుకుంటున్నారా రేపు మీ అంతు చూస్తాం అంటూ అసభ్యకర పదజాలంతో దూషించాడు. అదేమని ప్రశ్నించిన టీడీపీ కార్యకర్తలపై దాడికి దిగడంతో కాజా మెడపై గోళ్లతో రక్కేసిన గాట్లు, మరో వ్యక్తికి తలపై గాయాలయ్యాయి. దీంతో కాజా ప్రవీణ్, కొల్లి శ్రీనివాసరావు, చాగంటిపాటి వంశీ పోలీసు స్టేషన్‌లో శివన్నారాయణపై ఫిర్యాదు చేశారు.

మహానీయ చిత్రకళామూర్తులు పాపయ్య, బాపు

విజయవాడ కల్చరల్, మార్చి 10: చిత్రకళపై తెలుగుదనాన్ని వెల్లువలా ప్రవహింపజేసిన మహానీయ చిత్రకళామూర్తులు వడ్డాది పాపయ్య, బాపు అని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. విజయవాడ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో చిత్రకళా ప్రదర్శన స ర్వసభ్య సమావేశం ఆదివారం నగరంలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వడ్డాది బాపు రవివర్మకు సమానమైన గొప్ప చిత్రకారుడని, ఆయన తెలుగువారిగా పుట్టడం తెలుగు జాతి అదృష్టమని, ఆయనకు మాత్రం దురదృష్టమన్నారు. ప్రముఖ ఫొటోగ్రాఫర్ శ్రీనివాస్‌రెడ్డి, కాటూరు వెంకటేశ్వరరావు, డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, శేష బ్రహ్మం, మురళీధర్ పాల్గొన్నారు.

ఐపీఏ అమరావతి చాప్టర్ ఏర్పాటు

విజయవాడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ది ఇండియన్ ప్లంబింగ్ అసోసియేషన్ అమరావతి చాప్టర్ నూతనంగా ఏర్పాటైంది. నగరంలోని ఓ హోటల్‌లో రాష్ట్ర అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ రాజశేఖరరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చాప్టర్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ సాందీపాని వజ్జే, కార్యదర్శిగా కిరణ్ పరుచూరి ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా డాక్టర్ బి.ఆనంద్‌బాబు, కోశాధికారిగా డాక్టర్ పి.అనూష, సంయుక్త కార్యదర్శిగా కోమల్ గిడ్ల, కార్యవర్గ సభ్యులుగా రవి కిరణ్ గోగినేని, వెంకటేశ్వరరావు రావిపూడి ఎన్నికయ్యారు.

సిద్ధం సభకు బస్సులు.. ప్రయాణికులకు ఇక్కట్లు

బస్టేషన్, మార్చి 10: ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ స్కూల్ బ స్సులు ఆదివారం బాపట్ల జిల్లా మేదరమెట్లలో వైసీపీ సిద్ధం సభకు తరలివెళ్లడంతో బస్సులు లేక ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. జిల్లా నుంచి సుమారు 270 ఆర్టీసీ బస్సులను తరలించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. జగ్గయపేట, తిరువూరు డిపోల నుంచి 50, నగరం నుంచి 220 బస్సులను తరలించారు. అటువైపు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సిటీ బస్సులు అందుబాటులో లేక ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది, ఆటోడ్రైవర్ల అధికచార్జీలు ప్ర యాణికులను విస్మయానికి గురిచేశాయి. బందరు, ఏలూరు రోడ్డు బోసిపోయాయి.

ఉయ్యూరు: అధికార పార్టీ సభకు జనసేకరణ నిమిత్తం కృష్ణాజిల్లా నుంచి ఆర్టీసీ, ప్రైవేట్, స్కూల్ బస్సులను రవాణశాఖ అధికారులు శనివారమే తరలించడంతో ఉయ్యూరులో బస్సులు లేక ప్రయాణికులు ఆటోలు, ఇతర వాహనాలను ఆశ్రయించారు. డిపోలో 49 బస్సులు సభకు వెళ్లగా విగిలినవి చాలావరకు పాతవి కావడంతో ఇక్కడే ఉంచారు.

కేడీసీసీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

గవర్నరుపేట, మార్చి 10: కేడీసీసీ బ్యాంక్‌లో అంతర్జాతీయ మహి ళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం మహిళా ఉద్యోగుల సదస్సు నిర్వహించారు. ఎయిమ్స్ కంటి విభాగ అధిపతి ప్ర త్యూష ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళల సమస్యలపై ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. మహిళలు అన్ని రంగాల్లోనూ సుస్థిర స్థానాన్ని సంపాదించుకోవాలన్నారు. కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం నేత లు ఆంజనేయులు, సుబ్బారావు, రమేష్ పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌ను బెదిరించిన ముగ్గురి అరెస్టు

విద్యాధరపురం, మార్చి 10: లారీ డ్రైవర్‌ను బెదిరించి డబ్బు డి మాండ్ చేసిన సంఘటనలో ఓ విలేకరితో పాటు మరో ఇద్దరిని భవానీపురం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఏ కొండూరు మండలం కంభంపాడుకు చెందిన కఠారి వెంకన్న (40) ఓ మీడియాలో పనిచేస్తున్నాడు. ఇతడితోపాటు అదే ఊరికి చెందిన జేసీబీ డ్రైవర్ కలసాని వెంకన్నబాబు (20) కారు డ్రైవర్ మక్కెన మహేష్‌బాబు గొల్లపూడి సమీపం లో హైదరాబాద్ నుంచి చికెన్‌లోడుతో ఏలూరుకు వెళుతున్న లారీని ఆ పి తాము విలేకరులమంటూ బెదిరించి రూ.15వేలు డిమాండ్ చేశారు. తన వద్ద డబ్బు లేదన్నా వినకుండా డ్రైవర్ వద్ద ఉన్న రూ.2వేలను జేబులోంచి బలవంతంగా లాక్కున్నారు. పోలీసు జీపు రావడంతో పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

డ్రైవర్‌పై కేసు.. ఏలూరు వడ్డెగూడానికి చెందిన లారీ డ్రైవర్ నూతక్కి రామకృష్ణ హైదరాబాద్ నుంచి ఏలూరుకు కోళ్లవ్యర్థాలను రవాణా చేస్తుండటంతో భవానీపురం పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. కోళ్ల వ్యర్థాలను చేపల చెరువుల్లో వేస్తారని వాటిని తిన్న చేపలను మనుషులు తిని వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. వీటిని తరలించడం నిషేధం కావడంతో అతడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కోగంటి సేవలు మరువలేనివి

విజయవాడ స్పోర్ట్సు: ఉమ్మడి కృష్ణాజిల్లాలో వాలీబాల్‌కు ప్రజాదరణ తెచ్చిన కోగంటి వెంకట సుబ్బారావు సేవలు మరువలేమని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాదెళ్ల బ్రహ్మాజీరావు, దోనేపూడి దయాకర్‌రావు కొనియాడారు. ఇటీవల మృతి చెందిన కోగంటి సుబ్బారావు సంస్మరణ సభను ఐజీఎంసీలోని వాలీబాల్ అసోసియేషన్‌హాల్లో ఘనంగా నిర్వహించారు. వాలీబాల్ సుబ్బారావుగా కోగంటి జిల్లా లో తనదైన ముద్ర వేశారని వక్తలు ప్రస్తుతించారు.

ఎల్లలు దాటిన పాట



'రామ్ ఆయేంగే'... అయోధ్య రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ సమయంలో సామాజిక మాధ్యమాల్లో బాగా వినిపించిన పాట ఇది. అద్భుతమైన పాటలు ఎన్నో ఉన్నా... ఈ పాటే ఎందుకంత ప్రాచుర్యం పొందింది? ఎందుకంటే ఇది పాడింది ఒక జర్మనీ గాయని. పేరు... కసండ్రా మే స్పిట్‌మన్. 22 ఏళ్ల కసండ్రా బహుముఖ ప్రజ్ఞాశాలి. పాటలు కూడా రాస్తుంది. ఆ పాటతోనే ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' అయింది.

ఆ మధ్య ఓ కార్యక్రమంలో భాగంగా తమిళనాడు వెళ్లినప్పుడు... ఆమెకు ప్రధాని ప్రత్యేక ఆహ్వానం పంపించి మరీ కలిశారు. తల్లితో కలిసి తమిళనాడులోని పల్లడం వచ్చిన ఆమె... మోదీ ముందు 'అచ్యుతమ్ కేశవమ్' పాడి వినిపించింది. తరువాత మరో తమిళ పాట కూడా ఆలపించింది. ఆమె గాన మాధుర్యానికి మోదీ పరవశించిపోయారు. పాడుతున్నప్పుడు తాళం వేస్తూ... ఆస్వాదించారు.

'ఎంత అద్భుతమైన గొంతు! భగవంతుడిపై ఆమెకు ఉన్న ప్రేమ ఆ గొంతులో ప్రతిధ్వనిస్తోంది. ఆ స్వరమాధుర్యం ఒక జర్మనీ బిడ్డదని తెలిస్తే మీరు మరింత సంభ్రమాశ్చర్యాలకు లోనవుతారు. ఆమె పేరు కసండ్రా మే స్పిట్‌మన్' అంటూ మోదీ 'ఎక్స్'లో కొనియాడారు.



తన ముందు పాడిన పాటను షేర్ చేశారు. లక్షల మంది కసండ్రా గానామృతానికి ఫిదా అయ్యారు.

భారతీయ భాషల్లో...

జర్మనీకి చెందిన కసండ్రా పేరు భారత్‌లో గత ఏడాది బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. తమిళంతో పాటు పలు భారతీయ భాషల్లో ఆమె ఆలపించిన భక్తి గీతాలు నెటిజనులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అయోధ్య రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన పురస్కరించుకుని... కసండ్రా 'రామ్ ఆయేంగే' అంటూ హిందీ గీతాన్ని ఆలపించింది. దాన్ని తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే... గంటల్లో వ్యూస్ లక్షలు దాటాయి. హిందీతో పాటు సంస్కృతం, హిందీ, మళయాళం, తమిళం, ఉర్దూ, అస్సామీ, బెంగాలీ భాషల్లో కూడా ఆమె భక్తి పాటలు అద్భుతంగా పాడుతుంది. ఆమె గానం లయబద్ధంగా సాగుతుంది. పదాలు స్పష్టంగా పలుకుతుంది. భారతీయ సంగీతంపై ఆమెకు ఎనలేని మక్కువ.

ఎన్నో ఘనతలు...

కాస్మేగా తన అభిమానులకు బాగా పరిచయమైన కసండ్రా మే స్పిట్‌మన్ చిన్నప్పుడు డ్రమ్స్ వాయించేది. తరువాత పియానోలో పట్టు సాధించింది. ఆమెపై ప్రముఖ సంగీతకారుడు, పియానిస్ట్ చోపిన్ ప్రభావం ఎక్కువ. తొలుత రేడియోలో తన ప్రతిభను ప్రదర్శించిన కసండ్రా... తరువాత 'డీన్ సాంగ్' టీవీ షోతో బాగా పేరు తెచ్చుకుంది. బోస్టన్‌లోని 'బర్కిలీ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్' నుంచి స్కాలర్‌షిప్ అందుకోవడం ఆమె కెరీర్‌లో పెద్ద మలుపు. వివిధ వేదికలపై నుంచి తన గాత్రాన్ని వినిపించి. పియానోతో అలరించింది. ఎందరో హృదయాలు గెలుచుకుంది. కసండ్రా పాడిన 'ది వే ఐయామ్' గీతం ప్రతిష్ఠాత్మక బర్కిలీ కాలేజీ నుంచి అవార్డు గెలుచుకుంది. 2015లో నిర్వహించిన సాంగ్ రైటింగ్ పోటీల్లో జాతీయ అవార్డు దక్కించుకుంది. అలాగే 2021లో జరిగిన 'యూకే సాంగ్ రైటింగ్ పోటీ'లో 'బుల్లీస్' పాటకు గానూ ప్రథమ బహుమతి అందుకుంది.

భారతీయ సంగీతం, వాయిద్యాల మీద ఎంతో ఆసక్తి కనబరిచే కసండ్రా... అందులో కూడా ప్రావీణ్యం పొందేందుకు ప్రయత్నిస్తోంది. సామాజిక మాధ్యమాల్లో లక్షలమందిని అలరిస్తూ... వారి ఆదరాభిమానాలు చూరగొన్న ఆమెకు దృష్టి లోపం. కానీ కసండ్రాలోని అసమాన కళాకారిణికి, కళ కోసం సరిహద్దులు దాటి ఆమె పడుతున్న తపనకు ఆ లోపం అడ్డు కాలేదు. అచంచలమైన ఆత్మవిశ్వాసంతో... మన కళలు, సంస్కృతిపై ప్రేమతో కసండ్రా పంచుతున్న గానామృతానికి వెల కట్టలేం.

ఆమె జీవితం పాఠమైంది...



ఏడేళ్లకే చూపును కోల్పోయినా... మొక్కవోని ఆత్మవిశ్వాసంతో విజేతగా నిలిచారు డాక్టర్ జి.ఎన్.సంగీత. ఆసియా దేశాల అంధుల సదస్సులో తన ప్రసంగంతో ఎందరో ప్రముఖుల్ని మెప్పించారు. ఆమె జీవితంపై ఒక మాజీ మంత్రి పిహెచ్‌డి చేస్తే... సీబీఎస్ఈ విద్యార్థులకు ఆమె కథ పాఠమయింది. కౌన్సెలర్‌గా వేలాది మందికి జీవన మార్గదర్శి అయిన సంగీత 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి.

"నాది అందమైన బాల్యం. ఆహ్లాదమైన రంగురంగుల ప్రపంచం. ఆనందమంతా నాదే అన్నట్టుగా గడిచిన రోజులవి. మా నాన్న నటరాజ్ పంచాయతీరాజ్ విభాగంలో ఇంజనీర్. అమ్మ లలిత గృహిణి. 1973 ఆగస్ట్ 15న జన్మించిన నేను ఏడేళ్ల వరకూ ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పెరిగాను. కానీ నేను మూడో తరగతిలో ఉన్నప్పుడు తరచూ జ్వరం వస్తూండడంతో... పరీక్షలు చేయించాం. బ్రెయిన్ ట్యూమర్ అని నిర్ధారణ అయింది. దాని కారణంగా కొద్ది రోజుల్లోనే నా కంటి చూపు పోయింది. ఒక్కసారిగా అంతా తల్లకిందులైపోయింది. జీవితాంతం అంధకారంలో ఉండాల్సిందేననే వాస్తవాన్ని... ధైర్యంగా ఎదుర్కోవడానికి సిద్ధమయ్యాను. ఆ సమయంలో నా కుటుంబం నాకు ఎంతో ఆత్మస్థైర్యాన్ని అందించింది. చదువంటే నాకు ఎంతో ఇష్టం. కళ్లు లేవని కలత చెందకుండా... చదువు కొనసాగించాల్సిందేనని నిశ్చయించుకున్నాను. కొన్ని నెలల తరువాత బెంగళూరులోని 'నేషనల్ అసోసియేషన్ ఫర్ బ్లైండ్'లో చేరాను. బ్రెయిలీ లిపి నేర్చుకున్నాను. నాకు చదువు నేర్పడానికి అనుకూలంగా ఉంటుందని మా అమ్మ కూడా ఆ లిపిలో ప్రావీణ్యం పొందింది. ఏడో తరగతిలో తిరిగి మామూలు బడిలో చేరాను. నేను చెబుతూ ఉంటే పరీక్ష రాయడానికి ఎంతో మంది ముందుకువచ్చి సహకరించేవారు. బెంగళూరులోని ఎన్ఎంకెఆర్‌వి కాలేజీలో చరిత్ర, అర్థశాస్త్రం తదితర సబ్జెక్ట్‌తో పీయూసీ, చరిత్ర, అర్థశాస్త్రం, సోషియాలజీతో బీఏ, అనంతరం ఎంఏ పూర్తి చేశాను. అదే సమయంలో కన్నడంతోపాటు ఇంగ్లీషు, సంస్కృతం, హిందీ భాషల మీద పట్టు సాధించాను.

> గొప్ప విజయాలు సాధించి, స్ఫూర్తిదాయకులుగా నిలిచిన మహిళలను ఇంటర్వ్యూ చేసే డాక్యుమెంటరిస్ట్ ఉద్యోగం అది. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ సుధామూర్తి, ప్రముఖ నటి భానుమతి, సుప్రసిద్ధ గాయని గంగూబాయ్ హానగల్ లాంటి ఎందరినో ఇంటర్వ్యూ చేసే అవకాశం నాకు కలిగింది. ఇప్పటివరకూ సుమారు 2,500 మందిని ఇంటర్వ్యూ చేశాను.

ఎలిజబెత్ రాణితో విందు...

నాకు ప్రయాణాలంటే ఇష్టం. 1990లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నప్పుడు యుకెకి చెందిన 'సైట్ సేవర్స్' అనే సంస్థ ఆరుగురిని ఎంపిక చేసి, బ్రిటన్ రాణి ఎలిజబెత్‌తో విందులో పాల్గొనే అవకాశం కల్పించింది. వారిలో నేనూ ఒకర్ని. నా సమాచారం బీబీసీలో ప్రసారమయింది. హంపీ యూనివర్సిటీలో మహిళా సంబంధిత అంశాలపై పిహెచ్‌డి చేయడానికి కర్ణాటకలోని ముప్పై జిల్లాలు పర్యటించాను. అప్పటి గవర్నర్ చతుర్వేది చేతుల మీదుగా పిహెచ్‌డి పట్టా అందుకున్నాను. ఆ రాష్ట్రంలో పిహెచ్‌డి చేసిన తొలి అంధ మహిళగా నిలిచాను. 2003లో ఆసియా దేశాల అంధుల సదస్సులో... 42 దేశాల ప్రతినిధులను ఉద్దేశించి నేను చేసిన ప్రసంగం ఎందరో ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. ఆ పర్యటనకు నా వెంట రావాల్సిన సహాయకులు ఏదో ఆటంకం ఎదురై ఆగిపోయారు. దాంతో నేను ఒంటరిగానే పాక్ వెళ్లాను. అది మరచిపోలేని అనుభవం. 2005లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌ను కలుసుకున్నాను. మహిళా సాధికారతపై పరిశోధనలు చేయాలని ఆయన నాకు సూచించారు. దేశమంతా తిరగాలనేది నా ప్రగాఢ వాంఛ. దాన్ని నెరవేర్చుకోవడానికి కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకూ పర్యటించాను. రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ నాకెంతో నచ్చింది.

ప్రముఖులతో ఇంటర్వ్యూలు...

ఉన్నత విద్యలో నేను రాణించడంతో... నేను ఎంఏ పూర్తి చేశాక... మా కాలేజీ యాజమాన్యం, అధ్యాపకులు నాకు అరుదైన అవకాశం కల్పించారు. గొప్ప విజయాలు సాధించి, స్ఫూర్తిదాయకులుగా నిలిచిన మహిళలను ఇంటర్వ్యూ చేసే డాక్యుమెంటరిస్ట్ ఉద్యోగం అది. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ సుధామూర్తి, ప్రముఖ నటి భానుమతి, సుప్రసిద్ధ గాయని గంగూబాయ్ హానగల్ లాంటి ఎందరినో ఇంటర్వ్యూ చేసే అవకాశం నాకు కలిగింది. ఇప్పటివరకూ సుమారు 2,500 మందిని ఇంటర్వ్యూ చేశాను. వారిలో అయిదు నుంచి తొంభై అయిదేళ్ల వయసు వాళ్ల వరకూ ఉన్నారు. ఈ ఇంటర్వ్యూలను భద్రపరచిన మ్యూజియం బాధ్యతలు కూడా నేనే చూసుకుంటున్నాను. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్వావలంబన కార్డు'పై అవగాహన కల్పించడం కోసం నేను చేసిన ప్రచారానికి ఎన్నో అభినందనలు వచ్చాయి. ఎల్ఐసిలో దివ్యాంగుల కోసం పాలసీలు కావాలని పోరాడి విజయం సాధించాను. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం నాకిష్టం. పరీక్షలంటే భయపడే విద్యార్థులకు, ఆర్థిక, కుటుంబ సమస్యల కారణంగా తనువు చాలించాలనే నిర్ణయానికి వచ్చినవారికి కౌన్సెలింగ్ చేస్తూ ఉంటాను. ఇప్పటివరకూ కనీసం పాతికవేలమందికి ఫోన్ల ద్వారా సలహాలు, సూచనలు ఇచ్చాను.



ఎన్నెన్నో పురస్కారాలు...

ఎందరో మహనీయులను కలుసుకోవడంతో పాటు అనేక పురస్కారాలను సైతం నేను అందుకున్నాను వాటిలో 2005లో గవర్నర్ అవార్డ్, 2008 ఉపరాష్ట్రపతి చేతులమీదుగా జాతీయ అవార్డు. 2009లో బెస్ట్ ఫిజికల్లీ ఛాలెంజ్‌డ్ ఉమెన్‌గా, 2011లో పిహెచ్‌డి సాధించినందుకు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ సత్కారాలు, 2012లో బృహత్ బెంగళూరు మహానగర పాలిక (బీబీఎంపీ) నుంచి కెంపెగౌడ అవార్డు. అలాగే మదర్ థెరీసా దేశీ అవార్డు, నీలమ్ కే గంగా అవార్డు, రోటరీ క్లబ్ నుంచి ఆర్నవ్ ఉమెన్ అఛీవర్స్ అవార్డు, విశ్వచైతన్య అవార్డు. కలశ అవార్డు, డెఫ్ అండ్ డంబ్ కల్చరల్ అకాడమీ నుంచి ఉమెన్ అఛీవర్ అవార్డు, ఉగాది పురస్కారం, సంకల్ప రత్న, చంద్రమ్మ స్త్రీరత్న, బసవ ప్రశస్తి, వీరశైవరత్న, వ్యాస ప్రశస్తి, బెస్ట్ సోషల్ వర్క్ అవార్డులు, పలు సంఘాల నుంచి రోల్ మోడల్ ఉమెన్, ఉమెన్ అఛీవర్ పురస్కారాలు, ఐఎస్‌బీఆర్ బిజినెస్ స్కూల్ నుంచి శ్రమశక్తి షైనింగ్ స్టార్ అవార్డు. పబ్లిక్ రిలేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బెంగళూరు విభాగం నుంచి కల్పనా చావ్లా జయంతి సందర్భంగా 2016లో 'బెస్ట్ డాటర్స్' అవార్డు, 2017లో ఈస్త్రన్ భూమిక అవార్డు. బెంగళూరు బీజెపి మహిళా విభాగం నుంచి ఉమెన్ అఛీవర్ అవార్డు, 2022లో ఉమెన్ ఐకాన్ ఆఫ్ ఇన్‌స్పిరేషన్ ఆఫ్ ది ఇయర్, ఇస్రో బెంగళూర్ సెంటర్ నుంచి ఉమెన్ అఛీవర్ అవార్డు, 2023లో బృందావన్ ట్రస్ట్ నుంచి ఉమెన్ అఛీవర్ అవార్డు... ఇలా అనేకం ఉన్నాయి. కర్ణాటక మాజీ మంత్రి గీతా మహాదేవప్రసాద్ నా జీవితంపై అయిదేళ్ల క్రితం పిహెచ్‌డి చేశారు. నా జీవన ప్రస్థానం, విజయాలు... సీబీఎస్ఈ నాలుగోతరగతి ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ సబ్జెక్ట్‌లో 'స్పెషల్ పీపుల్' శీర్షిక తొలి పాఠంగా చోటు చేసుకోవడం ఎంతో గర్వంగా ఉంది. కలలు కనాలి. వాటిని నిజం చేసుకోవడానికి శ్రమించాలి. వైకల్యాలున్నా, అవరోధాలు ఎదురైనా... సంకల్ప బలం ఉంటే గెలుపు మనదే. ఇదే నా జీవితం చెప్పే పాఠం."

● హిందూపురం రవి, బెంగళూరు

నవ్య | చిత్రజ్యోతి

రెండున్నర గంటల ఎంటర్టైనర్



నవీన్‌రెడ్డి

"ప్రేక్షకులను రెండున్నర గంటలు ఎంటర్టైన్ చేసే చిత్రం 'వెయ్ దరువెయ్'. నిజ జీవిత సంఘటనల ఆధారంగా పూర్తి స్థాయి వినోదాత్మకంగా తెరకెక్కించాను" అని దర్శకుడు నవీన్ రెడ్డి చెప్పారు. సాయిరామ్ శంకర్ హీరోగా నటించిన చిత్రమిది. ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి సినిమా విశేషాలను మీడియాకు వివరించారు.

● మా స్వస్థలం కృష్ణా జిల్లా పుట్రేల. సినిమాలపై ఆసక్తితో పుణే ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో దర్శకత్వ శాఖలో కోర్స్ చేసి, కొన్ని సినిమాలకు సహాయ దర్శకుడిగా పనిచేశాను.

● కామారెడ్డికి చెందిన ఓ యువకుడికి ఎదురైన సమస్య ఏమిటి?, దాని పరిష్కారం కోసం అతను ఏం చేశాడు? అనేది మా సినిమా కథ. ప్రతి ఒక్కరూ అనుభూతి చెందే నిజ జీవిత సంఘటనల ఆధారంగా పూర్తి స్థాయి వినోదాత్మకంగా తెరకెక్కించాను. సీరియస్ పాయింట్‌ను ఎంటర్టైన్ చేసేలా చెప్పాం. నా సినిమాలో హీరో పాత్రకు సాయిరామ్ శంకర్ సూటవుతారనిపించి ఆయన్ను తీసుకున్నాం. హెబ్బా పటేల్ పాత్ర సినిమాలో కీలకంగా ఉంటుంది.

నాన్న డైరెక్షన్‌లో సినిమా అప్పుడే



ఆకాశ్ పూరి

హీరోగా నా ప్రతిభను నిరూపించుకున్నాకే నాన్న (పూరి జగన్నాథ్) దర్శకత్వంలో సినిమా చేస్తాను అని హీరో యశ్ పూరి అన్నారు. ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన తన సినీ కెరీర్ గురించి మీడియాతో ముచ్చటించారు. 'నా గత చిత్రం 'చోర్‌బజార్' అంతగా ఆదరణ పొందలేదు. అందుకే ఈ సారి చేయబోయే సినిమా విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నాను. కుటుంబ ప్రేక్షకులను మెప్పించే చిత్రాలు చేయాలనుకుంటున్నాను. కొన్ని కథలు విన్నాను. లవ్‌స్టోరీ, యాక్షన్ జానర్‌లో సినిమాలు ఇష్టం. నాకు అమ్మా, నాన్న ఇద్దరి సపోర్ట్ ఉంది. నాన్న నా స్క్రిప్ట్ చదివి సలహాలిస్తారు. 'డబుల్ ఇస్మార్ట్' టీజర్ రఫ్ కట్ చూశాను. రామ్ గారి నటన చాలా బాగుంది' అని ఆకాశ్ చెప్పారు.

రాణి రుక్మిణీ దేవి



శ్రీవిష్ణు, రీతూవర్మ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'శ్వాగ్'. 'రాజ రాజ చోర' ఫేమ్ హసిత్ గోలి దర్శకత్వంలో ఇది తెరకెక్కుతోంది. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టి.జి విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. రీతూ వర్మ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆదివారం ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. వింజమర వంశంలోని మహారాణి రుక్మిణి దేవిగా రీతూ వర్మను పరిచయం చేశారు. ఈ క్యారెక్టర్ ఇంట్రడక్షన్ వీడియోలో రీతూ వర్మ శ్రీవిష్ణు మాటలను పరిహాసం చేస్తూ కనిపించారు. మగవారి కంటే స్త్రీలు గొప్పవారు, శక్తివంతులు అని చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: వేదరామన్ శంకరన్, సంగీతం: వివేక్ సాగర్

'తెలిసి తెలిసి'



సూపర్ హిట్ చిత్రాల దర్శకుడు త్రినాధరావు నక్కిన క్రైమ్ కామెడీ డ్రామా 'చౌర్య పాఠం'తో నిర్మాతగా మారారు. నక్కిన నెరేటివ్స్ బ్యానర్‌పై నిఖిల్ గొల్లమారి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇంద్ర రామ్, పాయల్ రాధాకృష్ణ హీరో, హీరోయిన్లు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం ఫస్ట్‌లుక్, టీజర్‌కి మంచి స్పందన వచ్చింది. తాజాగా 'చౌర్య పాఠం' నుంచి ఫస్ట్ సింగిల్ 'తెలిసి తెలిసి' పాటని విడుదల చేశారు మేకర్స్. డేవ్ జాండ్ ఈ పాటని కంపోజ్ చేశారు. కళ్యాణచక్రవర్తి త్రిపురనేని లిరిక్స్ అందించారు. శ్వేతా మోహన్, హరిచరణ్ ఈ పాటను ఆలపించారు.

ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది



వి.రఘుశాస్త్రి దర్శకత్వంలో త్రిగుణ్ హీరోగా నటించిన చిత్రం 'లైన్ మ్యాన్'. ఈ నెల 15న తెలుగు, కన్నడ భాషల్లో విడుదలవుతోంది. త్రిగుణ్‌కు జోడీగా కాజల్ కుందెర్ నటించారు. శనివారం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు శివ కందుకూరి ముఖ్య అతిథిగా విచ్చేసి "ట్రైలర్ చాలా బాగుంది. మన మూలాల్లోకి వెళ్లి రాసుకునే కథలు, తీసే సినిమాలు ఆడియెన్స్‌కు ఎక్కువగా కనెక్ట్ అవుతాయి" అని అన్నారు. త్రిగుణ్ మాట్లాడుతూ "మనం ఇప్పుడు ఫోన్, టీవీ వంటి వాటికి బానిసల్లా మారాం. ఓ గంట కరెంట్ లేకపోతే ఉండలేని పరిస్థితికి వచ్చాం. ఓ ఊర్లో పది రోజులు కరెంట్ లేకపోతే ఎలా ఉంటుంది? అనేది ఈ సినిమా కథ" అని చెప్పారు. నందినీ రెడ్డి మాట్లాడుతూ.. "ప్రస్తుతం సినిమా కంటెంట్ మారుతోంది. కథే హీరోగా మారింది. ఈ చిత్రం కూడా రియల్ ఇన్సిడెంట్స్ ఆధారంగా తీశారు" అని అన్నారు. వి రఘు శెట్టి మాట్లాడుతూ.. 'మనుషుల్లో మానవత్వం ఇంకా ఉందని చూపించే చిత్రమిది. ఇది ఒక ఊరు కథ" అని అన్నారు.

రెండింతల వినోదంతో



ప్రియదర్శి, అభినవ్ గోమటం, శ్రీకాంత్ అయ్యంగార్, హర్షవర్ధన్ ప్రధాన తారాగణంగా రూపొందిన వెబ్‌సిరీస్ 'సేవ్ ద టైగర్స్'. ఈ సిరీస్ సీజన్ 2 ఈ నెల 15 నుంచి ప్రముఖ ఓటీటీలో స్ట్రీమింగ్ అవనుంది. అరుణ్ కొత్తపల్లి దర్శకత్వంలో మహి వి. రాఘవ్, ప్రదీప్ అద్వైతం నిర్మించారు. ఇటీవలే యూనిట్ ప్రివ్యూ ఈవెంట్‌ను నిర్వహించింది. మహి వి. రాఘవ్ మాట్లాడుతూ 'మన జీవితాల్లోని సరదా సందర్భాలతో, పాత్రోచితంగా ఓ మంచి కామెడీ షో చేయాలనే ఆలోచన నుంచి 'సేవ్ ద టైగర్స్' సిరీస్ రూపొందింది. రెండో సీజన్ కూడా ప్రేక్షకులకు నచ్చుతుంది' అన్నారు. ఒక గొప్ప సిరీస్‌ను మహి క్రియేట్ చేశారు, కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునేలా మా టీం జాగ్రత్తలు తీసుకొంది అని ప్రియదర్శి తెలిపారు. రెండో సీజన్ పైన ప్రేక్షకులకు ఏర్పడ్డ అంచనాలను అందుకునేలా ఈ సిరీస్ ఉంటుందని దర్శకుడు తెలిపారు. సీజన్ 2లో రెండింతల వినోదం ఖాయమని అభినవ్ గోమఠం చెప్పారు.

నేడే ఆస్కార్ వేడుక



ప్రపంచ వ్యాప్తంగా సినీ ప్రేమికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రతిష్ఠాత్మక ఆస్కార్ పురస్కారాల వేడుకకు సర్వం సిద్ధమైంది. భారత కాలమానం ప్రకారం నేటి ఉదయం 4 గంటలకు 96వ ఆస్కార్ చిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో డాల్బీ థియేటర్‌ను ఘనంగా ముస్తాబు చేశారు. హాలీవుడ్ సహా వివిధ దేశాలకు చెందిన పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు.

మెలోడీ మహాలక్ష్మి

'కేరింత' ఫేమ్ పార్వతీశం హీరోగా, ప్రణీకాన్విక కథానాయికగా నటిస్తున్న చిత్రం 'మార్కెట్ మహాలక్ష్మి'. వీఎస్ ముఖేశ్ యువ దర్శకత్వంలో అఖిలేశ్ కలారు నిర్మిస్తున్నారు. హర్షవర్ధన్, ముక్కు అవినాష్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కూ, కూరగాయల దుకాణం నడిపే యువతికి మధ్య జరిగే ప్రేమకథతో ఈ చిత్రం రూపొందుతోంది. 'మార్కెట్ మహాలక్ష్మి' నుంచి 'సాఫ్ట్‌వేర్ పోరగా' అంటూ సాగే గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. వీఎస్ ముఖేశ్ సాహిత్యానికి జోఎస్ మవ్ గ్రూవీ స్వరాలు సమకూర్చారు. లోకేశ్వర్ ఆలపించారు.



ఓ నాన్న కథ



కవిన్, అపర్ణ దాస్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'పా...పా...'. మోనిక చిన్నకోట్ల, ఐశ్వర్య, భాగ్యరాజ్, వీటీవీ గణేశ్ ముఖ్య పాత్రలు పోషించారు.. గణేశ్ కె బాబు దర్శకత్వంలో ఎమ్మెస్ రెడ్డి నిర్మించారు. గతేడాది తమిళంలో విడుదలై బ్లాక్‌బస్టర్ గా నిలిచిన 'దాదా' మూవీని తెలుగులో 'పా...పా...'గా డబ్బింగ్ చేస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను ఇటీవల డైరెక్టర్ త్రినాధ రావు విడుదల చేశారు. నిర్మాత ఎమ్మెస్ రెడ్డి మాట్లాడుతూ 'దాదా' సినిమాని 50 రోజుల తర్వాత థియేటర్లో చూశాను, అప్పటికీ 70 శాతం ఆక్యుపెన్సీతో ఆడుతోంది. వెంటనే నచ్చి యుఎస్ లో ఉన్న నా ఫ్రెండ్స్‌కి కాల్ చేసి, చాలా రోజుల తర్వాత ఒక మంచి సినిమా చూశాను అని చెప్పా. దీంతో వాళ్లు ఈ సినిమాని తెలుగులో తీసుకొద్దామన్నారు. అతి త్వరలో ఈ సినిమాని మీ ముందుకు తీసుకువస్తున్నాము" అని అన్నారు.

‘ఈఎఫ్‌టీఏ’తో స్వేచ్ఛా వాణిజ్య బంధం

రూ.8.28 లక్షల కోట్ల పెట్టుబడులకు హామీ.. కొత్తగా 10 లక్షల కొలువులు

న్యూఢిల్లీ: ఐస్‌లాండ్, లీచ్‌టెన్‌స్టీన్, నార్వే, స్విట్జర్లాండ్ దేశాలతో కూడిన యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (ఈఎఫ్‌టీఏ)తో భారత్ కీలకమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద వచ్చే 15 ఏళ్లలో భారత్‌లో 10,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.8.28 లక్షల కోట్లు) పెట్టుబడులు, 10 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు ఈఎఫ్‌టీఏ దేశాలు హామీ ఇచ్చాయి. మన దేశంతో ఎఫ్‌టీఏలు కుదుర్చుకున్న ఏ దేశం లేదా దేశాలు ఇప్పటి వరకు ఇటువంటి హామీ ఇవ్వలేదు. దాదాపు 16 ఏళ్ల సుదీర్ఘ చర్చల తర్వాత భారత్-ఈఎఫ్‌టీఏ మధ్య ఈ ఒప్పందం కుదిరింది. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ సమక్షంలో ఈ దేశాలకు చెందిన ప్రతినిధులు ఒప్పందాలపై సంతకాలు చేశారు.

పారిశ్రామిక ఎగుమతులకు ఊతం: ఈఎఫ్‌టీఏతో కుదిరిన ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో భారత్‌లో తయారయ్యే దాదాపు అన్ని రకాల పారిశ్రామిక ఉత్పత్తులను ఎటువంటి సుంకాలు లేకుండా ఈ నాలుగు దేశాలకు ఎగుమతి చేసేందుకు అవకాశం ఏర్పడనుంది. దీనికి తోడు ప్రాసెస్ చేసిన భారత వ్యవసాయ ఉత్పత్తులకు దిగుమతి సుంకాల్లో ప్రత్యేక రాయితీలు ఇచ్చేందుకూ ఈఎఫ్‌టీఏ అంగీకరించింది. దీంతో ఈ నాలుగు దేశాలకు మన పారిశ్రామిక, ప్రాసెస్ చేసిన వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు గణనీయంగా పెరిగే అవకాశం ఏర్పడింది. ఈఎఫ్‌టీఏలో అతిపెద్ద దేశమైన స్విట్జర్లాండ్ ఈ ఏడాది జనవరి నుంచే భారత పారిశ్రామిక ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను పూర్తిగా ఎత్తివేసింది.

దిగుమతులకు కళ్లెం: ఎగుమతుల పెంపునకు చర్యలు తీసుకుంటూనే.. ఈ దేశాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులు చౌకగా దేశీయ మార్కెట్లోకి ప్రవేశించకుండా భారత్ చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఈఎఫ్‌టీఏ దేశాల నుంచి దిగుమతయ్యే పాడి, పాడి ఉత్పత్తులు, సోయా, సోయా ఉత్పత్తులు, బొగ్గు, కొన్ని కీలకమైన వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు తగ్గించేందుకు భారత్ పూర్తిగా నిరాకరించింది.

అయితే ఈ దేశాలకు చెందిన అకౌంటింగ్, వ్యాపార సేవలు, కంప్యూటర్ సర్వీసులు, పంపిణీ, ఆరోగ్య సేవల వంటి 105 రకాల సేవలపై ఆంక్షల సడలింపులకు అంగీకరించింది. అందుకు ప్రతిగా భారత ఐటీ, న్యాయ నిపుణులు, ఆడియో-విజువల్, ఆర్ అండ్ డీ, కంప్యూటర్, అకౌంటింగ్, ఆడిటింగ్ నిపుణుల రాకపోకలకు ఈఎఫ్‌టీఏ దేశాలు అంగీకరించాయి.

తగ్గనున్న స్విస్ వాచీలు, చాక్లెట్ల ధర

ప్రపంచ ప్రఖ్యాత స్విస్ వాచీలు, గడియారాలు, బిస్కెట్లు, చాక్లెట్లను కూడా ఈ ఎఫ్‌టీఏలో చేర్చారు. దీంతో రోలెక్స్, ఒమెగా, కార్టియర్ వంటి స్విట్జర్లాండ్‌లో తయారయ్యే వాచీలపై దిగుమతి సుంకాలు తగ్గి, వాటి ధరలూ తగ్గనున్నాయి. అయితే ఇందుకోసం భారత వినియోగదారులు ఈ ఎఫ్‌టీఏ అమల్లోకి వచ్చిన ఏడు నుంచి పదేళ్ల పాటు వేచి చూడాలి. ఇక ఐదు నుంచి 15 డాలర్ల మధ్య ఉండే స్విస్ మద్యంపై దిగుమతి సుంకాన్ని తొలి ఏడాదే 150 శాతం నుంచి 100 శాతానికి తగ్గించేందుకూ మన దేశం అంగీకరించింది. తర్వాత పదేళ్లలో దీన్ని 50 శాతానికి తగ్గిస్తారు.

● జీనోమ్ వ్యాలీలో జీవీ రీసెర్చ్ పరిశోధనా కేంద్రం

న్యూఢిల్లీ: హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో 1.3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం గల ఆర్ అండ్ డీ ఫెసిలిటీని జీవీ రీసెర్చ్‌కి 10 సంవత్సరాల కాలానికి లీజుకిచ్చినట్లు లైఫ్ సైన్స్ పార్కుల అభివృద్ధి కంపెనీ ఆర్ఎక్స్ ప్రొపెల్లెంట్ ప్రకటించింది. ఆర్ఎక్స్ ప్రొపెల్లెంట్.. హైదరాబాద్, ముంబై, బెంగళూరు నగరాల్లో సైన్స్ పార్కులు అభివృద్ధి చేస్తోంది. జీనోమ్ వ్యాలీలోని నెక్స్‌పోలిస్ లైఫ్ సైన్స్ పార్క్‌లో 1.3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం గల ప్రదేశాన్ని ఇంటిగ్రేటెడ్ కాంట్రాక్ట్ రీసెర్చ్ సంస్థ జీవీ రీసెర్చ్‌కి 10 ఏళ్ల కాలానికి లీజుకిచ్చామని, దీనిపై తమకు రూ.162 కోట్లు అద్దె ఆదాయం వస్తుందని ఆర్ఎక్స్ ప్రొపెల్లెంట్ సీఈఓ మిలింద్ రవి చెప్పారు.

హైదరాబాద్‌లో బిలిటి ఎలక్ట్రిక్ త్రీ-వీలర్ ప్లాంట్

రూ.400 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్: కాలిఫోర్నియా కేంద్రంగా పని చేసే బిలిటి ఎలక్ట్రిక్ కంపెనీ హైదరాబాద్‌లో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ సమక్షంలో ఆదివారం ఈ ప్లాంట్‌కు శంకుస్థాపన జరిగింది. రూ.400 కోట్ల పెట్టుబడితో నెలకు 2,000 ఎలక్ట్రిక్ త్రీ వీలర్స్ తయారు చేసేలా ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనున్నారు. బాహ్య వలయ రహదారి (ఓఆర్ఆర్) సమీపంలోని వెలిమెల గ్రామ సమీపంలో 13 ఎకరాల్లో ఏర్పాటు చేసే ఈ ప్లాంట్ ద్వారా 10,000 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఎలక్ట్రిక్ త్రీ వీలర్స్‌తో పాటు ఈ ప్లాంట్‌లో అధునాతన లిథియం అయాన్ బ్యాటరీలను కంపెనీ తయారు చేయనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ		విజయవాడ	433
హైదరాబాద్	410	విశాఖపట్నం	475
11వ తేదీ		వరంగల్	412
చిత్తూరు	503		
గోదావరి	433	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	గోదావరి	116
వరంగల్	112	విజయవాడ	116
కరీంనగర్	112	గుంటూరు	116
మహబూబ్‌నగర్	112	ఒంగోలు	116
కర్నూలు	112	చిత్తూరు	120
విశాఖపట్నం	103		

పోర్టబుల్ ఏయూవీల నిర్మాణంలోకి హెచ్‌ఎస్‌ఎల్

మల్కాపురం (విశాఖ సిటీ): విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్) నౌకల నిర్మాణ రంగంలో మరో అడుగు ముందుకేసింది. డాల్ఫిన్ పేరుతో పోర్టబుల్ అటానమస్ అండర్ వాటర్ వెహికల్స్ (ఏయూవీలు) నిర్మాణానికి ఆదివారం పెంటగాన్ రగ్ సిస్టమ్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. నౌకల నిర్మాణంలో రోజురోజుకు వస్తున్న మార్పుల్లో భాగంగా సాంకేతికంగా మరింత ఎదగాలనే యోచనతో ఏయూవీల నిర్మాణానికి ఇరు సంస్థలు సిద్ధమయ్యాయి.

● ఆంధ్రప్రదేశ్‌లో సీఎన్‌జీ ధరలను కేజీకి రూ.2.50 మేరకు తగ్గించినట్లు ఏజీ అండ్ పీ ప్రథమ్ వెల్లడించింది. ఈ ధరల తగ్గింపుతో నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అనంతపురం, కడప జిల్లాల్లోని వాహనదారులకు లబ్ధి చేకూరనుంది.

● సామ్‌సంగ్ ఇండియా.. బెంగళూరులో రెండో ప్రీమియం ఎక్స్‌పీరియన్స్ స్టోర్‌ను ప్రారంభించింది. సామ్‌సంగ్ ఉత్పత్తుల విక్రయం, సర్వీస్‌కు ఈ స్టోర్.. వన్‌స్టాప్ షాప్‌గా ఉండనుంది.

22,750 పైన బుల్లిష్

(మార్చి 11-15 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్నికల్ వ్యూ

నిఫ్టీ గత వారం 22,524-22,224 పాయింట్ల మధ్యన కదలాడి 116 పాయింట్ల లాభంతో 22,494 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,750 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 21,869, 21,787, 20,502, 20,088 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,900 **బ్రేక్‌డౌన్ స్థాయి :** 22,100
నిరోధ స్థాయిలు: 22,700, 22,800, 22,900 (22,600 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 22,300, 22,200, 22,100 (22,400 దిగువన బేరిష్)

ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా షేర్లలో ర్యాలీకి చాన్స్..!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మెరుగ్గా కదలాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. మార్కెట్లో అప్‌ట్రెండ్ ఉండటమే ఇందుకు కారణం. ఫియర్ ఇండెక్స్ ఇండియా విక్స్ కాస్త తగ్గటం కొద్దిగా ఊరట కలిగించే అంశం. ఇన్వెస్టర్లు నాణ్యమైన షేర్లు ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తే కొనుగోలు చేయటం బెటర్. ఈ వారం ఫార్మా, ఎఫ్‌ఎంసీజీ షేర్లు ర్యాలీని కనబరిచే వీలుంది. నిఫ్టీ మార్చి ఫ్యూచర్స్ మద్దతు స్థాయి 22,400, నిరోధం 22,550 వద్ద ఉన్నాయి.

స్టాక్ రికమండేషన్స్

హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్: గత వారం నుంచి ఈ కౌంటర్‌లో మంచి మూమెంటమ్ కనిపిస్తోంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. సుదీర్ఘకాలంగా కన్సాలిడేట్ అవ్వడంతో మంచి బేస్ ఏర్పడింది. గురువారం ఈ షేరు నెల గరిష్ఠ స్థాయి రూ.616 స్థాయిని అధిగమించి రూ.621 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.600 పై స్థాయిలో ప్రవేశించి రూ.660/715 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.585 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కోటక్ మహీంద్రా బ్యాంక్: రెండేళ్లుగా ఈ స్టాక్ సైడ్‌వేస్‌లో కొనసాగుతూ వస్తోంది. మరోసారి సుదీర్ఘకాల మద్దతు స్థాయికి రావటంతో డిమాండ్ పెరుగుతోంది. చివరి ఐదు సెషన్లలో కొంత మూమెంటమ్ కనిపించింది. గత గురువారం ఈ షేరు రూ.1,748 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.1,740/1,720 వద్ద పొజిషన్ తీసుకుని రూ.1,850/1,970 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,680 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సన్ ఫార్మా: ఈ షేరు గడచిన ఏడాది కాలంగా బలమైన అప్‌ట్రెండ్‌తో దూసుకుపోతోంది. ఫార్మా, నిఫ్టీలను తోసిరాజని మెరుగ్గా రాణిస్తోంది. గత గురువారం ఈ షేరు రూ.1,605 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.1,550 ఎగువన ఏ స్థాయిలోనైనా ప్రవేశించి రూ.1,720/1,900 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,525 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి. నాణ్యమైన ఈ షేరును ధర తగ్గే కొద్దీ అక్యుములేట్ చేసుకోవచ్చు.

టాటా పవర్: అప్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తున్న ఈ కౌంటర్‌కు చాలా సానుకూలతలు ఉన్నాయి. గత గురువారం ఈ షేరు ఆల్‌టైమ్ హై రూ.412 స్థాయిని అధిగమించి రూ.425 వద్ద ముగిసింది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ విపరీతంగా నమోదైంది. దీంతోపాటు అప్పర్ బొలింజర్ బ్యాండ్‌ను బ్రేక్ చేసింది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.400 శ్రేణిలో ప్రవేశించి రూ.445/525 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.390 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఫినోలెక్స్ ఇండియా: నిఫ్టీతో పోల్చితే ఈ కౌంటర్ జోరును ప్రదర్శిస్తోంది. అప్పర్ బొలింజర్ బ్యాండ్, నెల గరిష్ఠ స్థాయిని అధిగమించటమ సానుకూల అంశాలు. పైగా డెలివరీ, ట్రేడింగ్ పరిమాణం పెరుగుతోంది. గత గురువారం ఈ షేరు రూ.231 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.220 శ్రేణిలో ప్రవేశించి రూ.285/300 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.210 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.


- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

22,550 పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 22,350 వరకు వెళ్లి మైనర్ రియాక్షన్‌లో 22,200 వరకు దిగజారినప్పటికీ ఆ స్థాయిలో బౌన్స్‌బ్యాక్ సాధించి మరోసారి జీవిత కాల గరిష్ఠ స్థాయిలు నమోదు చేసింది. వారంలో 115 పాయింట్ల లాభంతో వారం గరిష్ఠ స్థాయి 22,500 కన్నా పైన క్లోజయింది. గత ఆరు వారాల్లో నిఫ్టీ నిలకడగా, మందకొడిగా అప్‌ట్రెండ్ సాధిస్తూ 1,400 పాయింట్ల వరకు లాభపడింది. ప్రస్తుత ర్యాలీలో పలు రియాక్షన్లు ఎదురైనా మద్దతే స్థాయిల కన్నా పైనే నిలకడగా ఉంది. అయితే గత వారంలో మిడ్‌క్యాప్ 100 సూచీ 190 పాయింట్లు, స్మాల్‌క్యాప్ 100 సూచీ 460 పాయింట్ల నష్టంతో ముగిశాయి. ఈ వారంలో వెలువడనున్న అమెరికా, భారత ద్రవ్యోల్బణ గణాంకాలు మార్కెట్ కదలికలపై ప్రభావం చూపవచ్చు. ప్రపంచ మార్కెట్ల ధోరణులను బట్టి చూసినట్టయితే మార్కెట్ ఈ వారం అప్రమత్తంగా ప్రారంభమయ్యే ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం నిఫ్టీ ప్రధాన నిరోధం 22,550 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ తర్వాత తాజా గరిష్ఠ స్థాయిల్లోకి ప్రవేశిస్తుంది. మానసిక అవరోధాలు 22,800, 23,000. ఈ స్థాయిల్లో స్వల్పకాలిక కన్సాలిడేషన్ ఉండవచ్చు.

బేరిష్ స్థాయిలు: ప్రధాన మద్దతు స్థాయి 22,400 కన్నా దిగజారితే మరింత బలహీనతను సూచిస్తుంది. దిగువన మరో మద్దతు స్థాయి 22,200. ఇక్కడ కూడా విఫలమైతే ఇంకా బలహీనపడుతుంది. స్వల్పకాలిక మద్దతు స్థాయి 22,000.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం మరింత అప్‌ట్రెండ్ సాధించి 48,200 వరకు వెళ్లినా మైనర్ రియాక్షన్‌కు గురయింది. చివరికి ముందు వారంతో పోల్చితే 550 పాయింట్ల లాభంతో 47,830 వద్ద ముగిసింది. ప్రస్తుతం జనవరిలో ఏర్పడిన జీవితకాల గరిష్ఠ స్థాయికి చేరువలో ఉంది. మరింత అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయి 48,200 కన్నా పైన నిలదొక్కుకోవాలి. తదుపరి నిరోధం 48,600. ప్రస్తుత మద్దతు స్థాయి 47,500 వద్ద విఫలమైతే అప్రమత్తతను సూచిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 47,000.

పాటర్న్: మార్కెట్ ప్రస్తుతం స్వల్పకాలిక ఓవర్‌బాట్ స్థితిలో ప్రవేశిస్తోంది. గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తంగా ఉండాలి. 22,200 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడవచ్చు.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	22,550, 22,620
మద్దతు	22,400, 22,340

www.sundartrends.in

స్పోర్ట్స్

రాకెట్ వీరులు మళ్లీ కొట్టారు

సాత్విక్ జోడీదే ఫ్రెంచ్ ఓపెన్

రెండోసారి టైటిల్ కైవసం



పారిస్: బ్యాడ్మింటన్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి మరోసారి అత్యద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. ఈ ఏడాది జరిగే ఒలింపిక్స్‌కు వేదికైన పారిస్‌లో విజయబావుటా ఎగురవేసి స్వర్ణ పతకంపై అంచనాలను పెంచేసింది. ఈ ప్రపంచ నెంబర్‌వన్ జంట ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 టోర్నమెంట్‌లో డబుల్స్ చాంపియన్‌గా నిలిచి ఈ సీజన్‌లో తొలి టైటిల్‌ను దక్కించుకుంది. ఈ ఏడాది మలేసియా, ఇండియా ఓపెన్‌లలో ఫైనల్ చేరినా, రన్నరప్‌తోనే సరిపెట్టుకుంది. ఆదివారం ఇక్కడ జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో సాత్విక్ జోడీ 21-11, 21-17తో చైనీస్ తైపీ ద్వయం లీ జె హుయి-యాంగ్ పో హ్సువాన్‌ను ఓడించింది. సాత్విక్ జోడీకిది రెండో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్. తొలిసారిగా 2019లో ఇక్కడ రన్నరప్‌గా నిలిచిన ఈ ఏస్ జంట.. ఆ తర్వాత 2022లో విజేతగా నిలిచింది. సాత్విక్, చిరాగ్‌లకిది ఓవరాల్‌గా ఏడో వరల్డ్ టూర్ టైటిల్ (సూపర్ 300, ఆపై స్థాయి హోదా) కాగా.. రెండో సూపర్ 750 ట్రోఫీ.

అలవోకగా..: స్థాయికి తగ్గ ఆటతీరుతో చెలరేగిన సాత్విక్ జంట కేవలం 37 నిమిషాల్లోనే ప్రత్యర్థి ఆట కట్టించింది. తొలి గేమ్‌ను 15 నిమిషాల్లోనే ముగించిన భారత ద్వయం.. రెండో గేమ్‌లో కళ్లు చెదిరే స్మాష్‌లు, క్రాస్ కోర్టు షాట్లతో లీ జంటను ముప్పుతిప్పలు పెట్టింది. ఆఖర్లో గేమ్ పాయింట్ సాధించే క్రమంలో చిరాగ్ అదుపు తప్పి కింద పడినా, సాత్విక్ అద్భుతంగా ఆడి లాంఛనం పూర్తి చేశాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో చైనా షట్లర్ షి యుకీ 22-20, 21-19తో ప్రస్తుత వరల్డ్ చాంపియన్ కున్లావుట్ (థాయ్‌లాండ్)కు షాకిచ్చి విజేతగా నిలిచాడు. మహిళల సింగిల్స్‌లో అన్ సె యంగ్ (దక్షిణ కొరియా) 18-21, 21-13, 21-10తో యమగుచి (జపాన్)పై నెగ్గి ట్రోఫీ అందుకుంది.

టీమ్ వర్క్‌తోనే..



ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ విజయం భారత జట్టు టీమ్ వర్క్‌కు నిదర్శనమని కోచ్ రాహుల్ ద్రవిడ్ కొనియాడాడు. ఆఖరి టెస్టులో విజయం తర్వాత అతడు డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లనుద్దేశించి మాట్లాడాడు. ‘టెస్టు సిరీస్ ఒక్కోసారి చాలా కఠినంగా సాగుతుంది. మానసికంగా, శారీరకంగా సవాల్ విసురుతుంది. కానీ ఒక ఓటమి తర్వాత వచ్చిన ఈ సిరీస్ విజయం మీకెంతో సంతృప్తిని కలిగించిందని భావిస్తున్నా. కొత్తగా వచ్చిన ఆటగాళ్లు సక్సెస్ కావాలంటే సహచరుల నుంచి తోడ్పాటు అవసరం. ఇక్కడ ఇతరుల గెలుపు కోసం నీవెలా తోడ్పడుతున్నావనే దానిపైనే నీ విజయం ఆధారపడి ఉంటుంది’ అని ద్రవిడ్ జట్టు టీమ్ వర్క్ గురించి సభ్యులకు వివరించాడు.

అన్నింటా నెంబర్‌వన్



టీమిండియా ప్రపంచ క్రికెట్‌ను శాసిస్తోంది. ఇప్పటికే వన్డే, టీ20 ఫార్మాట్లలో నెంబర్‌వన్‌గా కొనసాగుతున్న భారత జట్టు తాజాగా టెస్టుల్లోనూ అగ్రస్థానానికి చేరుకుంది. ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌ను 4-1తో గెలుచుకోవడంతో భారత్ 122 పాయింట్లతో టాప్‌నకు చేరింది. ఆస్ట్రేలియా (117), ఇంగ్లండ్ (111), న్యూజిలాండ్ (101) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (68.56 శాతం)లోనూ భారత్‌దే ఆధిపత్యం. ఇలా నాలుగు విభాగాల్లోనూ టీమిండియా టాప్‌లో దూసుకెళుతుండడం విశేషం.



ఇలా కదా ఆడాలి!

‘జైస్’బాల్‌తో సునామీ

ఇంగ్లండ్ బజ్‌బాల్ చిన్నబోయేలా యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ ఈ సిరీస్‌లో రాణించిన తీరు అతడి కెరీర్‌లో గుర్తుండిపోతుంది. ఏకంగా ఐదు టెస్టుల్లో 712 పరుగులు సాధించి ఎన్నో రికార్డులను నెలకొల్పాడు. వైజాగ్, రాజ్‌కోట్ టెస్టుల్లో డబుల్ సెంచరీలతో ఔరా.. అనిపించాడు. ముఖ్యంగా వైజాగ్‌లోని రెండో టెస్టులో అతడి 209 పరుగులే సిరీస్‌లో తొలి విజయానికి దోహదపడ్డాయి. ఈ సిరీస్‌లో అతను బాదిన 26 సిక్సర్లు జైస్వాల్ పవర్‌గేమ్‌కు నిదర్శనంగా నిలుస్తాయి. అటు యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ రెండు సెంచరీలతో రాణించి 452 రన్స్‌తో రెండో స్థానంలో నిలిచాడు.

స్టార్ బ్యాటర్ కోహ్లీ, వెటరన్ పేసర్ షమి సిరీస్ మొత్తానికి అందుబాటులో లేరు. మిడిలార్డర్ బ్యాటర్ రాహుల్ ఆడింది ఒక్క మ్యాచే.. ఉప్పల్‌లో తొలి టెస్టు ఓటమి తర్వాత ఆల్‌రౌండర్ జడేజా కూడా తర్వాతి మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఈ దశలో 0-1తో రెండో టెస్టు బరిలోకి దిగిన భారత జట్టు వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో నెగ్గి.. ఇంగ్లండ్ బజ్‌బాల్ గేమ్‌కు తూట్లు పొడుస్తుందని ఎవరైనా ఊహించారా? కానీ అక్షరాలా జరిగింది అదే. ప్రత్యర్థినే ఉక్కిరిబిక్కిరి చేస్తూ ఏ ఒక్క టెస్టును ఐదు రోజుల వరకు కూడా తీసుకెళ్లకుండా రోహిత్ సేన స్వదేశంలో వరుసగా 17వ సిరీస్‌ను సాధించింది. ఆఖరి టెస్టులో రెండున్నర రోజుల్లోనే ఇన్నింగ్స్ గెలుపు అందుకుంది. ఇందుకు ప్రధాన కారణం జట్టులోని యువ ఆటగాళ్లు. వీరికి సీనియర్లు సహకారం అందించడంతో ఘన విజయం సాధ్యమైంది.

అరంగేట్రం అదిరేలా..

కొందరు సీనియర్లు జట్టుకు దూరమవడంతో ఏకంగా ఐదుగురు ప్లేయర్లు ఇంగ్లండ్‌తో సిరీస్‌లో అరంగేట్రం చేశారు. ఇందులో రజత్ పటీదార్ మినహా సర్ఫరాజ్, కీపర్ ధ్రువ్ జురెల్, పేసర్ ఆకాశ్ దీప్, దేవ్‌దత్ పడిక్కళ్ తమ ప్రదర్శనతో కెప్టెన్, కోచ్‌ల నమ్మకాన్ని నిలబెట్టారు. అంతేకాదు.. ఎంత పెద్ద బాధ్యత తీసుకోవడానికైనా సిద్ధమని అంతర్జాతీయ వేదికపై చాటిచెప్పారు. ఒకప్పుడు జట్టులో చోటు దక్కడమే కష్టంగా మారిన సుదీర్ఘ ఫార్మాట్‌లో వచ్చిన చాన్స్‌ను సద్వినియోగం చేసుకుంటూ వహ్వా.. అనేలా ఆడేస్తున్నారు. రాజ్‌కోట్‌లో తొలిసారిగా చోటు దక్కించుకున్న సర్ఫరాజ్, జురెల్ వెంటనే తమ ప్రభావాన్ని చూపారు. జురెల్ తొలి శతకాన్ని తృటిలో కోల్పోయాడు. ఇక, సర్ఫరాజ్ రాజ్‌కోట్‌లో రెండు ఇన్నింగ్స్‌లోనూ అర్ధ సెంచరీలతో సత్తా చాటాడు. స్పిన్నర్లను అతడు ఎదుర్కొన్న తీరు అందరినీ ఆకట్టుకుంది. ఇక ధర్మశాలలో పేస్‌ను సైతం దీటుగా ఎదుర్కొంటానని మార్క్ ఉడ్ ఓవర్‌లో నిరూపించాడు. శరీరాన్ని విల్లులా వంచేస్తూ సర్ఫరాజ్ ఆడిన ర్యాంప్ షాట్ ఆ మ్యాచ్‌కే హైలైట్. పేసర్ ఆకాశ్ దీప్ రాంచీ టెస్టులో బుల్లెట్‌లాంటి బంతులతో ప్రతీ బంతికి వికెట్ తీసేలా కనిపించాడు. అరంగేట్రంలోనే ప్రత్యర్థి టాపార్డర్‌ను కూల్చి మూడు వికెట్లతో ఆకట్టుకున్నాడు. ఆఖరి టెస్టులో అనూహ్యంగా చోటు దక్కించుకున్న దేవ్‌దత్ ఎలాంటి బెరుకు లేకుండా 65 పరుగులతో అరంగేట్ర ఫిఫ్టీని అందుకున్నాడు. అందుకే యువ ఆటగాళ్ల ఆత్మవిశ్వాసం చూస్తుంటే ముచ్చటేస్తుందని కోచ్ ద్రవిడ్ సైతం ప్రశంసించాడు.

స్థాయికి తగ్గ సీనియర్లు

సిరీస్ విజయంలో సీనియర్ల పాత్రను తక్కువ చేయలేం. వైజాగ్ టెస్టులో వెటరన్ పేసర్ బుమ్రా రివర్స్ స్వింగ్ విధ్వంసం చూశాం. 25 ఓవర్ల పాత బంతితో అతను ఈ స్వింగ్‌ను రాబడుతూ ఆరు వికెట్లతో చెలరేగాడు. ఒల్లీ పోప్‌ను రివర్స్ స్వింగ్ యార్కర్‌తోనే బౌల్డ్ చేయడం సిరీస్‌కే హైలైట్. స్పిన్నర్లు అశ్విన్, జడేజా, కుల్దీప్ ఇంగ్లండ్‌ను ప్రతీ మ్యాచ్‌లో దెబ్బతీశారు. అశ్విన్ 26, జడ్డూ 19 వికెట్లు తీయగా.. రెండో టెస్టు నుంచి కుల్దీప్ కీలకంగా మారి బౌలింగ్‌లోనే కాకుండా బ్యాటింగ్‌లోనూ ఆకట్టుకున్నాడు. ఇలా యువ ఆటగాళ్లు, సీనియర్ల మేళవింపుతో ఇంగ్లండ్‌పై భారత జట్టు అద్భుత సిరీస్ విజయాన్ని అందుకోగలిగింది.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

ఢిల్లీ.. భళా

● ప్లేఆఫ్స్ బెర్త్ ఖరారు
● బెంగళూరుపై ఉత్కంఠ గెలుపు


జెమీమా (58)

న్యూఢిల్లీ: డబ్ల్యూపీఎల్‌లో ఆదివారం హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఒక్క పరుగు తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరును ఓడించింది. 7 మ్యాచ్‌ల నుంచి 10 పాయింట్లతో టాప్‌నకు ఎగబాకిన ఢిల్లీ ప్లేఆఫ్స్ బెర్త్‌ను సొంతం చేసుకొంది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ జెమీమా రోడ్రిగ్స్ (58), అలిస్ క్యాప్సీ (48) మూడో వికెట్‌కు 62 బంతుల్లోనే 97 పరుగులు జోడించడంతో.. తొలుత ఢిల్లీ 20 ఓవర్లలో 181/5 స్కోరు చేసింది. లానింగ్ (29), షఫాలీ (23) రాణించారు. శ్రేయాంక 4 వికెట్లు పడగొట్టింది. ఛేదనలో బెంగళూరు ఓవర్లన్నీ ఆడి 180/7 స్కోరు మాత్రమే చేసింది. కెప్టెన్ స్మృతి మంధాన (5) స్వల్ప స్కోరుకే వెనుదిరిగినా.. మొలినెక్స్ (33), పెర్రీ (49) రెండో వికెట్‌కు 80 పరుగులు జోడించారు. పెర్రీ, మొలినెక్స్ తర్వాత డివైన్ (26), రిచా ఘోష్ (51) బ్యాట్‌లు ఝుళిపించడంతో లక్ష్యం వేగంగా కరిగింది. చివరి ఓవర్‌లో బెంగళూరు గెలుపునకు 17 రన్స్ అవసరమవగా, రెండు సిక్స్‌లతో జోరు చూపిన రిచా గెలుపుగీతను మాత్రం దాటలేకపోయింది. చివరి బంతికి రెండు పరుగులు కావాల్సి ఉండగా.. రిచా సింగిల్ కోసం ప్రయత్నించి రనౌటవడంతో బెంగళూరుకు నిరాశ తప్పలేదు.

నేటి మ్యాచ్

గుజరాత్ x యూపీ
రాత్రి 7.30 గం. నుంచి

సంక్షిప్త స్కోర్లు

ఢిల్లీ: 20 ఓవర్లలో 181/5 (జెమీమా 58, క్యాప్సీ 48; పాటిల్ 4/26).
బెంగళూరు: 20 ఓవర్లలో 180/7 (రిచా 51, పెర్రీ 49; క్యాప్సీ 1/5, కాప్ 1/30).

ఆసీస్ లక్ష్యం 279

ప్రస్తుతం 77/4

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్, ఆస్ట్రేలియా మధ్య రెండో టెస్టు ఉత్కంఠగా మారింది. ఆసీస్ విజయానికి 202 పరుగులు కావాల్సి ఉండగా.. కివీస్ గెలుపునకు 6 వికెట్ల దూరంలో ఉంది. 279 పరుగుల ఛేదనలో మూడో రోజైన ఆదివారం ఆట ముగిసేసరికి ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 77/4 స్కోరు చేసింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 134/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్ 372 రన్స్‌కు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 162, ఆసీస్ 256 రన్స్ చేశాయి.

బజ్‌రంగ్, దహియా ఒలింపిక్స్ ఆశలు ఆవిరి?

సెలెక్షన్ ట్రయల్స్‌లో పరాజయం




సోనెపట్: టోక్యో ఒలింపిక్స్‌లో పతకాలు నెగ్గిన స్టార్ రెజ్లర్లు బజ్‌రంగ్ పూనియా, రవి దహియాకు భారీ షాక్ తగిలింది. జాతీయ జట్టులో చోటు కోసం ఆదివారం నిర్వహించిన సెలెక్షన్ ట్రయల్స్‌లో వీరిద్దరూ ఓటమిపాలయ్యారు. ఫలితంగా పారిస్ విశ్వక్రీడల అర్హత రేసు నుంచి కూడా అవుటయ్యారు. 65 కిలోల విభాగం సెమీస్‌లో బజ్‌రంగ్ 1-9తో రోహిత్ కుమార్ చేతిలో చిత్తయ్యాడు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న వారిలో పూనియా కీలకంగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఇక, ఐవోఏ అడ్‌హాక్ ప్యానెల్ నిర్వహిస్తున్న ఈ ట్రయల్స్ కోసం బజ్‌రంగ్ రష్యాలో శిక్షణ కూడా తీసుకొన్నాడు. కానీ, ట్రయల్స్‌లో అనుకున్నస్థాయిలో రాణించలేకపోయాడు. ఓడిన వెంటనే పూనియా సాయ్ స్పోర్ట్స్ సెంటర్ నుంచి అర్ధంతరంగా వెళ్లిపోయాడు. డోపింగ్ కోసం శాంపిల్ కూడా ఇవ్వలేదు. ఇక, 57 కిలోల విభాగం ఆరంభ రౌండ్‌లో అమన్ షెహ్రావత్ చేతిలో ఓడిన దహియా.. ఆ తర్వాతి బౌట్‌లో ఉదిత్ చేతిలో ఎదురైన పరాజయంతో రేసు నుంచి ఎలిమినేట్ అయ్యాడు. ట్రయల్స్ విజేతలకు వచ్చేనెలలో జరిగే ఆసియా క్వాలిఫయర్స్, మేలో జరిగే వరల్డ్ ఒలింపిక్స్ క్వాలిఫయర్స్‌లో పాల్గొనే చాన్స్ లభిస్తుంది. జైదీప్ (74 కి), దీపక్ పూనియా (86 కి), దీపక్ నెహ్రా (97 కి), సుమీత్ మాలిక్ (125 కి) తమ విభాగాల ట్రయల్స్‌లో విజేతలుగా నిలిచారు.

ముంబై 224 ఆలౌట్

రంజీ ఫైనల్

ఆదుకున్న శార్దూల్ ● విదర్భ 31/3

ముంబై: శార్దూల్ ఠాకూర్ (75, 1/14) ఆల్‌రౌండ్ షోతో.. ముంబై తడబడి నిలిచింది. విదర్భతో ఆదివారం మొదలైన రంజీ ఫైనల్లో తొలి ఇన్నింగ్స్‌లో ముంబై 224 పరుగులకు ఆలౌటైంది. హర్ష్ దూబే, యష్ ఠాకూర్ చెరో 3.. ఉమేశ్ 2 వికెట్లు తీశారు. ఒకదశలో 81/0తో పటిష్ఠంగా కనిపించిన ముంబై.. 30 పరుగుల తేడాతో 6 కీలక వికెట్లు చేజార్చుకొంది. ఓపెనర్లు పృథ్వీ షా (46), భూపేన్ (37) ఫర్వాలేదనిపించినా.. కెప్టెన్ రహానె (7), శ్రేయాస్ (7) విఫలమయ్యారు. 111/6తో పీకల్లోతు కష్టాల్లో పడిన తరుణంలో.. టెయిలెండర్ల అండతో అర్ధ శతకం సాధించిన శార్దూల్ జట్టుకు గౌరవప్రద స్కోరును అందించాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన విదర్భ తొలి రోజు ఆట ముగిసేసరికి 31/3 స్కోరు చేసింది. శార్దూల్ ఓ వికెట్.. పేసర్ ధవళ్ కులకర్ణి రెండు వికెట్లు తీశారు.





సీఎం జగన్ మాట్లాడుతున్న సమయంలో ఖాళీగా ఉన్న సభాప్రాంగణం (ఇన్‌సెట్‌లో సభ మధ్యలోనే వెళ్లిపోతున్న జనాన్ని ఆపుతున్న పోలీసులు)





ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లోనే భోజనం చేస్తున్న ప్రయాణికులు, చిన్నారులతో బాలింతల అవస్థలు

నిష్క్రమణకు సిద్ధమా?



- జగన్ మాటల్లో బేలతనం!!
- బాబు గెలిచినా తన పథకాలు అమలు చేయాలట!
- ఓటమి గురించి చింత లేదంటూనే టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తుపై విసుర్లు
- మేదరమెట్లలో సీఎం 'వీడ్కోలు' ప్రసంగం?
- ఎక్కడా ధీమా లేదు.. ఉత్సాహమూ కరువు
- బాబు, పవన్‌పైనే విమర్శలు.. బీజేపీపై మాత్రం జంకు

(బాపట్ల/అమరావతి/ఒంగోలు-ఆంధ్రజ్యోతి)

మూడు దశాబ్దాలు రాష్ట్రాన్ని ఏలుతానని ప్రకటించుకున్న సీఎం జగన్మోహన్‌రెడ్డికి ఈ ముచ్చట ఐదేళ్లకే ముగియనుందని అర్థమైపోయిందా..? పదవి పోతుందని ముందుగానే మానసికంగా సిద్ధమయ్యారా..? బాపట్ల జిల్లా మేదరమెట్ల 'సిద్ధం' సభలో ఆయన ప్రసంగం జనానికి వీడ్కోలు పలుకుతున్నట్లుగా ఉందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. నిష్క్రమణ ఖాయమనే బహిరంగంగా వారిని బ్లాక్‌మెయిల్ చేయడానికి ప్రయత్నించారని.. బేలతనం ఆయన మాటల్లో స్పష్టంగా కనిపించిందని.. తనను రెండోసారి గెలిపించకపోతే సంక్షేమ కార్యక్రమాలన్నీ పోతాయని బెదిరింపులకు దిగారని అంటున్నాయి. టీడీపీ సూపర్‌సిక్స్ స్కీంలపై ఆయన విమర్శల్లో పదును లేదని చెబుతున్నాయి. 'వైనాట్ 175' అని ఊదరగొడుతున్న ఆయన.. అధికారం పోతుందన్న చింతలేదన్నారు. అంతేకాదు.. చంద్రబాబు విజయం గురించి ప్రస్తావించారు. రేపు చంద్రబాబు గెలిచినా.. తన పథకాలు అమలు చేయాల్సిందేనని.. టీడీపీ చెప్పిన స్కీంలు చూస్తే దీనికి రెట్టింపు బడ్జెట్ అవుతుందని అనడం.. ఆయనలోని ధీమా సడలుతోందనడానికి నిదర్శనంగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. అలాగే మీడియాపై నేరుగా ఎదురుదాడికి దిగకుండా.. దాని నుంచి ప్రజలే నన్ను కాపాడుకోవాలని ఆయన అభ్యర్థించారు. రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో వైసీపీ నాలుగు 'సిద్ధం సభలు ఏర్పాటు చేయగా.. మేదరమెట్ల సభ నాలుగోది. 2018లో ఎన్డీయేతో తెగతెంపులు చేసుకున్న టీడీపీ.. ఇప్పుడు మళ్లీ బీజేపీతో చెలిమికి సిద్ధం కావడం.. జనసేనతో కలిసి పొత్తు ఖరారు చేసుకోవడం జగన్ అండ్ కోకు మింగుడుపడడం లేదు. అయితే మేదరమెట్ల సభలో సీఎం కేవలం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను మాత్రమే టార్గెట్ చేశారు. బీజేపీ ఊసే ఎత్తలేదు. ప్రసంగంలో ఉత్సాహం, మాటల్లో ధీమా కనబడలేదు.. గంటంబావు మాట్లాడితే అందులో అధిక భాగం టీడీపీ మేనిఫెస్టోను విమర్శించడానికే కేటాయించారు. పైగా టీడీపీ సూపర్‌సిక్స్ గ్యారెంటీలకు పరోక్షంగా ప్రచారం చేయడంతో వైసీపీ శ్రేణులు కంగుతిన్నాయి. ఇక సిద్ధం సభలో వైసీపీ మేనిఫెస్టో ప్రకటిస్తామని ఆ పార్టీ పెద్దలు వారం రోజులుగా ఊదరగొడుతూ వచ్చారు. జగన్ మాత్రం త్వరలో ప్రకటిస్తామంటూ దాటవేశారు. ఇది ఆయనలో మొదలైన బెరుకుకు సూచికగా రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. తన పథకాలకు ఇంత ఖర్చుచేస్తున్నానని.. టీడీపీ చెప్పే పథకాలకయ్యే ఖర్చుకు లెక్కలు వేయించానని, వాటి అమలుకు రెట్టింపు బడ్జెట్ కావాలని ఆయన వ్యాఖ్యానించారు.

శ్రేణులు డీలా..

తమ నేతను హీరోగా ఊహించుకునే వైసీపీ ముఖ్య నేతలు.. సిద్ధం సభలో జగన్ ప్రసంగం తీరు చూసి డీలా పడిపోయారు. ముఖ్యంగా ఆయన ముఖంలో ఎక్కడా సభ తాలూకు ఉత్సాహమే కనిపించలేదని సొంత పార్టీ శ్రేణులే చెబుతున్నాయి. జనాన్ని బ్లాక్‌మెయిల్ చేసే విధంగా.. సంక్షేమ పథకాలు అందాలంటే తననే గెలిపించాలనడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముందుగా ప్రకటించినట్లు సిద్ధం సభా వేదికపై జగన్ మేనిఫెస్టో ప్రకటించకపోవడం వెనక బీజేపీతో టీడీపీ పొత్తే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇన్ని రోజులూ కేంద్రం అండదండలతో అప్పులతో రాష్ట్రాన్ని నెట్టుకొస్తున్న జగన్‌లో ఈ పొత్తు అభద్రతను పెంచిందని అంటున్నారు.

బీజేపీని నేరుగా విమర్శించేందుకు జంకు

సిద్ధం సభావేదికపై పొత్తులపై ఘాటుగానే స్పందించిన జగన్.. యథాప్రకారం చంద్రబాబు, పవన్‌పై తీవ్ర విమర్శలు చేశారు. కానీ కూటమిలోని మూడోపార్టీ బీజేపీని గానీ, ప్రధాని మోదీని గానీ నేరుగా విమర్శించే సాహసం చేయలేదు. ఇన్ని రోజులూ ఎవరు ఎవరితో జత కట్టినా భయం లేదని.. సింహం సింగిల్‌గానే దిగుతుందని బీరాలు పలికారు. అయితే మేదరమెట్ల సభలో ఆయన ముఖంలో కనిపించిన హావభావాలను గమనిస్తే.. బీజేపీతో టీడీపీ-జనసేన పొత్తు ఖాయమవడం ఆయనకు ఆందోళన కలిగిస్తున్నట్లు తెలిసిపోతోందని వైసీపీ నేతలే అంటున్నారు.

సీఎం తడబాటు: సాధారణంగా 40 నిమిషాలలోపే ప్రసంగం ముగించే జగన్ ఆదివారం మేదరమెట్ల సభలో మాత్రం గంటా 15 నిమిషాలు మాట్లాడారు. ఈ సందర్భంగా.. మీ జగన్‌ను గెలిపించేందుకు పొత్తుల పార్టీని ఓడించేందుకు మీరు సిద్ధమేనా అని పలుసార్లు ప్రశ్నించినా.. ప్రజల నుంచి పెద్దగా స్పందన రాలేదు. వేదిక ముందు భాగంలో ఉన్న కొద్దిమంది వైసీపీ కార్యకర్తలు చేతులెత్తినా.. తామూ సిద్ధమన్న స్పందన జనం నుంచి కనిపించక.. వినిపించక జగన్ పదేపదే మీరు సిద్ధమేనా.. మీరు సిద్ధమేనా అని అడిగారు. టీడీపీ ఎన్నికల గుర్తు సైకిల్‌ను, జనసేన ఎన్నికల గుర్తు గ్లాస్‌ను హేళన చేశారు. కానీ బీజేపీ గుర్తు కమలంపై ఎలాంటి వ్యాఖ్యా చేయకపోవడం వైసీపీ శ్రేణుల్లో చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీని ఆయన 'మోదీగారు' అని సంబోధించి.. పవన్‌ను మాత్రం దత్తపుత్రుడిగా వ్యాఖ్యానించడం గమనార్హం. ఇక వైసీపీ అభ్యర్థుల తుది జాబితా గురించి కూడా జగన్ మాట్లాడలేదు. తాను మాటిస్తే దానికి కట్టుబడి ఉంటానని.. ఒకటికి నాలుగు సార్లు ఆలోచించుకున్నాకే హామీ ఇస్తానని తనకు తాను గొప్పగా చెప్పుకొన్నారు. 2019 ఎన్నికలకు ముందు తానేం చెప్పానని జనాలను గుచ్చి గుచ్చి ప్రశ్నించారు. ఈ సమయంలో కొందరు సభికులు.. 25 మంది ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానన్నారని అరిచారు. అదేవిధంగా సంపూర్ణ మద్యనిషేధాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. జగన్ ఆ మాటలను పట్టించుకోలేదు. తనకు అధికారమిస్తే రాష్ట్ర ప్రజల ముఖాల్లో ఆనందాన్ని చూస్తానని మాటిచ్చానని అన్నారు. తనకు ముఖ్యమంత్రి పదవి ఉన్నా లేకున్నా చింతలేదని ప్రకటించారు. ప్రత్యేక హోదా, సంపూర్ణ మద్య నిషేధం, ఏటా జాబ్ కేలెండర్, సీపీఎస్ రద్దు, విద్యుత్ చార్జీల పెంపువంటి అంశాల ప్రస్తావనా తీసుకురాలేదు. తాను గెలిస్తేనే అవ్వాతాతలకు పింఛన్లు వస్తాయని.. విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలు అమలవుతాయని.. లేదంటే అవన్నీ ఉండవని బెదిరించే ప్రయత్నం చేశారు. తాను వచ్చాకే పెన్షన్లు ఇస్తున్నట్లు భ్రమింపజేయాలని చూశారు. ఎప్పటి నుంచో అమలవుతున్న ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కూడా తన ఖాతాలోనే వేసుకున్నారు.

జనానికి నరకం

- మేదరమెట్ల సభకు భారీగా ఆర్టీసీ బస్సులు
- ప్రకాశం జిల్లాలో ప్రయాణికులకు అవస్థలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

డబ్బులు, మద్యం, బిర్యానీ పంచారు. పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు, స్కూల్ బస్సులు కూడా తరలించారు. వైసీపీ నాయకులకు జనసమీకరణ టార్గెట్లు పెట్టారు. ఆర్థిక, అంగ బలాలతో పాటు ప్రభుత్వ వ్యవస్థల దుర్వినియోగానికి తెగబడ్డారు. ఇంత చేసినా ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కొరిశపాడు మండలం మేదరమెట్ల సమీపంలో వైసీపీ నిర్వహించిన దక్షిణ కోస్తాంధ్ర 'సిద్ధం' సభకు ఆశించిన స్థాయిలో జనసమీకరణ చేయలేకపోయారు. మరోవైపు ముఖ్యమంత్రి జగన్ సభ పేరిట జనానికి నరకం చూపించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఆర్టీసీ బస్సుల్లేక ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడ్డారు. హైవేలో ట్రాఫిక్ మళ్లించడంతో వాహనదారులు సతమతమయ్యారు. వందల ఎకరాల్లో సభ అంటూ ఊదరగొట్టినా అంతా కలిపి 50 ఎకరాల్లోపే సభా ప్రాంగణాన్ని పరిమితం చేశారు. హాజరైన జనం కూడా రెండు లక్షల్లోపే ఉంటారని అంచనా. రాష్ట్రంలో నాలుగు ప్రాంతాల్లో సిద్ధం సభలకు శ్రీకారం చుట్టిన వైసీపీ నాలుగో సభను భారీ స్థాయిలో నిర్వహించాలని భావించింది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని నేతలందరినీ అప్రమత్తం చేసి వారికి ఆర్టీసీ బస్సులను భారీగా సమకూర్చింది. ఎక్కడికక్కడ స్థానికంగా విద్యా సంస్థల బస్సులను కూడా వినియోగించుకున్నారు. డబ్బు, మందు భారీగా పంపిణీ చేసినా సిద్ధం సభకు వచ్చేందుకు జనం ఆసక్తి చూపలేదు. సిద్ధం సభా ప్రాంగణంలో పలుచోట్ల మద్యం మత్తులో ఉన్న ప్రజలు రోడ్డుమీద పడి ఉండి కనిపించింది.

ప్రయాణికులకు చుక్కలు

జగన్ సిద్ధం సభ ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ప్రయాణికులకు చుక్కలు చూపించింది. జిల్లాలో 471 ఆర్టీసీ బస్సులు ఉండగా 320 బస్సులను ఆదివారం జరిగిన సిద్ధం సభకు పంపారు. దీంతో చాలా ప్రాంతాల్లో బస్సులు లేక ఆర్టీసీ డిపోలు, బస్టాండ్లు నిర్మానుష్యంగా మారాయి. ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. మండుటెండలో పడిగాపులు కాశారు. అలాగే వందలాది ప్రైవేటు స్కూలు బస్సులను అధికారులతో ఒత్తిడి చేయించి సిద్ధం సభకు తరలించారు. మరోవైపు ఒంగోలుకు 30 కి.మీ దూరంలో జాతీయ రహదారి దగ్గర సిద్ధం సభ నిర్వహించడంతో వాహనదారులు చాలా ఇబ్బంది పడ్డారు. చెన్నై-కోల్‌కతా ప్రధాన రహదారిలో ఒంగోలు నుంచే ఆ మార్గంలో వెళ్లకుండా ట్రాఫిక్‌ను మళ్లించారు.

కావలిలో మనిషికి రూ.1000

మేదరమెట్ల సిద్ధం సభకు తరలివెళ్లే ప్రజలకు ప్రకాశం జిల్లా ఉలవపాడు విడిదిగా మారింది. రాయలసీమ నుంచి ప్రైవేటు కళాశాల బస్సుల్లో జనం తరలివెళుతూ ఆదివారం మధ్యాహ్నం మద్యం దుకాణాల వద్ద హడావుడి చేశారు. నగరి, పుంగనూరు, చిత్తూరు నియోజకవర్గాల నుంచి వెళుతున్న వైసీపీ కార్యకర్తలు బీర్లు, మద్యం భారీగా కొనుగోలు చేశారు. జనసమీకరణ కోసం కావలి ఎమ్మెల్యే ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు ఇచ్చినట్లు సమాచారం.



బస్సులోనే మద్యం తాగుతూ వెళ్తున్న యువకులు

మందు, బిర్యానీ ప్యాకెట్

సిద్ధం సభకు జనాన్ని తరలించేందుకు రాష్ట్ర మంత్రి, ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేశ్ రకరకాల విన్యాసాలు చేసినా బస్సులన్నీ ఖాళీగానే వెళ్లాయి. రెండుమూడురోజుల నుంచి జనాన్ని సమాయత్తం చేసేందుకు మంత్రి నేరుగా చొరవ చూపినా ఆశించిన ఫలితం కన్పించలేదు. ఒక్కొక్కరికి రూ.500 నగదు, మద్యం, బీరు బాటిల్, బిర్యానీ ప్యాకెట్ పంపిణీ చేసినప్పటికీ స్పందన అంతంతమాత్రంగానే ఉంది. సింగరాయకొండ మండలం సోమరాజుపల్లి పంచాయతీ పకీరుపాలేనికి చెందిన యువకులు మద్యం తాగుతూ వెళ్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.




విజయవాడలో బీజేపీ ప్రచార వాహనాలను ప్రారంభిస్తున్న పురందేశ్వరి

దుష్ట శిక్షణ..శిష్ట రక్షణ కోసం పొత్తు

- టీడీపీ, జనసేనలతో మైత్రి సంతోషకరం: పురందేశ్వరి

అమరావతి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దుష్ట శిక్షణ.. శిష్ట రక్షణ జరగాల్సి ఉందని.. తెలుగుదేశం, జనసేనతో బీజేపీ పొత్తు అందుకేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వ్యాఖ్యానించారు. దుష్ట శిక్షణ కోసం శ్రీరామచంద్రుడికి ఆంజనేయుడు, జాంబవంతుడు, విభీషణుడితో పాటు ఉడుత సాయం కూడా అవసరమైందని గుర్తుచేశారు. అధిష్ఠానం నిర్ణయానికి క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలు కట్టుబడి పనిచేస్తారన్నారు. ప్రజాభిప్రాయం చేపట్టి మేనిఫెస్టో రూపకల్పన చేయాలన్న పార్టీ కేంద్ర నాయకత్వం నిర్ణయం మేరకు రాష్ట్రంలో అభిప్రాయాల సేకరణకు 18 మేనిఫెస్టో రథాలను ఆదివారం విజయవాడలో ఆమె జెండా ఊపి ప్రారంభించారు. వీటి ద్వారా రాష్ట్రంలో సుమారు 45వేల కుటుంబాల అభిప్రాయాలు తెలుసుకొంటారు. టీడీపీ, జనసేనతో పొత్తు ఖరారవడం సంతోషకరమని, పోటీ చేసే సీట్ల వివరాలు సోమవారం వెల్లడిస్తామని ఈ సందర్భంగా పురందేశ్వరి తెలిపారు.

షెకావత్, పాండాతో పవన్ భేటీ!



బీజేపీ నేతలు షెకావత్, పాండాతో పవన్

అమరావతి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తుల రాజకీయం ఢిల్లీ నుంచి రాష్ట్రానికి చేరింది. పొత్తులో భాగంగా బీజేపీ, జనసేన పార్టీలు ఏయే సీట్లలో బరిలోకి దిగాలన్న అంశం తేల్చేందుకు బీజేపీ అధిష్ఠానం కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, జాతీయ ఉపాధ్యక్షుడు బైజయంత్ పాండాలను రాష్ట్రానికి ప్రతినిధులుగా పంపించింది. వారు ప్రస్తుతం విజయవాడ నొవాటెల్ హోటల్లో బసచేశారు. ఆదివారం వారితో భేటీ అయిన పవన్ ఏయే స్థానాల్లో ఎవరెవరు పోటీచేయాలన్న అంశంపై దాదాపు గంట పాటు చర్చించారు. అనంతరం సీట్ల అంశంపై సోమవారం మాట్లాడతానని మీడియాకు చెప్పి పవన్ వెళ్లిపోయారు. సోమవారం మరోసారి షెకావత్, పాండాతో సమావేశమవుతారు. రెండు పార్టీలు పోటీచేసే స్థానాలను ఖరారుచేస్తారని తెలిసింది.

మా ఐక్యతపై జగన్‌కు భయమెందుకు?: అచ్చెన్న

అమరావతి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 'జగన్‌కు ప్రజాబలం ఉంటే.. ప్రతిపక్షాల ఐక్యతను చూసి ఎందుకు భయపడుతున్నాడు? మేదరమెట్ల సభ వెలవెలబోయింది. అందుకే మీడియాపై ఆంక్షలు పెట్టారు. జగన్ ప్రజా విశ్వాసం కోల్పోయినందునే మేదరమెట్ల సభకు నిండా లక్ష మంది కూడా రాలేదు. అయినా జగన్ మరోసారి అబద్ధాల విషం కక్కారు' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆరోపించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఒక్కటై.. నియంత దోపిడీని అంతం చేస్తాయని జగన్ భయపడుతున్నారని ఆదివారం ఓ ప్రకటనలో అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. జగన్ పాలనలో అన్ని వర్గాలూ నష్టపోయాయని, జగన్ నేరమయ పాలనలో ఐదు కోట్ల మంది బాధితులేనని చెప్పారు.

టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడిగా బొల్లినేని

టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడిగా బొల్లినేని వెంకట రామారావు నియమితులయ్యారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు అచ్చెన్నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు.

జగన్ బ్లాక్‌మెయిల్!

- తన వల్లే ప్రజలు బతుకుతున్నారట
- మళ్లీ సీఎంగా గెలిపించకపోతే పథకాలన్నీ పోతాయని అబద్ధాలు
- బాబును గెలిపిస్తే అభివృద్ధి ఉండదట
- వలంటీర్లు ఇంటింటికీ వెళ్లాలని వినతి
- గిట్టని మీడియాపై అక్కసు
- దక్షిణ కోస్తాంధ్ర 'సిద్ధం'లో సీఎం అసత్యాలు

(బాపట్ల-ఆంధ్రజ్యోతి)

'అన్నీ నేనే చేశా. నావల్లనే ప్రజలంతా బతుకుతున్నారు. నాకు సీఎం పదవిపై వ్యామోహం లేదు. మళ్లీ సీఎంగా నన్ను గెలిపించకపోతే పేదలకు అందే పథకాలన్నీ పోతాయి. పొత్తులతో వచ్చే వారిని కాదని పేదల కోసం పనిచేస్తున్న నన్ను గెలిపించండి'.. ఇలా ప్రజలను బ్లాక్‌మెయిల్ చేసేలా, అదే సమయంలో టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తును విమర్శిస్తూ ముఖ్యమంత్రి జగన్ ప్రసంగించారు. పనిలో పనిగా గిట్టని మీడియాపైనా అక్కసు వెళ్లగక్కారు. ఆదివారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కొరిశపాడు మండలం మేదరమెట్ల సమీపంలో వైసీపీ నిర్వహించిన దక్షిణ కోస్తాంధ్ర 'సిద్ధం' సభలో జగన్ ప్రసంగం ఆద్యంతం అబద్ధాలు, అసత్యాలతో సాగింది. గత 58 నెలలుగా ఆయా వర్గాలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైసీపీని గెలిపించాలని, తనను మరోసారి సీఎంను చేయాలని అభ్యర్థించారు. అందుకోసం వైసీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించాలని వేడుకున్నారు. రానున్నది ఎన్నికల మహాసంగ్రామమని, మూడు పార్టీలు ఏకమై వస్తున్నాయని, అయితే వారు సైన్యం లేని సైన్యాధిపతులని ఎద్దేవా చేశారు. ఆ పార్టీల పరిస్థితి గత ఎన్నికల్లో చూస్తే ఒక పార్టీకి నోటా కన్నా తక్కువ ఓట్లు వస్తే, మరో పార్టీ చిత్తుగా ఓడిపోయిందన్నారు. ప్రజలను వంచన చేసేందుకు ముగ్గురూ కలిసి వస్తున్నారని, వారికి ఎల్లో మీడియా అండగా ఉందని అక్కసు వెళ్లగక్కారు. వచ్చే ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య సంగ్రామమని పదేపదే చెప్పిన జగన్.. అందులో పేదలు శ్రీకృష్ణుడిగా, తాను అర్జునుడిగా అభివర్ణించుకొని ముందుండి తనను గెలిపించాలని ప్రజలను కోరారు. గడిచిన 58 నెలల్లో సంక్షేమ పథకాల కోసం డీబీటీ ద్వారా రూ.2.75 లక్షల కోట్లు, నాన్ డీబీటీ ద్వారా మరో లక్ష కోట్లు పేదలకు అందించానని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ తనను గెలిపించకపోతే అవన్నీ ఆగిపోతాయన్నారు. రాజకీయ పొత్తులను కాకుండా ప్రజలను, దేవుడిని నమ్ముకొని 'మీ బిడ్డ' ఎన్నికల సంగ్రామంలో దిగుతుంటే, చంద్రబాబు.. ఆయన దత్తపుత్రుడు, మరో జాతీయ పార్టీతో పొత్తు కుదుర్చుకొని మీడియా అండతో వస్తున్నాడన్నారు. చంద్రబాబును గెలిపిస్తే పథకాలు ఆగిపోతాయని, అభివృద్ధి ఉండదంటూ పదేపదే అబద్ధాలు చెప్పారు. ప్రపంచంలో ఎక్కడా తనలా పేదల సంక్షేమం కోసం పథకాలు అమలు చేసిన వారు లేరని, తన వల్లనే రాష్ట్రంలో ప్రజలు బతుకుతున్నారనే రీతిలో చెప్పే ప్రయత్నం చేశారు. ఆద్యంతం సభలో తాను కాబట్టే పేదల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నానని గొప్పలు చెప్తూ మరోవైపు మళ్లీ తనను గెలిపిస్తేనే అవి ప్రజలకు అందుతాయని బ్లాక్ మెయిల్ చేస్తూ ప్రసంగించారు.

జగన్.. గ్రాఫిక్స్ 'షో'

(మొదటి పేజీ తరువాయి)

సొంత రోత మీడియాలో చూపించేందుకు 'షో' చేసింది. ఇదంతా గ్రాఫిక్స్ మాయ అని తేలడంతో సోషల్ మీడియాలో వైసీపీని ఆడుకున్నారు. దీన్ని కవర్ చేసుకోలేక నానా పాట్లు పడింది. మేదరమెట్ల వద్ద 100 ఎకరాల్లో భారీ బహిరంగ సభ నిర్వహించాలని వైసీపీ నేతలు భావించారు. డబ్బు, అధికారాన్ని ఉపయోగించి భారీగా జనసమీకరణ చేయాలని చూశారు. కానీ చివరకు 50 ఎకరాల్లోనే సభా ప్రాంగణం ఏర్పాటు చేశారు. జనాన్ని తరలించేందుకు పెద్దఎత్తున ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు, స్కూల్ బస్సులను తీసుకున్నారు. డబ్బు, బిర్యానీ, మందు పంపిణీ చేశారు. అయినా ఆశించినంత జనం రాలేదు.

గ్రీన్ మ్యాట్ పరచి..

50 ఎకరాల సభా ప్రాంగణంలో దాదాపు 2.50 లక్షల మంది జనం పడతారన్నది సాధారణ అంచనా. అయితే మేదరమెట్ల సభా ప్రాంగణం పూర్తిగా నిండలేదు. సీఎం జగన్ మాట్లాడే సమయంలో ముందుభాగాన కార్యకర్తలు కనిపించగా, వెనుక భాగమంతా బోసిపోయింది. ఈ పరిస్థితిని ముందుగానే ఊహించిన వైసీపీ నేతలు సభకు భారీగా జనం వచ్చారని డబ్బా కొట్టుకోవడానికి 'ముందస్తు' ప్లాన్ వేశారు. ఇందుకు టెక్నాలజీని వాడుకున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సభాప్రాంగణం మొత్తం వీఎఫ్ఎక్స్ గ్రీన్ మ్యాట్ పరిపించారు. గ్రాఫిక్స్ మాయాజాలంతో సిద్ధం సభకు లక్షలాది మంది జనం పోటెత్తినట్టు చూపే ప్రయత్నం చేశారు. ఇందుకు జగన్ రోత మీడియా వంత పాడింది. జగన్ సిద్ధం సభకు 15-20 లక్షల మంది వచ్చారని వైసీపీ నేతలు ప్రకటించుకున్నారు. ఈ క్రమంలో సీఎం జగన్ ప్రసంగ ప్రత్యక్షప్రసారం కూడా డిలేడ్ లైవ్ (కొద్ది నిమిషాల పాటు ఆలస్యంగా ప్రసారం) ఇచ్చారు. లైవ్ మధ్యలో గ్రాఫిక్స్ జత చేసి భారీగా జనం వచ్చినట్లు చూపే ప్రయత్నంలో భాగంగానే అలా చేసినట్లు తేటతెల్లమైంది. జగన్ పార్టీ, ఆయన రోత మీడియా గ్రాఫిక్స్ 'మాయ'పై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు, కామెంట్లు వచ్చాయి.

డ్రోన్ కెమెరాతో దొరికిన వైసీపీ

సభలో ఒక డ్రోన్ కెమెరాతో వీడియో తీసేందుకు అధికారికంగా అనుమతి ఇచ్చారు. సీఎం జగన్ రాకముందు మంత్రి అంబటి రాంబాబు మాట్లాడే సమయంలో ఆవరణలో మరో డ్రోన్ కెమెరా చిత్రీకరణ చేస్తూ కనిపించింది. ఆ డ్రోన్ కెమెరాలో జనం నిండక ఖాళీగా ఉన్న ప్రాంగణం కనిపిస్తుందని, దృశ్యాలు చిత్రీకరిస్తుందని వేదికపై ఉన్న నేతలు బెంబేలెత్తిపోయారు. మంత్రి అంబటి రాంబాబు అయితే ఆ కెమెరాను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశే పంపారని ఆరోపించారు. దమ్ముంటే నేరుగా రావాలని సవాల్ విసిరారు. ఆ వెంటనే ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ కుడా మైక్ ముందుకొచ్చి ఆవేశంతో రెచ్చిపోయి మాట్లాడారు. ఆ వెంటనే పోలీసులు ఎగురుతున్న రెండో డ్రోన్ కెమెరాతో పాటు దానిని ఆపరేట్ చేస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. వైసీపీకి రాజకీయ సలహాలు అందిస్తున్న ఐప్యాక్ సంస్థ ప్రతినిధే ఆ కెమెరాను ఆపరేట్ చేస్తున్నట్టు తేలింది. దీంతో అప్పటి వరకు రెచ్చిపోయి మాట్లాడిన వైసీపీ నేతలు సైలెంట్ అయిపోయారు.

సభలో జామర్లు

సభలో జరిగే లోటుపాట్లు బయటకు పొక్కకుండా ఉండడానికి వైసీపీ మరో కొత్తమార్గాన్ని ఎంచుకుంది. సిద్ధం సభా ప్రాంగణంలో జామర్లు అమర్చి దాదాపు నాలుగు గంటల పాటు అక్కడి జనానికి బాహ్యప్రపంచానికి సంబంధాలు తెంచేసింది. గతంలో జరిగిన సిద్ధం సభకు లక్షల మంది జనం వచ్చారని వైసీపీ నేతలు గొప్పలకు పోయారు. అయితే సెల్ టవర్ ఆధారంగా ఒరిజినల్‌గా సభకు హాజరైన జనం సంఖ్యను గణాంకాలతో టెకీ నిపుణులు ఎండగట్టారు. అధికార పార్టీ చెప్పిన సంఖ్యకు అక్కడ వాస్తవంగా హాజరైన జనానికి పొంతనలేదు. దీంతో వైసీపీ ఈసారి సిగ్నల్స్ నిలిపేసే కొత్త ఎత్తుగడకు తెరలేపిందని తెలుస్తోంది.

'సిద్ధం' సభలో తొక్కిసలాట

- పారిశుధ్య కార్మికుడు మృతి.. మరో ఇద్దరికి గాయాలు
- బస్సునుంచి పడి మరొకరు దుర్మరణం.. సీఎం సభలో అపశృతులు



మృతిచెందిన మురళీకృష్ణ

బాపట్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 'సిద్ధం' సభలో చోటుచేసుకున్న అపశృతుల వల్ల ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. సభ ముగిసిన తర్వాత జరిగిన తొక్కిసలాటలో ఒంగోలుకు చెందిన పారిశుధ్య కార్మికుడు ఊసరగుడి మురళీకృష్ణ (35) మృతిచెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన మురళీకృష్ణకి సీపీఆర్ చేసినా ఫలితం లేకుండా పోయింది. వెంటనే ఆయనను అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించడానికి ప్రయత్నించగా.. ట్రాఫిక్ వల్ల దాదాపు రెండున్నర గంటల పైనే సమయం పట్టినట్లు తెలుస్తోంది. వాస్తవానికి రోజువారీ పనులు ముగించుకుని ఇంటికొచ్చి కుటుంబంతో గడుపుతున్న మురళీకృష్ణను స్థానిక వైసీపీ కార్పొరేటర్ భర్త వచ్చి సభకు తీసుకెళ్లడంతో అక్కడ ఆయన ప్రాణాలు కోల్పోయారు. అయితే పోలీసులు మాత్రం మురళీకృష్ణ ఒక గ్యాలరీ నుంచి మరొక గ్యాలరీకి దూకుతూ కిందపడి ఒత్తిడికి గురై చనిపోయాడని వెల్లడించారు. కాగా, పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన గేదెల బాల దుర్గారావు (27) ఆదివారం మేదరమెట్ల సిద్ధం సభకు వచ్చి తిరిగి వెళ్తుండగా ఆర్టీసీ బస్సు నుంచి జారిపడ్డాడు. తలకి బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. అలాగే చిత్తూరు జిల్లాకు చెందిన ఓ ఏఎస్ఐ కూడా గుండెపోటుకు గురయ్యాడని, సకాలంలో చికిత్స అందడంతో ప్రాణాపాయం తప్పిందని సమాచారం.

వైసీపీ దాడిలో యువకుడికి గాయాలు

సిద్ధం సభకు రానని చెప్పిన యువకుడిపై వైసీపీ కార్యకర్తలు మూకుమ్మడిగా దాడి చేశారు. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. బాపట్ల జిల్లా పంగులూరు మండలంలోని రామకూరులో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. మేదరమెట్ల సమీపంలో ఏర్పాటుచేసిన సిద్ధం సభకు ప్రత్యేక బస్సులలో వైసీపీ కార్యకర్తలు బయల్దేరారు. ట్రాక్టర్ నడుపుతూ గ్రామంలో మంచినీరు తాగేందుకు ఆగిన తలారి ధన చక్రవర్తిని కూడా సభకు రావాలని కోరారు. తాను నిరాకరించడంతో తనపై దాడి చేశారని చక్రవర్తి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

వైసీపీలో విభేదాలు బహిర్గతం

సిద్ధం సభ సందర్భంగా పలుప్రాంతాల్లో వైసీపీలో నెలకొన్న విభేదాలు బహిర్గతమయ్యాయి. పుల్లలచెరువు మండలం సిద్ధన్నపాలెం వెళ్లిన బస్సును ఒక్కరు కూడా ఎక్కకపోవడంతో సాయంత్రం వరకూ గ్రామంలోనే ఉండిపోయింది. కొమరోలు మండలం దద్దవాడ గ్రామానికి వెళ్లిన బస్ టైర్లకు ఆ పార్టీకే చెందిన అసమ్మతి కార్యకర్త పంక్చర్లు పెట్టడంతో అది కదల్లేదు. ఇక, కొరిశపాడు మండలం తూర్పుపాలెం గ్రామానికి చెందిన యర్రం చినల ఎత్తిపోతల పథకం ముంపు గ్రామ రైతులు ఆదివారం సిద్ధం సభ వేదికగా సీఎం జగన్ దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లాలని భావించారు. వీరంతా వైసీపీ సానుభూతిపరులే. కానీ ఉదయమే వారికి పోలీసులు నోటీసులు అందించి సభకు రావడానికి వీల్లేదన్నారు.

'సిద్ధం' ప్రచారానికి 600 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

మైనింగ్ మాఫియాను జగన్ ప్రోత్సహిస్తున్నారంటూ కేంద్ర మంత్రులు ఆరోపిస్తున్నా.. ఎందుకు ఈడీ దాడులు నిర్వహించట్లేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

హోదాపై కేంద్రాన్ని నిలదీశారా?

ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన చట్టాలన్నింటికీ జగన్ బేషరతుగా మద్దతిచ్చారని, ప్రత్యేక హోదా కోసం జగన్ ఏనాడైనా డిమాండ్ చేశారా? అని షర్మిల నిలదీశారు. 2.30 లక్షల ఉద్యోగాలు ఇస్తానన్న జగన్ ఎన్ని ఉద్యోగాలిచ్చాడో చెప్పాలని నిలదీశారు. ఎన్నికలకు రెండు నెలలుందనగా... కేవలం 6,100 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులకు దగా చేశారని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉద్యోగాల్లేక యువత ఐదు వేలు, ఎనిమిది వేల రూపాయల జీతాలకు పనిచేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ మాటలను నిలదీస్తే తనతో సహా కాంగ్రెస్ నేతలందరినీ టెర్రరిస్టుల మాదిరిగా అరెస్టు చేశారని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. యువకుల కోసం కాంగ్రెస్ పార్టీ 'భర్తీ భరోసా' పేరిట మేనిఫెస్టోను తీసుకువచ్చిందని.. దీని మేరకు 30 లక్షల ఉద్యోగాలు దక్కుతాయని షర్మిల చెప్పారు. ఎన్నికల్లో తానెక్కడ పోటీ చేయాలన్న దానిపై త్వరలోనే స్పష్టత ఇస్తామని షర్మిల చెప్పారు.



నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ భవనాలు
పులివెందులలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన బారికేడ్లు (ఇన్‌సెట్)

పూర్తికాని మెడికల్ కాలేజీకి ప్రారంభమా..!

- సొంతూరు పర్యటనకు బారికేడ్లతో దిగ్బంధనమా
- సీఎం జగన్ పర్యటనపై పులివెందుల వాసులు విస్మయం

కడప, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కీలకమైన పదవుల్లో ఉన్నప్పటికీ ప్రతి ఒక్కరికీ 'నా రాష్ట్రం, నా జిల్లా, నా మండలం, నా ఊరు..' అనే భావన ఉంటుంది. కానీ, సీఎం జగన్ మాత్రం డిఫరెంట్. కడప జిల్లా వాసి అయిన ఆయన సొంత ఊరికి వెళ్లినప్పుడు అక్కడి స్థానిక జనంతో మమేకం కావాల్సి ఉంటుంది. కానీ, ఆయన సొంతూరులోనూ బారికేడ్ల మధ్య పర్యటనకు సిద్ధమయ్యారు. అదికూడా పూర్తికాని పనులను ప్రారంభించేందుకు వస్తుండడమే పలు విమర్శలకు తావిస్తోంది. ఐదేళ్ల పాలనలో జగన్ సొంత జిల్లాకు ఇచ్చిన హామీల్లో నెరవేర్చింది ఏమీ లేదు. రెండుసార్లు సిమెంటు ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేసినా అది ఎదుగు బొదుగూ లేకుండా ఉంది. పులివెందులలో రూ.500 కోట్లతో మెడికల్ కాలేజీ పనులు చేపట్టినప్పటికీ అవి ఇంకా పూర్తి కాలేదు. త్వరలోనే ఎన్నికలు ఉండడంతో ఇప్పుడు ఆయన పూర్తికాని ఈ మెడికల్ కాలేజీని హడావుడిగా ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. ఇదే కాక పులివెందులలో మరికొన్ని పూర్తికాని పనులను కూడా ఆయన ప్రారంభించనుండడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. సోమవారం ఉదయం 10-11 గంటల మధ్య సీఎం జగన్ పులివెందులలో పర్యటించనున్నారు. దీనికోసం అధికారులు ఆదివారం రాత్రి నుంచే ఆయన తిరిగే ప్రాంతాలను బారికేడ్లతో లాక్ చేసేశారు. ఇక జగన్ టూరుకు సొంత జిల్లా మీడియాకు కూడా పాసులు ఇవ్వలేదు. జగన్ పర్యటనలో కట్టుబాట్లు, మీడియాకు అవకాశం ఇవ్వకపోవడంపై దేనికి జగన్‌కు భయం అంటూ సొంతూరు వారు చర్చించుకుంటున్నారు.

బ్యానర్ చించాడంటూ దాడి!

- బలవంతంగా కారులో ఎక్కించి ముష్టిఘాతాలు
- మచిలీపట్నం వైసీపీ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అనుచరుల దాష్టీకం

మచిలీపట్నం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): బ్యానర్ చించాడంటూ మచిలీపట్నం వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అనుచరులు ఓ యువకుడిపై దాడి చేసి తీవ్రంగా కొట్టారు. శనివారం రాత్రి కృష్ణాజిల్లా మచిలీపట్నం మండలం ఉల్లిపాలెంలో ఈ దారుణం జరిగింది. పేర్ని కిట్టు పుట్టిన రోజును పురస్కరించుకుని వైసీపీ సోషల్ మీడియా సభ్యుడు పత్తి పవన్ ఇటీవల ఉల్లిపాలెంలో నాలుగైదు చోట్ల బ్యానర్లు కట్టాడు. వాటిలో ఒకటి చిరిగిపోయింది. గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరుడు ఈడే యశ్వంత్ చించాడంటూ వైసీపీ కార్యకర్తలు రెండు కార్లు, ఐదు ద్విచక్ర వాహనాలపై వచ్చి దాడికి పాల్పడ్డారు. మాట్లాడాలి రమ్మంటూ యశ్వంత్‌కు ఫోన్‌చేశారు. ఇంటి నుంచి బయటకు రాగానే మూకుమ్మడిగా దాడి చేశారు. బలవంతంగా కారులో ఎక్కించుకుని తిప్పుతూ ముష్టిఘాతాలు కురిపించారు. అనంతరం అతన్ని చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి అప్పగించే ప్రయత్నం చేశారు. ఉల్లిపాలెం తమ పరిధిలోకి రాదని వారు చెప్పడంతో, బందరు తాలూకా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించారు. పేర్ని కిట్టు ఉపయోగించే కారులోనే నిందితులు వచ్చినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. బాధితుడిని బందరు నియోజకవర్గ టీడీపీ, జనసేన అభ్యర్థి కొల్లు రవీంద్ర, జనసేన మచిలీపట్నం ఇన్‌చార్జి బండి రామకృష్ణ, ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బందరుతాలూకా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి డిమాండ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేయకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

అక్కడ కిమ్.. ఇక్కడ జిమ్..!



(మొదటి పేజీ తరువాయి)

17 ప్యాలెస్‌లుంటే.. ఆంధ్రా జిమ్ జగన్‌కు 6 ప్యాలెస్‌లున్నాయి. కిమ్ సొంత బాబాయిని, అన్ననే లేపేశాడు.. ఆంధ్రా జిమ్ కూడా బాబాయిని లేపేశాడు. తల్లి, చెల్లిని మెడపట్టి బయటకు గెంటేశాడు. కిమ్ వీడియో గేమ్‌లాడితే.. జిమ్ పబ్జీ ఆడుతున్నాడు. కిమ్ దొంగ నోట్లు, గంజాయి, సిగరెట్లు తయారు చేసి అమ్ముతుంటే.. జిమ్ గంజాయి, డ్రగ్స్, నకిలీ మందు, బూమ్ బూమ్, ప్రెసిడెంట్ మెడల్, త్రీ కేపిటల్ అమ్ముతున్నాడు. కిమ్ 340 మందిని చంపేయడంతోపాటు వేలాది మందిని జైలుకు పంపించాడు. జిమ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ సోదరులను ఇబ్బంది పెట్టి అనేక మందిని పొట్టన పెట్టుకున్నాడు' అని విరుచుకుపడ్డారు. కిమ్ తన వద్ద ఉన్న వారికి విలాసవంతమైన భవనాలు కట్టిస్తాడనీ, జగన్ అదే తరహాలో పనికిమాలిన సలహాదారులను పెట్టుకుని రూ.కోట్లు తగలేస్తున్నాడన్నారు. 'నాయనా జగన్.. డేటు, టైం నువ్వు ఫిక్స్ చెయ్.. నువ్వు పెట్టిన బూమ్ బూమ్ మద్యం షాపు వద్దకు వెళదాం. ప్రజలు నీ గురించి ఏమనుకుంటున్నారో విందాం. అందుకు నీవు సిద్ధమా' అని సవాల్ విసిరారు. జగన్ రోజూ ఏం తాగుతాడని ప్రజలను ఆయన ప్రశ్నించారు. బూమ్ బూమ్.. ప్రెసిడెంట్ మెడల్.. ఆంధ్రా గోల్డ్.. ప్రజల రక్తమా అని అడుగగా.. వీటిలో నాలుగో ఆప్షన్.. ప్రజల రక్తం తాగుతాడని జనం చేతులెత్తి చూపించారు. 'అనకాపల్లి టౌన్‌లో ఒక తల్లి మూడు జే బ్రాండ్ మద్యం బాటిళ్లు పట్టుకొని వచ్చింది. ఈ జే బ్రాండ్లు తాగి తన ఇంట్లో ముగ్గురు చనిపోయారని వాపోయిం ది. జే బ్రాండ్లు విషం కంటే దారుణంగా ఉన్నాయనీ, ఆ విషయాన్ని ప్రజలకు చెప్పాలని కోరింది. ప్రతి ఊరిలో మనుషులు చనిపోతున్నారు. ఎప్పుడూలేని విధంగా లివర్ ఫెయిల్ అయి, జనం ఆస్పత్రి పాలవుతున్నారు. ఇది తెలిశాక ఈ జే బ్రాండ్లను ల్యాబ్ టెస్టులకు పంపించాను. ఏం తేలిందంటే.. పంట పొలాల్లో పురుగు మందు కొడితే పురుగులు చస్తాయో లేదో తెలియదు గానీ.. ఈ జే బ్రాండ్ మందు కొడితే మాత్రం పురుగు పారిపోతుందని చెప్పారు' అని తెలిపారు. ఇంకా ఏమన్నారంటే..



అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం శంఖారావం సభకు హాజరైన జనం, ప్రసంగిస్తున్న నారా లోకేశ్

మీ పాలిట మూర్ఖుడిని..

ఎన్టీఆర్ దేవుడు.. చంద్రబాబు రాముడైతే.. వైసీపీ నాయకుల పాలిట లోకేశ్ మూర్ఖుడు. చట్టాన్ని ఉల్లంఘించి ఇబ్బందులు పెట్టిన అధికారులు, వైసీపీ నాయకుల పేర్లు ఈ రెడ్ బుక్‌లో ఉన్నాయి. టీడీపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే జ్యుడీషియల్ విచారణ చేయించి, ఆయా అధికారులను ఉద్యోగం నుంచి డిస్మిస్ చేయడంతోపాటు జైలుకు పంపించే బాధ్యత నాది. ఈ రెడ్‌బుక్ సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. లోకేశ్ ఊరూరా వెళ్లి రెడ్ బుక్‌పేరుతో బెదిరిస్తున్నాడని.. నాపై నాన్ బెయిలబుల్ వారెంట్ ఇవ్వాలని అడిగారు. నేను తప్పుచేసి ఉంటే అరెస్టు చేసుకోవచ్చు. పసుపు సైనికుల పేరుతో జన సైనికులను తిట్టినట్లు.. జనసైనికుల పేరుతో పసుపు సైనికులను తిట్టినట్లు వైసీపీ కుట్ర పన్నుతోంది. టీడీపీ, జనసేన శ్రేణులందరూ అప్రమత్తంగా ఉండాలి. మంగళగిరి నుంచి టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు నాకు ఫోన్ చేశాడు. తాడేపల్లి చెత్తబుట్టలన్నింటిలో పగిలిపోయిన టీవీలు ఉన్నాయని చెప్పాడు. ఎందుకని అడిగితే... టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు ఎప్పుడైతే కుదిరిందో తాడేపల్లి కొంపలో టీవీలన్నీ ఈ సైకో జగన్ పగలగొట్టాడని చెప్పాడు.

ప్రతి బీసీ సోదరుడికీ నెలకు 4 వేలు!

జగన్.. ఐదేళ్లలో బీసీలకు నువ్వు చేసిందేంటి? 26 వేల మంది బీసీలపై దొంగ కేసులు పెట్టావు. 300 మంది బీసీలను నీ ప్రభుత్వం చంపేసింది. స్థానిక సంస్థల్లో వారికి 10 శాతం రిజర్వేషన్‌ను తొలగించావు. బీసీలకు రావాల్సిన 30 సంక్షేమ పథకాలు రద్దు చేశావ్. బీసీ సబ్ ప్లాన్ కింద రావాల్సిన రూ.75 వేల కోట్ల నిధులను దారి మళ్లించావు. బీసీ సోదరులకు టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అండగా నిలబడుతుంది. జయహో బీసీ కార్యక్రమంలో బీసీ డిక్లరేషన్ ప్రకటించాం. 50 ఏళ్లు నిండిన బీసీ సోదరులకు ప్రతి నెలా రూ.4 వేల చొప్పున అందిస్తాం. ప్రిజనరీ జగన్.. విజనరీ చంద్రబాబుకు మధ్య తేడా గుర్తించండి. చంద్రబాబు కేవలం 600 ఎకరాలను సేకరించి కియ పరిశ్రమ తెచ్చారు. తద్వారా 50 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చాయి. జగన్ తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నపుడు లేపాక్షి నాలెడ్జ్ హబ్ కోసం 8,844 ఎకరాలు, సైన్స్ సిటీ కోసం 8వేల ఎకరాలు సేకరించారు. ఇంత భూమి సేకరించినా.. ఒక్క పరిశ్రమ వచ్చిందా.. ఒక్కరికైనా ఉద్యోగం కల్పించారా? మా కూటమి అధికారంలోకి రాగానే ఆ భూములను వెనక్కి తీసుకుని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యత వ్యక్తిగతంగా నేను తీసుకుంటా. రూ.10 వేల కోట్ల విలువైన లేపాక్షి నాలెడ్జ్ భూములను కేవలం రూ.500 కోట్లతో కొనేందుకు జగన్ మేనమామ రవీంద్రనాథ్‌రెడ్డి ప్రయత్నం చేశాడు.



జగన్‌కు సెల్ఫీ చాలెంజ్

రాయలసీమ బిడ్డనని చెప్పుకొనే జగన్‌కు లోకేశ్ సెల్ఫీ చాలెంజ్ విసిరారు. ఆయన పాలనలో సీమ ప్రజల బతుకులు ఛిద్రమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. గజ దొంగ జగన్ కావాలో.. విజనరీ లీడర్ చంద్రబాబు కావాలో సీమ ప్రజలు ఆలోచించాలని కోరారు. ఉరవకొండ నుంచి రాయదుర్గానికి రోడ్డుమార్గాన వెళ్తుండగా.. కణేకల్లు మండలం మాల్యం గ్రామం వద్ద సాగునీరు లేక బీడువారిన పొలాలు, గతుకుల రోడ్లను చూసి లోకేశ్ చలించిపోయారు. ప్రజల కష్టాలను గాలికొదిలేసి, ఇసుక, భూ, మద్యం, మైన్ దందాలతో ప్రజల రక్తాన్ని తాగుతున్న జగన్ రాయలసీమ బిడ్డ కాదనీ.. ఈ ప్రాంతానికి పట్టిన కేన్సర్ గడ్డని మండిపడ్డారు. ఐదేళ్ల పాలనలో పట్టుమని పదెకరాలకు కూడా సాగునీరు అందించలేని అసమర్థుడు జగన్. ఆయనది దరిద్ర పాదం. గత 50 ఏళ్లలో ఎన్నడూలేనివిధంగా అనంతపురం జిల్లా ప్రజలు తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. టీడీపీ హయాంలో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా లక్షలాది మంది సీమ రైతుల జీవితాల్లో వెలుగులు నింపి, కరువు సీమలో కియ పరిశ్రమ ద్వారా కార్ల పంట పండించిన అపర భగీరథుడు చంద్రబాబు' అని తెలిపారు.

'టారిఫ్' తూచ్!

(మొదటి పేజీ తరువాయి)

సంస్థలు(డిస్కమ్)లు వార్షిక ఏఆర్ఆర్‌లను సమర్పించాక.. వాటిని విద్యుత్తు నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) పరిశీలించి ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తుంది. అనంతరం, టారిఫ్ ప్రతిపాదనలకు ఆమోదం తెలుపుతుంది. ఇలా టారిఫ్‌ను ఆమోదించాక ఏడాది మొత్తం అవే ధరలు అమలవుతాయి. ఇది దశాబ్దాలుగా అమలులో ఉన్న విధానం. కానీ, 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక విద్యుత్తు చార్జీల వసూలులో ఒక విధానం లేకుండా పోయిందన్న విమర్శలు వస్తున్నాయి. ఒకసారి వార్షిక ఆదాయ వ్యయ నివేదికను ఈఆర్‌సీ ఆమోదించాక, మధ్యలో విద్యుత్తు చార్జీలలో మార్పులు చేర్పులూ చేస్తూ వినియోగదారులపై ఆర్థిక భారం మోపే అవకాశం ఉండదు. కానీ.. ఇప్పుడు ఆ మార్గదర్శకాలు అమలు కావడం లేదు. 2019 తర్వాత వ్యయ నివేదికలను మూడు నెలలకోసారి.. తర్వాత ప్రతినెలా డిస్కమ్‌లు సమర్పించాల్సి ఉంటుందని సెంట్రల్ ఎలక్ట్రికల్ రెగ్యులేటరీ అథారిటీ(సీఈఆర్‌సీ) మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో.. వార్షిక ఆదాయ వ్యయ నివేదికకు విలువ లేకుండా పోయింది. గడచిన ఐదేళ్లుగా పెరిగిన విద్యుత్తు చార్జీలు.. ట్రూఅప్ పేరిట వినియోగదారులపై పడుతున్న రూ.వేల కోట్ల భారాలను పరిశీలిస్తే డిస్కమ్‌లపై 'నియంత్రణ' తెలుస్తోందని విద్యుత్తు రంగ నిపుణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనల సమయంలో..

టారిఫ్ ప్రతిపాదనల సమయంలో.. డిస్కమ్‌లు అదనపు వ్యయం విషయానికి సంబంధించి ఈఆర్‌సీకి వివరాలను ఎందుకు సమర్పించలేదన్న ప్రశ్నలు తలెత్తాయి. ఒకసారి ధర నిర్ణయం జరిగిపోయి లావాదేవీలు ప్రారంభమయ్యాక.. వాస్తవ ఖర్చులంటూ డిస్కమ్‌లు కొత్తగా ప్రతిపాదనలు చేయడం, వాటికి ఈఆర్‌సీ ఆమోదం తెలిపి, వినియోగదారుల నుంచి డబ్బులు వసూలు చేయడం విమర్శలకు తావిస్తోంది. ఒకసారి ధరను నిర్ధారించాక మళ్లీ వ్యత్యాసాలు ఎందుకు వస్తున్నాయంటూ డిస్కమ్‌లను ఈఆర్‌సీ ఎందుకు నిలదీయడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సోమవారం 2024-25 వార్షిక టారిఫ్‌ను ఈఆర్‌సీ విడుదల చేస్తోంది. ఈ టారిఫ్ విడుదల చేశాక ట్రూఅప్ చార్జీలు ఉండబోవని ఈఆర్‌సీ స్పష్టత ఇస్తుందా? లేదా? అనే సందేహాలు నెలకొన్నాయి. మొత్తానికి.. వార్షిక టారిఫ్ ప్రకటనకు.. ఆచరణకూ పొంతన లేకుండా పోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా నిలకడలేని చార్జీల విధానం అమలులో ఉన్నప్పుడు.. ప్రత్యేకంగా ఈఆర్‌సీ నియంత్రణకు హేతుబద్ధత ఏముంటుందన్న ప్రశ్నలూ తలెత్తుతున్నాయి.

ఐదేళ్లలో ఎనిమిది సార్లు బాదుడు

- 2020 ఫిబ్రవరిలో 500 యూనిట్లు దాటిన వారిపై 90పైసల పెంపుతో రూ.1300 కోట్లు భారం
- 2020 మేలో కరోనా శ్లాబుల మార్పుతో రూ.1500 కోట్లు
- 2021 ఏప్రిల్‌లో కిలోవాట్‌కు రూ.10 పెంచడంతో రూ.3542 కోట్లు భారం
- 2014-19 ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.3669 కోట్లు భారం
- ఏప్రిల్ 2022 శ్లాబులు కుదించడంతో రూ.3900 కోట్లు
- 2021-22 విద్యుత్తు కొనుగోళ్ల సర్దుబాటు పేరుతో రూ.3082 కోట్లు భారం
- 2023 మే నుంచి ఇంధన సర్దుబాటు సర్‌చార్జీ పేరుతో రూ.400 కోట్లు
- 2022-23 ట్రూఅప్ చార్జీల ప్రతిపాదనలు రూ.7200 కోట్లు

అన్నింటా.. 'పెద్ద' రెడ్డే!

(మొదటి పేజీ తరువాయి)

దక్కుతుందో లేదోనని ఆస్తులు బాగా పోగేసుకున్నారు. తనకున్న ప్యాక్షన్ నేపథ్యంతో దౌర్జన్యాలు, అరాచకాలు, అక్రమాలు సాగిస్తూ ఆస్తుల చిట్టాను అమాంతం పెంచేసుకున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే రూ.వందల కోట్లు ఆర్జించారు. వందలాది ఎకరాల భూములు సంపాదించారనే విమర్శలు నియోజకవర్గవ్యాప్తంగా గుప్పుమంటున్నాయి. ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గానికి ఆనుకునే ఉన్న ఎస్సీ నియోజకవర్గంలో ఆయన స్వగ్రామం ఉంది. స్వగ్రామం ఉండే మండలంతో పాటు పక్క మండలంలోనూ దాదాపు 200 ఎకరాలు కుటుంబ సభ్యులతో పాటు తన పేరుతోనూ కొనుగోలు చేశారు.

ఇసుకలో కోట్లు కుమ్ముడు

నియోజకవర్గ పరిధిలో పెన్నానది నుంచి ఇసుక అక్రమంగా రవాణ చేస్తూ రూ.కోట్లు ఆర్జించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యే కనుసన్నల్లోనే అక్కడ ఇసుక మాఫియా నడుస్తోంది. నియోజకవర్గ పరిధిలోని ఓ ప్రముఖ కోన సమీపంలోని గ్రామానికి చెందిన నాయకుడు ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితంగా వ్యవహరిస్తూ వాటా చెల్లిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రతిరోజూ వందలాది టిప్పర్ల ఇసుకను రవాణా చేస్తూ రూ.లక్షల్లో ముడుపులు ముట్టచెప్తున్నారన్న ఆరోపణలున్నాయి. నియోజకవర్గంలో మరో మండల కేంద్రంలో పెన్నానది సమీపాన అనధికారిక ఇసుక రీచ్ ఏర్పాటు చేసుకుని అక్రమంగా తోడేస్తున్నారు. అక్రమ ఇసుక తవ్వకాలతో నదిలో ఏర్పడిన గుంతలు ఎవరి కంటపడకుండా సమీపంలోనే ఉన్న రిజర్వాయర్ గేట్లు ఎత్తేసి నీటితో ఆ గుంతలను నింపేశారు. అక్రమ ఇసుక రవాణా ఆనవాళ్లు లేకుండా చేశారు. ఇలా రూ.కోట్లు వెనకేసుకుంటున్నారు.



కొండల్ని పిండేస్తున్నారు

నియోజకవర్గ పరిధిలో ఓ కోనకు సంబంధించిన కొండతో పాటు కొండలు, గుట్టలను పిండిచేసి భారీ ఎత్తున మట్టిని తరలిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లోనూ ఎమ్మెల్యే కనుసన్నల్లో మట్టిదోపిడీ సాగుతోంది. రోడ్ల నిర్మాణం కోసం మట్టిని తరలిస్తున్నామనే బూచి చూపి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు.

బంధువూ నొక్కుడు

నియోజకవర్గ కేంద్రానికి దేశంలోనే నంబర్ వన్ మున్సిపాలిటీగా నిలిచిన ఘన చరిత్ర ఉంది. అలాంటి మున్సిపాలిటీ.. సదరు నాయకుడు ఎమ్మెల్యేగా గెలిచాక అభివృద్ధిలో వెనుకబడింది. కాగ్ నివేదికలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. మున్సిపాలిటీలో ఏ అభివృద్ధి పనులు జరగాలన్నా ఎమ్మెల్యే సమీప బంధువు కనుసన్నల్లోనే జరగాలి. ఎమ్మెల్యే సమీప బంధువే కాంట్రాక్టరు అవతారమెత్తి రూ.కోట్లు విలువ చేసే రోడ్లు, కాలువ పనులు చేసి బాగా నొక్కేస్తున్నారు. కమీషన్ రూపంలో వచ్చే సొమ్ములో ఎమ్మెల్యేకు వాటాలు వెళ్తున్నట్లు ఆరోపణలున్నాయి.

వెంచర్ల నుంచి ముడుపులు

నియోజకవర్గ కేంద్రం పరిసర ప్రాంతాలన్నీ గ్రానైట్ పరిశ్రమలతో నిండి ఉన్నాయి. సీఎం జగన్ సొంత జిల్లా కడపలోని జమ్మలమడుగు నియోజకవర్గంలో ఓ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన నేపథ్యంలో.. అక్కడ ఆశ్రయం కోల్పోయిన వేలాది మంది ముంపు బాధితులు ఇక్కడికి పెద్ద ఎత్తున వలస వచ్చారు. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంది. అనేక విల్లాలతో పాటు వెంచర్లు వెలిశాయి. వాటి అనుమతి కోసం రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. ఒక్కో వెంచర్ నుంచి రూ.10-15 లక్షలు ముడుపులు పుచ్చుకుంటున్నారన్న విమర్శలున్నాయి. ఆ ముడుపులన్నీ నేరుగా ఎమ్మెల్యే ఇంటికే చేరుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

లగ్జరీ కార్లు..

నియోజకవర్గ కేంద్రం వ్యాపారపరంగా పెద్ద పట్టణం. ఆ పట్టణంలో దాదాపు రూ.2 కోట్లకుపైగా ఖర్చు చేసి బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మించి, కార్యాలయంగా వాడుకుంటున్నారు. ఇక లగ్జరీ కార్లంటే సదరు నాయకుడికి చాలా ఇష్టం. బినామీ పేర్లతో కొనుగోలు చేసి వినియోగించుకుంటున్నారు.

మాజీ ఎమ్మెల్యే ఇంటికెళ్లి..

ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దాడులకు పాల్పడటమే దినచర్యగా ఎంచుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన అనుచరులు మారణాయుధాలతో ఏకంగా ప్రత్యర్థి పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ ఇంట్లోకి వెళ్లి విరుచుకుపడ్డారంటే.. ఆ ఎమ్మెల్యే దౌర్జన్యం ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. అప్పట్లో ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. ఆ సమయానికి ఇంట్లో మున్సిపల్ చైర్మన్ లేరు. ఆయన ఇంట్లో ఉన్నట్లయితే పరిణామాలు ఎలా ఉండేవో ఊహకే అంతుపట్టడం లేదు.

టీడీపీ నేతలపై దాడులు

మున్సిపాలిటీ మురుగునీరు సమీపంలోని పెన్నానదిలోకి వెళుతోంది. దీంతో నదీ జలాలు కలుషితమవుతున్నాయి. మురుగు నీటిని నియంత్రించేందుకు మున్సిపల్ చైర్మన్ మరమ్మతులు చేపట్టేందుకు పూనుకున్నా అధికార పార్టీ నేతలు అడ్డు తగులుతున్నారు. ఆ పనులు చేసేందుకు ముందుకొచ్చిన కాంట్రాక్టర్‌తో పాటు కొందరు టీడీపీ కౌన్సిలర్లపై దాడులకు తెగబడ్డారు. మీడియాపై కూడా దాడులకు దిగారు. ఎమ్మెల్యే తప్పిదాలను సామాజిక మాధ్యమాల్లో ప్రశ్నించిన టీడీపీ కౌన్సిలర్లపైనా దాడులు చేశారు.

అక్రమ కేసులు.. బెదిరింపులు

సదరు నాయకుడు తనకు అనుకూలంగా వ్యవహరించే డీఎస్పీకి పోస్టింగ్ ఇప్పించుకుని, ఆయన ద్వారా ప్రతిపక్ష నేతలు, టీడీపీ మద్దతుదారులపై అక్రమంగా కేసులు నమోదు చేయించి వేధింపులకు గురిచేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా పోలీసు అధికారుల ద్వారా కక్షసాధింపు చర్యలకు దిగారు. కేసుల పేరుతో టీడీపీ నాయకులను స్టేషన్‌కు పిలిపించి హింసించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. మున్సిపాలిటీలో పర్యటనకు వెళ్లిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిపైన ఆ ఎమ్మెల్యే తన అనుచరులతో దాడి చేయించారు. ఓటరు జాబితా పరిశీలించేందుకు కాలనీలకు వెళ్లిన టీడీపీ కార్యకర్తలను ఎమ్మెల్యే కార్యాలయానికి లాక్కొచ్చి చితకబాదారు. తన మాట వినని అధికారులపైనా ఎమ్మెల్యే, ఆయన అనుచరులు జులుం ప్రదర్శిస్తుంటారు. మున్సిపాలిటీలో తన మాట వినలేదని ఓ శాఖకు చెందిన అధికారిని, రెవెన్యూ అధికారిని బెదిరించారు.



వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమంలో మాట్లాడుతున్న వృద్ధురాలు మంగమ్మ

మద్యంతో కుటుంబాలు నాశనం

- 'వైఎస్ఆర్ ఆసరా'లో నిలదీసిన మహిళలు
- మైక్ లాగేసుకున్న వైసీపీ నాయకులు

సీతానగరం, మార్చి 10: 'మద్యం వల్ల మా కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. రోడ్డుకొక బ్రాందీ కొట్టు పెట్టేశారు.. మా వాళ్లు తాగి చస్తున్నారు. మద్య నిషేధమంటూ అధికారంలోకొచ్చి.. ఇప్పుడు మద్యాన్ని విచ్చలవిడిగా మార్చేశారు.. మేం ఎందుకు ఓటేయాలి..' అంటూ బహిరంగ సభ వేదికగా పలువురు మహిళలు వైసీపీ నేతలను నిలదీశారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురంలో ఆదివారం వైఎస్ఆర్ ఆసరా అధికారిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హాజరయ్యారు. ఇదిలా ఉండగా మహిళల నుంచి స్పందన కోసం ఎవరైనా మాట్లాడవచ్చని కార్యక్రమాన్ని నడుపుతున్న గోపిశెట్టి అచ్చారావు పిలుపునిచ్చారు. దీంతో మంగమ్మ అనే వృద్ధురాలు చేయి ఎత్తడంతో ఆమెకు మైక్ ఇచ్చారు. మద్యం కుటుంబాలను నాశనం చేస్తోందని మంగమ్మ చెప్పిన తర్వాత మరొక మహిళ కూడా అదే పంథాలో మద్యం గురించి మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో కంగుతిన్న వైసీపీ నేతలు వారి వద్ద నుంచి మైక్ లాగేసుకున్నారు. ఎవరైనా స్టేజ్ వద్దకు వచ్చి మాట్లాడాలని సూచించారు. కాగా, కార్యక్రమం జరుగుతుండగానే మహిళలు వెళ్లిపోతుండడంతో కార్యకర్తలు, వలంటీర్లు వాళ్లను బతిమలాడుతూ కనిపించారు.

నా కొడుకు ఓడిపోతాడనే.. నేను పోటీ!

- మంత్రి ధర్మాన ప్రసాదరావు వెల్లడి

శ్రీకాకుళం అర్బన్, మార్చి 10: 'రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నా కొడుకు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు ఓడిపోతాడని చెప్పటంతోనే నేను ఎమ్మెల్యేగా పోటీచేస్తున్నాను' అని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. శ్రీకాకుళం నగరంలో ఆదివారం నిర్వహించిన కళింగకోమట్ల సంఘం సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 'ఈ ఎన్నికల్లో నన్ను ఎంపీగా, రామ్‌మనోహర్‌ను ఎమ్మెల్యేగా పోటీ చేయమని అధిష్ఠానం చెప్పింది. అయితే నా కుమారుడిని ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదు. అందుకే నన్ను ఎమ్మెల్యేగా పోటీ చేయమనడంతో శ్రీకాకుళం అభ్యర్థిగా బరిలో దిగుతున్నా' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సొంత పార్టీ నాయకులకే వైసీపీ కండువాలు కప్పి పార్టీలో చేరికల పేరుతో హడావుడి చేశారు.

పోలీసుల్లో 'ట్యాపింగ్' పరేషాన్!

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహారం పోలీసులను కలవర పెడుతుండడం గమనార్హం.

తెలంగాణలో ఏం జరిగింది?

తెలంగాణలో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) డీఎస్పీ ప్రణీత్‌రావు ఫోన్‌ట్యాపింగ్‌కు పాల్పడినట్టు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. దీంతో ఆయనపై చర్యలు తీసుకుంది. వాస్తవానికి 'ఎస్ఐబీ' అంటే మావోయిస్టుల ఉనికి, కదలికలు తెలుసుకునే విభాగం. అధునాతన టెక్నాలజీని వినియోగించి మావోయిస్టు సానుభూతి పరుల ఫోన్లు ట్యాపింగ్ చేసే అధికారం వీరికి ఉంటుంది. కానీ, గత ఏడాది జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు డీఎస్పీ ప్రణీత్‌రావు అధికార పార్టీ బీఆర్ఎస్ ఆదేశాలతో ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, పాత్రికేయుల ఫోన్లు కూడా రికార్డు చేయించారు. ఎవరితో ఎవరు ఏం మాట్లాడుతున్నారో తెలుసుకుని గత ప్రభుత్వ పెద్దలకు చేరవేశారు. ఇలా తమకు మేలు చేసిన ప్రణీత్‌రావును కేసీఆర్ ప్రభుత్వం జాగ్రత్తగా చూసుకుంది. ఎస్ఓటీ అధిపతిగా నియమిస్తూ ప్రత్యేక పదోన్నతి కల్పించింది. అయితే, మొన్నటి ఎన్నికల్లో కేసీఆర్‌కు ఎదురు దెబ్బ తగిలింది. రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. దీంతో ట్యాపింగ్ పాపాలు బయటకు వస్తాయని భావించిన ప్రణీత్‌రావు ఇంటెలిజెన్స్ కార్యాలయానికి వచ్చి ఎస్ఓటీ రూమ్‌లో తాను రికార్డు చేసినవన్నీ ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు ప్రణీత్‌ను బదిలీ చేసి విచారణ చేయడంతో గుట్టు రట్టయింది. 45 హార్డ్ డిస్క్‌లు నాశనం చేసి కొత్తవి పెట్టారని, సెల్లార్‌లో వేల రికార్డులు తగుల పెట్టారని ప్రాథమిక విచారణలో తేలింది. అయితే.. తన పైఅధికారి ప్రభాకర్‌రావు చెప్పినట్లే చేశానని, తాను సొంతంగా ఏమీ చేయలేదని ప్రణీత్ రావు చెబుతున్నా తప్పించుకునే పరిస్థితి మాత్రం లేదు. గవర్నర్ తమిళ సై, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్, కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సహా పలువురి ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇది నిజమని తేలితే తెలంగాణ డీఎస్పీతోపాటు ఆయన వెనకున్న పెద్దలకు సైతం టెలిగ్రాఫ్ చట్టం కింద చర్యలు తప్పవు.

ఇవీ ఉదాహరణలు

- నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి ఏడాది కిందట నిఘా విభాగం అధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు నుంచి ఒక వాయిస్ మెసేజ్ వచ్చింది. పాత మిత్రుడితో శ్రీధర్ రెడ్డి మాట్లాడిన మాటలే అందులో ఉన్నాయి. దీంతో కోటంరెడ్డి అవతలి వ్యక్తికి ఫోన్ చేసి 'నువ్వు నా వాయిస్ రికార్డు చేశావా?' అని అడిగారు. లేదని అవతలి వ్యక్తి చెప్పడంతో ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు గుర్తించారు. మీడియా ముందు ఈ విషయాన్ని వివరించడంతోపాటు కేంద్ర హోంశాఖకు సైతం ఫిర్యాదు చేశారు.
- వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణరాజు తన ఫోను ట్యాపింగ్ చేస్తున్నారంటూ ఇద్దరు సీనియర్ ఐపీఎస్ అధికారులపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు 2022 డిసెంబరులో ఫిర్యాదు చేశారు. ఉద్దేశ పూర్వకంగానే ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్ సీతారామాంజనేయులు, అప్పటి సీఐడీ అధిపతి పీవీ సునీల్ కుమార్ తన హక్కులకు భంగం కలిగిస్తున్నారని ఫిర్యాదు చేయడంతో కేంద్ర హోంశాఖకు పార్లమెంటు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇలా.. ప్రతిపక్ష నాయకులు, ప్రజా సంఘాలు, పాత్రికేయుల ఫోన్లు కూడా రాష్ట్రంలో ట్యాపింగ్ జరుగుతున్నట్లు పలుమార్లు ఆరోపణలు వచ్చాయి. వీటన్నింటికీ ఇక బ్రేక్ వేయాలని పోలీసులు నిర్ణయించినట్లు సమాచారం. దీనికి ప్రధాన కారణం తెలంగాణలో వెలుగు చూసిన ప్రణీత్ రావు ఉదంతమే.

ఏపీలో భయం ఇందుకే!

ఏపీలో బీజేపీ-టీడీపీ-జనసేన కూటమిగా జట్టు కట్టడంతో వైసీపీ ఓటమి ఖరారైందనే వాదన బలంగా వినిపిస్తోంది. ఎప్పుడైతే ఢిల్లీ బీజేపీ పెద్దల నుంచి పొత్తు ప్రకటన అధికారికంగా వచ్చిందో అప్పటి నుంచి పోలీసు అధికారుల్లో మార్పు వచ్చేసింది. ఓడిపోయే నాయకుడి కోసం ఏదో చేసి చిక్కుకు పోవడం కన్నా పూర్తిగా దూరంగా ఉంటే మంచిదనే నిర్ణయానికి వచ్చేశారు. అడ్డగోలుగా జగన్ కోసం పనిచేసే కొందరు అధికారులు ప్రైవేటు హ్యాకర్స్‌తో రహస్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు పోలీసు శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రేపు ప్రభుత్వం మారితే వీరిపై చర్యలు తప్పవనే చర్చ సాగుతోంది. ఇప్పుడు వెలుగు చూసిన తెలంగాణ డీఎస్పీ ప్రణీత్‌రావు ఉదంతం వీరికి కూడా అన్వయం అవుతుందని చెబుతున్నారు. అందుకే ఏపీ పోలీసులు కొందరు భయంతో ఉన్నారని సమాచారం.

తెలంగాణ డీఎస్పీ ప్రణీత్‌రావుపై ఎఫ్ఐఆర్

- ఐపీసీ, పీడీపీపీ, ఐటీ చట్టాల కింద కేసు
- నాన్-బెయిలబుల్ సెక్షన్ల ప్రయోగం

హైదరాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ)లో తన అధికారాన్ని దుర్వినియోగం చేసి, విపక్ష నాయకుల ఫోన్లను ట్యాప్ చేసినట్లు అభియోగాలు ఎదుర్కొంటున్న డీఎస్పీ ప్రణీత్‌రావుపై కేసు నమోదైంది. 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాతి రోజున.. అంటే.. గత ఏడాది డిసెంబరు 4న ప్రణీత్‌రావు కంప్యూటర్లు, హార్డ్‌డిస్క్‌లను కాల్చివేశాడంటూ ఎస్ఐబీ అదనపు ఎస్పీ డి.రమేశ్ ఆదివారం పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పంజాగుట్ట పోలీసులు ప్రణీత్‌రావుపై ఐపీసీలోని 409, 427, 201, 120(బి) సెక్షన్లు, ప్రివెన్షన్ ఆఫ్ డామేజ్ టు పబ్లిక్ ప్రాపర్టీ చట్టంలోని సెక్షన్ 3, సమాచార సాంకేతిక(ఐటీ) చట్టంలోని సెక్షన్లు 65, 66, 70 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రణీత్‌రావు 2018 నుంచి ఎస్ఐబీలో పనిచేస్తున్నారు. తొలుత ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ప్రణీత్‌రావుకు గత ఏడాది యాగ్జిలరీ పదోన్నతి లభించింది. దాంతో డీఎస్పీ అయ్యారు. "ఎస్ఐబీలోని ఇతర బృందాలతో సంబంధం లేకుండా.. తన కోసం ప్రత్యేకంగా రెండు గదులను ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ ఇంటర్నెట్ కనెక్టివిటీతో 17 కంప్యూటర్లను ఏర్పాటు చేసుకున్నారు. గుర్తుతెలియని వ్యక్తుల సమాచారాన్ని రహస్యంగా, అనధికారికంగా, చట్టవిరుద్ధంగా సేకరించేవారు" అని అదనపు ఎస్పీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రణీత్‌రావును పంజాగుట్ట పోలీసులు ఒకట్రెండ్రోజుల్లో అరెస్టు చేసే అవకాశాలున్నాయి. ఇక ప్రణీత్‌రావుపై పంజాగుట్ట పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు నాన్-బెయిలబుల్ కేటగిరీలో ఉన్నాయి. అంటే.. ప్రణీత్‌రావు ముందస్తు బెయిల్ తీసుకునేందుకు వీల్లేదు. అరెస్టయ్యాక కూడా.. బెయిల్ వచ్చే అవకాశాలు తక్కువే.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.